20 . 01. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

మంగళవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 226 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



మధ్యప్రదేశ్ పర్యటనలో భాగంగా సోమవారం రోజున ఇండోర్ చేరుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జె సంగప్ప ఉజ్జయిని శ్రీ మహాకాళేశ్వర్ జ్యోతిర్లింగ ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఇండోర్ చేరుకున్న బండి సంజయ్ కుమార్ ను ఉజ్జయిని ఐజి అఫ్ పోలీస్ ఉమేష్ జోగా మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు.

**ఇండోర్ వెలుతురు జనవరి 19:**

# మేడారంలో గద్దెల పునఃప్రారంభం

## కుటుంబంతో కలసి పాల్గొన్న సిఎం రేవంత్





**ములుగు,జనవరి19 వెలుతురు:** మేడారంలో గద్దెలు, ఆలయ ప్రాంగణాన్ని సీఎం రేవంత్‌రెడ్డి పునఃప్రారంభించారు. అనంతరం తన కుటుంబంతో కలిసి వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మనవడితో కలిసి నిలువెత్తు బంగారాన్ని సీఎం సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా గద్దెల ప్రాంగణంలో పైలాన్‌ను రేవంత్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు కోమటిరెడ్డి, సీతక్క, కొండా సురేఖ, వరంగల్ మేయర్ సుధారాణి ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సిఎం మేడారం రాక సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. .



# బీజేపీ జాతీయ నూతన అధ్యక్షుడు ఎన్నిక ప్రపోజల్ కు ఎమ్మెల్యే పాయల్ శంకర్

**న్యూఢిల్లీ వెలుతురు జనవరి 19:**



బీజేపీ పార్టీ జాతీయ నూతన అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఎన్నిక నేపథ్యంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఢిల్లీకి వెళ్లారు. కొత్త జాతీయ అధ్యక్షునీ ఎన్నికలో బాగంగా నితిన్ నబీన్ ప్రపోజల్ చేసేందుకు తెలంగాణ నుండి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు నేతృత్వంలో సోమవారం పలువురు పార్టీ నేతలు ఢిల్లీకి చేరుకున్నారు. బీజేపీ పార్టీ కి నూతన అధ్యక్షునీ ఎన్నిక తో పార్టీ దేశంలో మరింతగా బలోపేతం అవుతోందని ఎమ్మెల్యే పాయల్ అన్నారు. రానున్న రోజుల్లో దేశ వ్యాప్తంగా ఈ ఎన్నికలు వచ్చిన పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు.

# ప్రతి ఇంటిని సోలార్ ఎనర్జీ కేంద్రంగా మార్చు

## ఆదాయంతో పాటు విద్యుత్ ఆదా

## బోనకల్లులో ప్రారంభించిన డిప్యూటీ సిఎం భట్టి





**ఖమ్మం,జనవరి19 వెలుతురు:** రాష్ట్రంలో ఒక సరికొత్త సోలార్ విప్లవానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శ్రీకారం చుట్టారు. ఈ పథకం ప్రధాన ఉద్దేశం ప్రతి ఇంటిని ఒక విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మార్చడమేనని అన్నారు. ఇకపై ప్రజలు విద్యుత్ శాఖకు బిల్లులు చెల్లించే రోజులు పోయి, విద్యుత్ శాఖే ప్రజలకు డబ్బులు చెల్లించే రోజులు వచ్చాయని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలోని రావినూతల గ్రామం సాక్షిగా దీనికి భట్టి శ్రీకారం చుట్టారు. తెలంగాణ ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం అత్యంత భారీగా నిధులను వెచ్చిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 81 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా దీనిని అమలు చేస్తుండగా, ఒక్క బోనకల్ మండల పరిధిలోనే 306 కోట్ల రూపాయలను కేటాయించారు. అందులోనూ రావినూతల గ్రామంలోని ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ వ్యవస్థల ఏర్పాటు కోసమే 24 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం గమనార్హం. ఈ పథకం ద్వారా ప్రజలకు చేకూరే ఆర్థిక ప్రయోజనాలు అత్యంత ఆకర్షణీయంగా ఉన్నాయి. ప్రతి కుటుంబం తమ ఇంటిపై ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్యానెళ్ల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుని, తమ అవసరాలకు వాడుకోగా మిగిలిన కరెంటును ప్రభుత్వానికి విక్రయించవచ్చు. ఇలా విక్రయించిన ప్రతి యూనిట్‌కు ప్రభుత్వం రూ. 2.57 పైసల చొప్పున నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో జమ

# న్యాయవాదుల రక్షణ చట్టమే నా మొదటి ఎజెండా...!

## ఉమ్మడి పాలమూరులో సీనియర్ డిజిగ్నేటెడ్ కౌన్సిల్ వి రఘునాథ్

- న్యాయవాదుల న్యాయ అంశాలే లక్ష్యంగా...!
- న్యాయవాదులపై దాడులపై తక్షణ విచారణకై కృషి...!
- బార్ కౌన్సిల్ ని పునర్నిర్మిద్దామని పిలుపు...!
- అద్వకేట్ లకు అకాడమీలు ఏర్పాటు చేద్దాం...!
- బార్ కౌన్సెల్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా రఘునాథ్...!






## బిజెపి నూతన అధ్యక్షుడుగా

# నితిన్ నబీన్

- నితిన్‌కు మద్దతుగా నామినేషన్లు
- పోటీలో ఎవరూ లేకపోవడంతో ఏకగ్రీవ ఎన్నిక
- నేడు ప్రముఖుల సమక్షంలో ప్రమాణ స్వీకారం



# అరబ్ అధ్యక్షుడు షేక్ రాక

## స్వయంగా వెళ్లి స్వాగతించిన ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ,జనవరి19( వెలుతురు):** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ భారత్ పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ప్రధాని మోదీ స్వయంగా స్వాగతం పలికారు. కరచాలనం చేసి, ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరూ ఒకే కారులో ప్రయాణించారు. అయితే, విదేశాంగ శాఖ ఇచ్చిన సమాచారం ప్రకారం.. అల్ నహ్యాన్ కేవలం రెండు గంటలే ఢిల్లీలో ఉండనున్నట్లు తెలుస్తోంది. సోదరుడు, యూఏఈ అధ్యక్షుడు అల్ నహ్యాన్‌కు స్వాగతం పలికేందుకు విమానాశ్రయానికి వెళ్లాను. ఇరుదేశాల మధ్య

# సిరిసిల్ల పవర్‌లూమ్‌పై కేంద్రం వివక్ష

- పదేళ్లుగా కోరుతున్నా పట్టించుకోని కేంద్రం
- 8మంది ఎంపిలు ఉన్నా అన్యాయమే
- కేంద్రమంత్రులకు అనేక లేఖలు రాసినా శూన్యం
- మరోమారు కేంద్రమంత్రి గిరిరాజ్‌కు కెటిఆర్ లేఖ



**హైదరాబాద్,జనవరి19 వెలుతురు:** సిరిసిల్ల మెగా పవర్ లూమ్ క్లస్టర్ మంజూరు విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ఉద్దేశపూర్వక జాప్యం , వివక్షాపూరిత వైఖరిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కె. తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు లేఖ రాశారు. సిరిసిల్లలో మెగా పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటు డిమాండ్ నిన్న మొన్నటిది కాదని, గత పదేళ్లుగా తాము నిరంతరాయంగా పోరాడుతున్నామని గుర్తు చేశారు. గతంలో మంత్రిగా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా, సిరిసిల్లా శాసన సభ్యుడిగా పూర్వపు టెక్స్ టైల్ శాఖా మంత్రులకు రాసిన అనేక లేఖలు, అనేక వ్యక్తిగత సమావేశాలు , అధికారిక విజ్ఞప్తులు ఇప్పటివరకు కేంద్రం నుండి ఎటువంటి సానుకూల నిర్ణయానికి నోచుకోకపోవడం అన్యాయమన్నారు. అరుణ్ జైట్లీ , స్మృతి ఇరానీ మొదలుకొని నేటి మంత్రి వరకు ప్రతి ఒక్కరినీ బతిమిలాడాం. రాష్ట్రం నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలు, కేంద్ర కేంద్రం వివక్షకేవలం ఉత్సవ విగ్రహాల్లా మారారన్నారు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నా, కేంద్ర మంత్రివర్గంలో చోటు ఉన్నా, సిరిసిల్ల నేతన్నల గోడును వినిపించడంలో వారు విఫలమయ్యారని కేటీఆర్



# స్పీకర్ గడ్డం ప్రసాద్ కు సుప్రీంకోర్టు నోటీసులు.

- సుప్రీంకోర్టు పిటిషన్ వేసిన బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జనవరి 19:** భారతీయ జనతా పార్టీ తరుపున బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి వేసిన పిటిషన్ కు ఫిబ్రవరి 06 తేది లోపు వివరణ ఇవ్వాలని సుప్రీం కోర్టు సోమవారం రోజున స్పీకర్ గడ్డం ప్రసాద్ కు నోటీసులు జారీ చేసింది. రాజ్యంగాని పరిరక్షించాల్సిన స్పీకర్ ప్రభుత్వానికి భయపడి నిర్ణయం తీసుకోపోకపోవడం రాజ్యాంగానికి తూట్లు పొడిచినట్లే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని చేతపట్టుకుని దేశం మొత్తం తిరుగుతున్నారు కానీ తెలంగాణలో

# గ్రీన్ హైడ్రోజన్‌కు చిరునామాగా ఏపీ

- తిరుపతిలో స్పేస్ సిటీ ఏర్పాటు చేశాం
- ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేశాం
- తెలుగు డయాస్పోరా సమావేశంలో సీఎం చంద్రబాబు



**అమరావతి,జనవరి19 వెలుతురు:** ఏపీ ప్రజలకు బంగారు భవిష్యత్ కల్పించే బాధ్యత తనదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం గ్రీన్ హైడ్రోజన్‌కు ఏపీ చిరునామాగా మారిందని పేర్కొన్నారు. విశాఖపట్నం, తిరుపతి, అమరావతి రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. తిరుపతిలో స్పేస్ సిటీ ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. విశాఖపట్నానికి వేల కోట్ల రూపాయలపెట్టుబడులు

# స్పీకర్‌పై బిజెపి కోర్టు ధిక్కరణ కేసు

## నోటీసులు జారీ చేసిన సుప్రీం



## న్యాయవాదుల రక్షణ చట్టమేనా మొదటి ఎజెండా...!

**వెలుతురు ఉమ్మడి పాలమూరు జిల్లా**

జనవరి 19, 2026: జనవరి 30వ తేదీన జరుగనున్న బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రచార నేపథ్యంలో భాగంగా మాజీ తెలంగాణ రాష్ట్ర హైకోర్ట్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, సీనియర్ డిజిగ్నేటెడ్ కౌన్సిల్ వి రఘునాథ్ ఉమ్మడి పాలమూరు జిల్లాలో పర్యటించిన సందర్భంగా వనపర్తి, నాగర్ కర్నూల్, అచ్చంపేట బార్ అసోసియేషన్ లలో ఉన్న న్యాయవాదులతో మాట్లాడుతూ అనేక సంవత్సరాలనుండి న్యాయవాదులకు వారి వృత్తిలో కల్పించే వసతులలో అత్యంత అన్యాయం జరుగుతుందని, కావున అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ఆవశ్యకత అత్యవసరంగా ఉన్నప్పటికీ ఏ ప్రభుత్వం ఇప్పటికి స్పందించిన దాఖలాలు లేవని, ప్రజాన్యాయం కోసం కృషి చేసే న్యాయ వాదులపై జరుగుతున్న దాడులపై మరియు జరిగే హత్యలపై కనీసం స్పందన లేదని అటువంటి వ్యవస్థ ఉండటంవల్లే అనేకమంది న్యాయవాదులు ఈ వృత్తిలో అనేక ఇబ్బందులు ఎదురుకుంటున్నారని, కావున న్యాయవాదుల సంక్షేమమే ప్రాధాన్యంగా, వారి రక్షణ చట్టమే మొదటి ఎజెండాగా మొదటి సరిగా ఈ ఎన్నికల్లో అడుగుపెట్టానని, న్యాయవాద వృత్తిలో నైపుణ్యం పెంపొందాలంటే, నిత్య విద్యార్థిగా సాంకేతిక పరిజ్ఞానంపై మరియు ఆధునిక సాంకేతికతతో కూడిన బార్ అసోసియేషన్స్ తీర్చి దిద్దాలని, అందుకు తగిన వసతులు బార్ కౌన్సిల్ ఏర్పాట్లు చేయాలనీ కానీ నేటివరకు ఏ విధమైన నాణ్యత ప్రమాణాలు పాటించక పోవటం వల్లే అన్ని జిల్లాల్లో ఉన్న న్యాయవాదులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కావున రానున్న ఐదు సంవత్సరాలలో జ్యుడిషియరీ విధానంలో ఒక నూతన అధ్యాయాన్ని లిఖించే అవకాశం వచ్చిందని, కావున గత 33సంవత్సరాల న్యాయవాద వృత్తిలో ఎన్నో ఒడుదుడుకులు ఎదుర్కొని ఉన్న నేను తెలంగాణ న్యాయ వ్యవస్థలో ప్రక్షాళన చేపట్టి నూతన ఒరవడితో మరో చరిత్రను లిఖించే అవకాశం మీరందరు కల్పించాలని కావున మీ మొదటి ప్రాధాన్యత ఓటు సీరియల్ నెంబర్ 107 కు వేసి గెలుపుకు కృషి చేయాలని రఘునాథ్ అన్నారు. ఈ కార్యక్రమంలో తోటి న్యాయవాదులు పాల్గొన్నారు.

## అరబ్ అధ్యక్షుడు షేక్ రాక

స్నేహానికి ఆయన ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఈ పర్యటన చాటుతోంది‘ అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ఇరు దేశాధినేతలూ చర్చలు జరపనున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ఇంధన రంగాల్లో సహకారం తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. అల్ నహ్యాన్‌కు ప్రధాని మోదీ చెక్కతో కళాత్మకంగా రూపొందించిన ఓ పెద్ద ఊయలను కానుకగా ఇచ్చారు. దీన్ని గుజరాత్‌లో తయారు చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలూ కలిసి కాసేపు ఆ ఊయలపై కూర్చుని సంభాషించుకున్నారు. అదేవిధంగా తెలంగాణలో తయారు చేసిన వెండి పె÷-టటెలో కశ్మీరీ పశ్మీనా శాలువాను బహుమతిగా ఇచ్చారు. అల్ నహ్యాన్ తల్లికి కూడా పశ్మీనా శాలువాతోపాటు కుంకుమ పువ్వు అందజేశారు.ఇరాన్- అమెరికా మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతినడం, యెమెన్ విషయంలో సౌదీ అరేబియా, యూఏఈల మధ్య ఉద్రిక్తతలు, గాజాలో రాజకీయ అస్థిరతలు నెలకొన్నవేళ ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. యూఏఈ అధ్యక్ష హోదాలో అల్ నహ్యాన్ భారత్‌లో అధికారికంగా పర్యటించడం ఇది మూడోసారి. 2022లో ఇరుదేశాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం అనంతరం సంబంధాల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తోంది.

## బిజెపి నూతన అధ్యక్షుడుగా నితిన్ నబీన్

**న్యూఢిల్లీ,జనవరి19( వెలుతురు):**

భారతీయ జనతా పార్టీ చరిత్రలో సరికొత్త అధ్యాయం ప్రారంభం కానుంది. పార్టీ అధ్యక్షుడిగా అత్యంత పిన్న వయస్కుడైన నేత నితిన్ నబీన్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. నామినేషన్లు అన్నీ ఆయన ఒక్కరి పేరుమీదే దాఖలు అయ్యాయి. నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ మంగళవారం అధికారికంగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు ఢిల్లీలో నితిన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను బీజేపీ నేతలు పరిశీలించారు. భారతీయ జనతా పార్టీ కి కొత్త సారథి వచ్చారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ సిన్హా సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న జేపీ నడ్డా పదవీకాలం ముగియడంతో ఈ ఎన్నిక జరిగింది. మంగళవారం ఉదయం 11 గంటలకు ఆయన పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. బిహార్‌కు చెందిన 46 ఏళ్ల నితిన్ నబీన్ ను భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమిస్తూ గతేడాది డిసెంబరులో పార్టీ అనూహ్య ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ఆయన్ను పార్టీ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు అప్పుడే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. కాయస్థ సామాజికవర్గానికి చెందిన నబీన్ సిన్హాకు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. గతేడాది జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బాంకీపుర్ నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బిహార్ నుంచి పార్టీలో అధ్యక్షుడి స్థాయికి చేరిన తొలి నేతగా నబీన్ గుర్తింపు పొందారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ ఎంపిక చేయడంతో పార్టీ సంస్థాగత నిర్మాణంతో పాటు ప్రధాని మోదీ మంత్రివర్గంలోనూ భారీ మార్పులు ఉంటాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇదే సమయంలో 2029 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని.. 55ఏళ్ల లోపు వయసున్న నేతలకు జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించబోతున్నారనే ప్రచారం జరుగుతోంది.

## స్పీకర్ గడ్డం ప్రసాద్ కు సుప్రీంకోర్టు నోటీసులు.

రాజ్యాంగాన్ని కాపాడాల్సిన అవసరం లేదా అని ఆయన ప్రశ్నించారు.ఈ విషయంలో రాహుల్ గాంధీ కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ పై బిజెపి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి వేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టులో విచారణ. దానం నాగేందర్ వ్యవహారం పై తెలంగాణ బిజెపి ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి సుప్రీంకోర్టు ను ఆశ్రయించారు. దానం నాగేందర్ పై స్పష్టమైన ఆధారాలున్నా స్పీకర్ తేల్చక పోవడాన్ని సుప్రీంకోర్టులో బీజేపీ తరపున ఏలేటి మహేశ్వర్ రెడ్డి సవాల్ చేస్తూ కోర్టు ధిక్కరణ పిటిషన్ ను ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేశారు, పిటిషన్ లో ఏలేటి మహేశ్వర్ రెడ్డి సుప్రీంకోర్టు సూచనలు స్పీకర్ పాటించలేదన్నారు. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ ల ధర్మాసనం కేసు విచారణ జరుపనుంది.

## గ్రీన్ హైడ్రోజన్‌కు చిరునామాగా ఏపీ

వస్తున్నాయని వివరించారు. ప్రపంచంలోనే అతి తక్కువ ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేశామని వెల్లడించారు. 2026లో డ్రోన్ ట్యాక్సీ, డ్రోన్ అంబులెన్స్‌లు వస్తాయని వివరించారు. ప్రతి ఒక్కరి డిజిటల్ హెల్త్ రికార్డులు తీసుకొస్తామని సీఎం ప్రకటించారు. స్విట్జర్లాండ్ జ్యూరిక్‌లో జరిగిన తెలుగు డయాస్పోరా సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. సీఎం వెంట కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఏపీ మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ ఉన్నారు. జ్యూరిక్‌లో రెండోసారి తెలుగు డయాస్పోరాతో సీఎం, మంత్రులు సమావేశమైయ్యారు. డయాస్పోరా భేటీ కోసం జ్యూరిక్ వచ్చిన ఐరోపాలోని 20 దేశాల ఎన్‌ఆర్‌ఐలు పాల్గొన్నారు. సంక్రాంతి పోటీలు నిర్వహించిన స్విట్జర్లాండ్ తెలుగు సంఘం విజేతలకు సీఎం చంద్రబాబు బహుమతులు అందజేశారు. అనంతరం సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ప్రపంచానికే సేవలు అందించే నాయకత్వం భారత్ సొంతమని వ్యాఖ్యానించారు. ఇతర దేశస్థులతో భారతీయులు పాలునీళ్లలా కలిసిపోతారని అన్నారు. తన ఆలోచలను అన్నీ ఎప్పుడూ నూతనంగా ఉంటాయని తెలిపారు.ఉద్యోగాలు చేయడం కాదని.. ఉపాధి కల్పించేలా తయారుకావాలని సీఎం చంద్రబాబు సూచించారు. వన్ ఫ్యామిలీ - వన్ ఎంటప్రెన్యూర్ నినాదంతో తాము ముందుకెళ్తున్నామని స్పష్టం చేశారు. ఎన్‌ఐఆర్‌లను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు రూ.50 కోట్ల కార్పస్‌ఫండ్ ఇస్తామని తెలిపారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌తో సన్‌రైజ్ కనెక్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. భారత్‌కు వచ్చే పెట్టుబడుల్లో ఒక్క ఏపీకే 25 శాతం వస్తున్నాయని తెలిపారు. భారత్‌కు అతిపెద్ద ఆస్తి... యువ జనాభా అని వ్యాఖ్యానించారు. 2028 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ మారుతుందని వివరించారు. 2047 నాటికి నెంబర్‌వన్ కమ్యూనిటీగా భారత్ ఉండాలని ఆకాంక్షించారు. 2047 నాటికి ప్రపంచంలోనే నెంబర్ వన్ కమ్యూనిటీగా తెలుగువాళ్లు ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు.

## స్పీకర్‌పై బిజెపి కోర్టు ధిక్కరణ కేసు

హైదరాబాద్,జనవరి19 **వెలుతురు**: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డ ప్రసాద్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేయడంతో.. సర్వోన్నత న్యాయస్థానం ఆ పిటిషన్‌పై విచారణను వాయిదా వేసింది. అయితే మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌పై సమాధానం చెప్పాలని స్పీకర్‌కు నోటీసులు ఇచ్చింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పును స్పీకర్ అమలు చేయలేదని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిటిషన్ వేశారు. దాంతో సమాధానం చెప్పాలంటూ స్పీకర్‌కు సంజయ్ కరోల్ ధర్మాసనం నోటీసులు ఇచ్చింది. అదేవిధంగా మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌ను పాడి కౌశిక్‌రెడ్డి, కేటీఆర్ పిటిషన్‌లతో జతచేసింది. అన్ని పిటిషన్‌లపై కలిపి విచారణను ఫిబ్రవరి 6వ తేదీకి వాయిదా వేసింది.

# సిరిసిల్ల పవర్‌లూమ్‌పై కేంద్రం వివక్ష

ఆరోపించారు. వచ్చే కేంద్ర బ్జడెట్‌లోనైనా సిరిసిల్ల ’ మెగా పవర్ లూమ్ క్లస్టర్ ’ను అధికారికంగా ప్రకటించి, ఈ పదేళ్ల అన్యాయానికి ముగింపు పలకాలని డిమాండ్ చేశారు.సీపీసీడీఎస్ నిబంధనల ప్రకారం సిరిసిల్లకు అన్ని అర్హతలు ఉన్నాయని కేంద్ర బృందాలే ధ్రువీకరించినా, ÷క్లైను పక్కన పెట్టడం వెనుక ఉన్న మర్మమేమిటి? అని ప్రశ్నించారు.తెలంగాణ అంటే కేంద్రానికి ఎందుకంత కక్ష? అని ప్రశ్నించారు. ఇది కేవలం నిర్లక్ష్యం కాదు. తెలంగాణ అభివృద్ధిని, ముఖ్యంగా ఇక్కడి నేతన్నల పట్ల కేంద్రం చూపుతున్న వివక్ష అని కేటీఆర్ ధ్వజమెత్తారు. సిరిసిల్ల తెలంగాణ వస్త్ర పరిశ్రమకు గుండెకాయలాంటిదని పేర్కొన్నారు. సిరిసిల్ల లో 30 వేలకు పైగా పవర్ లూమ్స్ కలిగి ఉండి, వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. సిరిసిల్ల కంటే తక్కువ సామర్థ్యం, తక్కువ కార్మిక శక్తి ఉన్న ఇతర రాష్ట్రాలలోని ప్రాంతాలకు మెగా క్లస్టర్లను మంజూరు చేసిన కేంద్రం, అన్ని అర్హతలు ఉన్న సిరిసిల్లను పక్కన పెట్టడం ప్రాంతీయ వివక్షకు పరాకాష్ట అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం మెగా క్లస్టర్ ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయింపు, నిరంతర విద్యుత్, నీరు, సింగిల్ విండో అనుమతులు , రాష్ట్ర స్థాయి ప్రోత్సాహకాలు.. ఇలా ప్రతి ఒక్క అర్హతను పూర్తి చేసిందని కేటీఆర్ వివరించారు. ఇవన్నీ సిద్ధంగా ఉన్నాయని పదేపదే చెబుతున్నా, ఎటువంటి సాంకేతిక లేదా ఆర్థిక కారణాలు చూపకుండా కేంద్ర మంత్రిత్వ శాఖ ఈ ప్రతిపాదనను పెండింగ్‌లో పెట్టడం సిగ్గుచేటు అని ఎండగట్టారు. ఒకవైపు ’ మేక్ ఇన్ ఇండియా’, ’ఆత్మనిర్భర్ భారత్’ అని గొప్పలు చెప్పుకుంటున్న కేంద్రం, తెలంగాణ విషయంలో ద్వంద నీతికి, చిత్తశుద్ధిలేమికి అద్దంపడుతుందన్నారు. ÷ూష్ట్రంలో కాంగ్రెస్ పాలన వచ్చిన నాటి నుంచి చేనేత రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. మళ్లీ ఆత్మహత్యల వార్తలు వినాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నేతన్నలకు అండగా నిలిచింది. కానీ నేడు పరిస్థితులు మారుతున్నాయి. ఇటువంటి కీలక సమయంలో కేంద్రం జోక్యం చేసుకుని మెగా క్లస్టర్‌ను మంజూరు చేయాల్సి ఉండగా, తీవ్రమైన జాప్యం చేయడం నేతన్నల పొట్ట కొట్టడమే అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ప్రతి ఇంటిని సోలార్ ఎనర్జీ కేంద్రంగా మార్పు

చేస్తుంది. దీనివల్ల ప్రతి ఇంటికి ఏడాదికి సుమారు 15 వేల రూపాయల వరకు విద్యుత్ ఆదా అవ్వడమే కాకుండా, అదనపు విద్యుత్ అమ్మకం ద్వారా మరో 5 వేల రూపాయల వరకు నగదు ఆదాయం లభిస్తుంది. అంటే ప్రతి ఏటా ఒక కుటుంబం సుమారు 20 వేల రూపాయల ఆర్థిక వెసులుబాటును పొందుతుంది. ఈ మొత్తాన్ని మహిళలు తమ పిల్లల చదువులకో లేదా ఇతర ఇంటి అవసరాలకో వాడుకోవచ్చని భట్టి విక్రమార్క సూచించారు. కేవలం గృహ వినియోగదారులకే కాకుండా, రైతులకు కూడా ఈ పథకం ద్వారా 'డబుల్ ధమాకా' లభించనుంది. పొలాల్లోని వ్యవసాయ పంపుసెట్లకు ప్రభుత్వం తన సొంత ఖర్చుతో సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేస్తుంది. పంట లేని సమయంలో లేదా మోటార్లు వాడనప్పుడు కూడా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం కలుగుతుంది. అంతేకాకుండా, ఈ సోలార్ ప్యానెళ్లను ఎనిమిది అడుగుల ఎత్తులో ఏర్పాటు చేయడం వల్ల వాటి కింద ఒక పక్కా షెడ్డు లాంటి వసతి ఏర్పడుతుంది. అక్కడ రైతులు పశువులను కట్టుకోవడానికి, వ్యవసాయ పరికరాలు దాచుకోవడానికి లేదా మధ్యాహ్న సమయంలో విశ్రాంతి తీసుకోవడానికి వీలుంటుంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 'గ్రీన్ ఎనర్జీ'ని ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, రైతులు కూడా వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు పొలాల్లో చెత్తను కాల్చవద్దని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం విజ్ఞప్తి చేశారు.

## మున్సిపల్ ఎన్నికలకు కాంగ్రెస్ ఇన్‌ఛార్జులు

- ఆదిలాబాద్‌కు సుదర్శన్ రెడ్డి... నిజామాబాద్‌కు ఉత్తమ్



**హైదరాబాద్,జనవరి19 వెలుతురు:**

తెలంగాణలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ ఎన్నికలకు ఇన్‌ఛార్జ్‌లుగా మంత్రులను నియమిస్తూ కాంగ్రెస్ నిర్ణయం తీసుకుంది. పార్లమెంట్ వారీగా ఆయా మంత్రులకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించింది. 15 నియోజకవర్గాలకు గానూ 15 మంది మంత్రులు ఇన్‌ఛార్జ్‌లుగా బాధ్యతలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. సంబంధిత రిజర్వేషన్లు ఇప్పటికే ఖరారయ్యాయి. త్వరలో నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది. ఫిబ్రవరి మొదటి లేదా రెండో వారంలో ఎన్నికలు జరగనున్నట్లు సమాచారం. మున్సిపల్ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌లుగా మంత్రులకు బాధ్యతలు అప్పగించారు. అయితే ఆదిలాబాద్‌కు మాత్రం ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డిని ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. ఈ క్రమంలో నిజామాబాద్‌కు ఉత్తమ్ కుమార్ రెడ్డి నియమితులయ్యారు. మల్కాజిగిరి - కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, చేవెళ్ల -దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కరీంనగర్-తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం-కొండా సురేఖ, మహబూబాబాద్ - పొన్నం ప్రభాకర్, మహబూబ్‌నగర్ - దామోదర రాజనరసింహ, జహీరాబాద్ - అజారుద్దీన్ మెదక్ - వివేక్ వెంకటస్వామి, నాగర్‌కర్నూల్ - వాకిటి శ్రీహరి, నల్గొండ - అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భువనగిరి - సీతక్క, వరంగల్ - పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పెద్దపల్లి - జూపల్లి కృష్ణారావులను నియమిచారు. తమ పరిధిలోని మున్సిపాలిటీల్లో గెలుపే లక్ష్యంగా వీరు కృషి చేయాల్సి ఉంటుంది.

# బోధన్ అభివృద్ధిని అడ్డుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం
- రేవంత్ రెడ్డి నిలువెల్లా తెలంగాణ ద్రోహి..
- హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- బోధన్ మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగరడం ఖాయం
- షకీల్ నాయకత్వంలో 36 కౌన్సిలర్ స్థానాలు బీఆర్ఎస్‌వే
- మహిళలకు రూ.2,500 హామీ మోసం.. ఒక్కో మహిళకు రూ.60 వేల బాకీ
- రైతులను నిర్లక్ష్యం చేసిన కాంగ్రెస్ పాలన
- అవినీతి కుంభకోణాల్లో కాంగ్రెస్ మంత్రులు
- కేసీఆర్ మాత్రమే తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి




**బోధన్,జనవరి19 వెలుతురు:**

బోధన్ పట్టణ అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, మాజీ ఎమ్మెల్యే షకీల్ హయాంలో మంజూరైన పనులను కూడా నిలిపివేసి ప్రజలను శిక్షిస్తోందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం బోధన్ పట్టణం లో జరిగిన బీఆర్ఎస్ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ... బోధన్ పై గులాబీ జెండా ఖాయం అన్నారు. బోధన్ టౌన్ మీటింగ్ చూస్తుంటే నియోజకవర్గ, జిల్లా స్థాయి సభలా ఉందని, ప్రజల ఉత్సాహం చూస్తుంటే బోధన్ మున్సిపాలిటీపై మూడోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. షకీల్ నాయకత్వంలో 36 మంది కౌన్సిలర్లు భారీ మెజారిటీతో గెలవడం తథ్యమన్నారు. కేసిఆర్, కేటీఆర్ సహకారంతో షకీల్ బోధన్ అభివృద్ధికి 100 కోట్లు మంజూరు చేయించారని, అందులో 60 కోట్ల పనులు పూర్తయ్యాయని గుర్తు చేశారు. అయితే గత రెండేళ్లుగా ఇక్కడి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం మిగిలిన 40 కోట్ల పనులను చేయకుండా అడ్డుకుందని విమర్శించారు. రోడ్లన్నీ గుంతల మయంగా మారినా కనీసం మరమ్మతులు కూడా చేయలేని దౌర్భాగ్య స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. ÷ండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, కేవలం దోచుకోవడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. సివిల్ సప్లైస్, లిక్కర్, బొగ్గు కుంభకోణాల్లో మంత్రులు, సీఎం వాటాల కోసం కొట్టుకుంటున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రేవంత్ రెడ్డిల మధ్య వాటాల పంపకాల్లో తేడాలు వచ్చి రోడ్డున పడ్డారని ఎద్దేవా చేశారు. షకీల్ హయాంలో పగడపల్లి వద్ద నదిపై చెక్ డ్యాం నిర్మించి రైతులకు మేలు చేశామని, ఇప్పుడున్న ఇరిగేషన్ శాఖ మంత్రి, స్థానిక పెద్ద మనుషులు ఒక్క కొత్త చెక్ డ్యాం ఎందుకు కట్టలేకపోయారని ప్రశ్నించారు. ÷లంగాణ ఉద్యమకారులపై తుపాకీ పట్టుకొని తిరిగిన చరిత్ర రేవంత్ రెడ్డిదని, అటువంటి వ్యక్తికి బీఆర్ఎస్ జెండాను తాకే నైతిక అర్హత లేదని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.ముఖ్యమంత్రి స్థాయి నుంచి కింది స్థాయి కార్యకర్త వరకు కాంగ్రెస్ పార్టీ అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. గత రెండేళ్లలో కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. ఓటుకు నోటు దొంగ రేవంత్ తెలంగాణ ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను కొనడానికి డబ్బు సంచులతో దొరికిన దొంగ రేవంత్ రెడ్డి అని, ఆయన ఒక తెలంగాణ ద్రోహి అని విమర్శించారు. చంద్రబాబు నాయుడు చెప్పుచేతల్లో నడిచే రేవంత్ రెడ్డికి తెలంగాణ గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. ÷లంగాణ రాష్ట్ర ఏర్పాటు కు చంద్రబాబు నాయుడు అడ్డు పడ్డాడు కాబట్టే తెలంగాణా ప్రజలు తెలుగుదేశం పార్టీ ని తెలంగాణ నుండి ఆంధ్రకు పంపించారు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా, ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. ముఖ్యంగా మహిళలకు, వృద్ధులకు ఇచ్చిన మాట తప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి మహిళకు నెలకు రూ. 2,500 ఇస్తామని రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. ఈ రెండేళ్లలో ఆ డబ్బులు ఇవ్వకుండా మహిళలను మోసం చేశారు. అంటే ఒక్కో మహిళకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 60,000 బాకీ పడింది' అని ప్రశాంత్ రెడ్డి లెక్కలతో సహా వివరించారు. రేవంత్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీల వీడియోలను (పెన్షన్ పెంపు, మహిళలకు ఆర్థిక సాయం) ప్రతి ఇంటికి వెళ్లి చూపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 'మాట తప్పిన కాంగ్రెస్ కు ఓటు ఎందుకు వేయాలి?' అని ప్రజలు కాంగ్రెస్ నాయకులను నిలదీయాలన్నారు. తెలంగాణ ప్రజలకు కేసీఆర్ మాత్రమే శ్రీరామరక్ష అని, బీఆర్ఎస్ పార్టీని మళ్ళీ గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. బోధన్ మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. టికెట్ ఎవరికి వచ్చినా, అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీని గెలిపించాలని ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బోధన్ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, అభివృద్ధిని అడ్డుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ మున్సిపల్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు షకీల్, జిల్లా పార్టీ అధ్యక్షులు జీవన్ రెడ్డి, గణెలిష్ గుప్తా, మాజీ ఎమ్మెల్సీ విజిగౌడ్, గిర్ధవర్ గంగారెడ్డి, నర్సింగ్ రావు మాజీ జెడ్పిటిసి లు, ఎంపీపీలు, సర్పంచులు ఎంపిటిసి లు, పార్టీ ప్రతినిధులు, పెద్ద ఎత్తున బిఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదు

- పోలండ్ విదేశాంగ మంత్రితో భేటీలో జైశంకర్
- ఉగ్రవాద నిర్మూలనకు కలిసి పనిచేస్తామని పోలండ్ హామీ



**న్యూఢిల్లీ,జనవరి19 వెలుతురు:**

ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ భారత్ సమర్థించదని, ప్రపంచ దేశాలను కూడా ఇదే కోరుతోందని విదేశాంగ మంత్రి జై శంకర్ స్పష్టం చేశారు. పోలండ్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి అయిన రాడోస్లావ్ సికోర్స్కీ బజీలీ తో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ దిల్లీలో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఇరుదేశాల మధ్య సంబంధాలపై చర్చలు జరిపారు. కాగా గతేడాది అక్టోబర్‌లో పాక్ పర్యటనకు వెళ్లిన సమయంలో పోలండ్ విదేశాంగ మంత్రి జమ్మూకశ్మీర్‌పై చేసిన సూచనలపై జైశంకర్ ఆయనకు చురకలు అంటించారు. ఉగ్రవాదాన్ని భారత్ ఎప్పుడూ వ్యతిరేకిస్తూనే ఉంటుందని.. భారత్‌తో స్నేహాన్ని కోరుకునే దేశాలు కూడా ఉగ్రవాదంపై మెతక వైఖరి వీడాలన్నారు. ఉగ్రవాదులు ఎప్పటికైనా ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. సరిహద్దు ఉగ్రవాదం వల్ల భారత్ ఎన్ని సమస్యలు ఎదుర్కొంటుందో రాడోస్లావ్‌కు తెలుసని జైశంకర్ అన్నారు. దానిని తగ్గించడానికి చర్యలు తీసుకోవాలే గానీ సరిహద్దుల్లో ఉగ్రవాదానికి ఆజ్యం పోయకూడదని చురకలు అంటించారు. ప్రపంచం ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న సమయంలో ప్రత్యేకంగా భారత్‌ను మాత్రమే లక్ష్యం చేసుకోవడం అన్యాయమన్నారు. భారత్-పోలండ్ ద్వైపాక్షిక సంబంధాలపై మాట్లాడుతూ.. ఇరుదేశాల మధ్య సంబంధాలు స్థిరంగా ముందుకు సాగుతున్నాయన్నారు. అయినప్పటికీ వాటిని కాపాడుకోవడానికి నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. జైశంకర్ వ్యాఖ్యలపై రాడోస్లావ్ సికోర్స్కీ స్పందిస్తూ.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్‌తో కలిసి పని చేస్తామన్నారు. పోలండ్ కూడా ఉగ్ర సమస్యలను ఎదుర్కొంటుందని తెలిపారు. కాగా గతేడాది పోలండ్ విదేశాంగ మంత్రి రాడోస్లావ్ పాకిస్థాన్ పర్యటనకు వెళ్లిన సమయంలో అక్కడ మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్ సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని ఆ దేశ నేతలతో కలిసి ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు.

## స్మార్ట్‌ఫోన్ల అధిక వినియోగం మన జ్ఞాపకశక్తి, మానసిక ఆరోగ్యం మరియు మెదడు పనితీరుపై చూపుతున్న దుష్ప్రభావాలపై ఈ సందర్భంగా చర్చ జరిగింది."

**- ప్రసన్నకుమార్ శర్మ ప్రధాన కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్**



**హైదరాబాద్ వెలుతురు జనవరి 19:** ఆదివారం రోజు రాత్రి ఐటీసీ కాకతీయ హోటల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ ఇండియా మరియు మనప్పురం ఫైనాన్స్ వారి సమైక్య ఆధ్వర్యంలో నిర్వహించిన "మొబైల్ ఫోన్ మరియు మన మెదడు పనితీరు" అంశంపై జరిగిన పరిశోధనాత్మక చర్చాగోష్టిలో నేను వ్యక్తిగతంగా పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో మొబైల్ ఫోన్లు మన మెదడుపై చూపుతున్న ప్రభావం, భవిష్యత్తులో వాటి వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముఖ్యంగా పిల్లలు మొబైల్‌లకు ఎలా అలవాటుపడుతున్నారు అనే అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా బ్రహ్మోస్ క్షిపణులు తయారు చేసే సంస్థ చీఫ్ మరియు బ్రహ్మోస్ మిసైల్ డైరెక్టర్ గౌరవనీయులు శ్రీ రాఘవేంద్ర జోషీ గారితో మాట్లాడుతూ, భారతదేశ రక్షణ వ్యవస్థలో మన క్షిపణులు ఎలా పనిచేస్తున్నాయి, భవిష్యత్తులో సాంకేతికత వల్ల దేశం పొందబోయే లాభాలు ఏమిటి అనే విషయాలపై అవగాహన పొందే అవకాశం లభించింది. టెక్నాలజీని సృష్టించేది మన మెదడే కాబట్టి, ఆ మెదడుపై మొబైల్ ప్రభావం ఏ విధంగా ఉంటుందనే అంశంపై కూడా ఆయనతో కలిసి చర్చించటం ఎంతో ఉపయోగకరంగా అనిపించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గౌరవనీయులందరికీ, ముఖ్యంగా శ్రీ రాఘవేంద్ర జోషీ గారికి, మనప్పురం సంస్థ వ్యవస్థాపకులు శ్రీ నందన్ గారికి, అలాగే ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన లయన్స్ క్లబ్ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.



- సీఎం రేవంత్ రెడ్డి బీజేపీని "బ్రిటిష్ జనతా పార్టీ" అంటున్నారు.
- కానీ కాంగ్రెస్‌ను ఒక బ్రిటిష్ అధికారి స్థాపించాడు అనే విషయాన్ని మర్చిపోతున్నారు.
- ఇప్పుడు కాంగ్రెస్ పేరు మారి INC అంటే "ఇటలి నేషనల్ కాంగ్రెస్" లాగా మారింది.
- MGNREGA పేరు గురించి కాంగ్రెస్ బాధపడుతోంది. కానీ మాకు గాంధీజీ నిజంగా ఏం కోరుకున్నారో అది ముఖ్యం.
- దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్‌ను రద్దు చేయాలని గాంధీజీ అన్నారు.
- కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరిస్తూ గాంధీజీ ఆశయాన్ని నెరవేర్చుతున్నారు.
- "విభజించి పాలించు" అని కాంగ్రెస్ మాట్లాడటం హాస్యాస్పదం.
- ఎందుకంటే కాంగ్రెస్ ఓట్ల కోసం కులం, మతం పేరుతో ప్రజలను విభజిస్తోంది.
- ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ "సబ్ కా సాథ్ సబ్ కా వికాస్" అనే మార్గంలో పనిచేస్తోంది.
- ఇళ్లు, రేషన్, గ్యాస్ వంటి పథకాలు మత భేదం లేకుండా పేదలందరికీ అందుతున్నాయి.
- కాంగ్రెస్ 70 ఏళ్లుగా పెంచిన బానిస మనస్తత్వాన్ని మేము తొలగిస్తున్నాం.
- స్కిల్స్ యూనివర్సిటీలో రాజకీయాలపై కొత్త కోర్సు పెట్టాలని నేను సీఎం రేవంత్ రెడ్డి గారిని కోరుతున్నాను. ఆ కోర్సులో మొదటి విద్యార్థి ఆయనే కావాలి.
- ఎందుకంటే ఆ విషయంలో నైపుణ్యం లోపిస్తున్నట్టు కనిపిస్తోంది.
- బండి సంజయ్ కుమార్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి

హైదరాబాద్ వెలుతురు జనవరి 19:

# స్థానిక నిధుల ఆడిట్ (ఎల్‌ఎఫ్‌ఏ) డైరెక్టరేట్లు, రాష్ట్ర ఆడిట్ విభాగాలకు మూడు రోజుల జాతీయ వర్క్‌షాప్






**హైదరాబాద్, వెలుతురు 19 జనవరి:** స్థానిక నిధుల ఆడిట్ (ఎల్‌ఎఫ్‌ఏ) డైరెక్టరేట్లు, రాష్ట్ర ఆడిట్ విభాగాలకు మూడు రోజుల జాతీయ వర్క్‌షాప్ హైదరాబాద్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ సంస్థ (ఎన్‌ఐఆర్డీపీఆర్)లో సోమవారం రోజున ప్రారంభమైంది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) మార్గనిర్దేశంలో, అంతర్జాతీయ స్థానిక సంస్థల ఆడిట్ ఆడిట్ కేంద్రం (ఐసీఏఎల్) సహకారంతో.. గ్రామీణాభివృద్ధిలో అంతర్గత ఆడిట్ కేంద్రం (సీఐఏఆర్డీ), ఎన్‌ఐఆర్‌డీపీఆర్ ఈ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నాయి.
2026 జనవరి 19 నుంచి 21 వరకు ఈ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. రాష్ట్ర, స్థానిక నిధుల ఆడిట్ విభాగాల సామర్థ్యాన్ని బలోపేతం చేయడం, అలాగే దేశవ్యాప్తంగా పంచాయతీ రాజ్ సంస్థలు, పట్టణ స్థానిక సంస్థల్లో ఆడిట్ వ్యవస్థల ప్రభావం, ఏకరూపత, పనితీరును మెరుగుపరచడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం.
జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభ సదస్సు మొదలైంది. అనంతరం ఎన్‌ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి. నరేంద్ర కుమార్ స్వాగతోపన్యాసం చేశారు. పదిహేనో ఆర్థిక సంఘం ద్వారా స్థానిక సంస్థలకు నిధుల ప్రవాహం గణనీయంగా పెరిగిన నేపథ్యంలో స్థానిక ప్రభుత్వాల్లో జవాబుదారీతనం, పారదర్శకత, ఆర్థిక క్రమశిక్షణను బలోపేతం చేయడంలో స్థానిక నిధుల ఆడిటర్లు, రాష్ట్ర ఆడిట్ విభాగాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తారని ఆయన స్పష్టం చేశారు. సామర్థ్యాలను పెంపొందించడం, రాష్ట్రాల మధ్య పరస్పర అభ్యసన వినిమయం, ఐటీ, కృత్రిమ మేధ, శాట్స్ (సీఏఏటీఎస్) వంటి అధునాతన సాంకేతికతలను అవలంబించడం ద్వారా.. ఆడిటింగ్ సవాళ్లను అధిగమించవచ్చని డైరెక్టర్ జనరల్ వివరించారు. స్థానిక సంస్థల ఆడిట్ వ్యవస్థలను బలోపేతం చేయడంలో రాష్ట్రాలకు అవసరమైన పూర్తి మద్దతును అందించడానికి ఎన్‌ఐఆర్‌డీపీఆర్ కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు.
డిప్యూటీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (స్థానిక సంస్థల ఆడిట్) శ్రీ మనీశ్ కుమార్ ప్రారంభోపన్యాసం చేశారు. పంచాయతీ రాజ్ సంస్థలు, పట్టణ స్థానిక సంస్థల్లో ఆడిటింగ్ ప్రక్రియ రాజ్యాంగపరమైన బాధ్యత అని గుర్తు చేశారు. స్థానిక సంస్థల పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో స్థానిక నిదుల ఆడిట్ అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు.
ప్రజాస్వామ్య వికేంద్రీకరణను బలోపేతం చేయడంలోనూ, స్థానిక ప్రభుత్వాల్లో ఆర్థిక క్రమశిక్షణను పెంపొందించడంలోనూ పటిష్టమైన ఆడిట్ వ్యవస్థల ప్రాధాన్యాన్ని పంచాయతీ రాజ్ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ సుశీల్ కుమార్ లోహాని వివరించారు.
రాష్ట్ర, స్థానిక నిధుల ఆడిట్ సంస్థల వృత్తిపరమైన సామర్థ్యాన్ని పెంపొందించడంలోనూ.. దేశవ్యాప్తంగా స్థానిక పరిపాలనలో ఏకరీతి, సాంకేతిక ఆధారిత- ఫలితాల ప్రాతిపదికన ఆడిట్ పద్ధతులను ప్రోత్సహించడంలోనూ ఈ వర్క్‌షాప్ ప్రాధాన్యాన్ని ఐసీఏఎల్ డైరెక్టర్ జనరల్ శ్రీ హెచ్.కె. ధర్మదర్శి వివరించారు. వర్క్‌షాప్‌ను పరిచయం చేస్తూ.. సీఐఏఆర్డీ హెడ్ (ఇన్చార్జి), కోర్సు డైరెక్టర్ డాక్టర్ యు. హేమంత కుమార్ మాట్లాడుతూ... గత వర్క్‌షాప్‌ల అభ్యసన ఫలితాలను ఏకీకృతం చేయడం, రాష్ట్రాల వారీగా అత్యుత్తమ పద్ధతులు, సవాళ్లను క్షుణ్ణంగా పరిశీలించడం, దేశవ్యాప్తంగా పంచాయతీ రాజ్ సంస్థల ఆడిట్ వ్యవస్థలను బలోపేతం చేసేందుకు అవసరమైన ఆచరణాత్మక వ్యూహాలను రూపొందించడం ఈ కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో ప్లీనరీ సెషన్లతో పాటు.. స్థానిక ప్రభుత్వాల అకౌంటింగ్, ఆడిట్ ప్రక్రియల ప్రామాణీకరణ, ఆడిట్‌లో గుర్తించిన సమస్యల పరిష్కారం, ఆడిటింగ్‌లో అత్యాధునిక సాంకేతికత, వినూత్న సాధనాల వినియోగం వంటి అంశాలపై బృంద చర్చలు నిర్వహించనున్నారు.
వివిధ రాష్ట్రాల ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరళ్లు, అకౌంటెంట్ జనరళ్లు.. పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ, ఎన్‌ఐఆర్‌డీపీఆర్, ఐసీఏఎల్ సీనియర్ అధికారులు, నిపుణులు.. రాష్ట్ర ఆడిట్, స్థానిక నిధుల ఆడిట్ విభాగాల డైరెక్టర్లు/ప్రతినిధులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొంటున్నారు. స్థానిక నిధుల ఆడిట్ సంస్థాగత యంత్రాంగాన్నీ, వృత్తిపరమైన సామర్థ్యాన్నీ బలోపేతం చేయడానికి.. తద్వారా దేశంలో స్థానిక పరిపాలనను మెరుగుపరచడానికి ఈ చర్చలు బలమైన సూచనలను అందిస్తాయని ఆశిస్తున్నారు.

# కాంట్రాక్టర్లది ఖండ కావరమా...?

**- ప్రభుత్వ తప్పిదమా...?**
**- అధికారుల నిర్లక్ష్యమా..?**
**- పాఠశాలకు తాళం వేసే ధైర్యం ఎక్కడిది....?**
**- వీరికి టెండర్లు ఇచ్చింది ఎవరు...?**
**- బిఆర్ఎస్ ప్రభుత్వం లో చేసిన పనులు...!**
**- కాంగ్రెస్ ప్రభుత్వంపై దౌర్జన్యం...!**
**- బిల్లులు రానప్పుడు కలెక్టరేట్ ను తాళం వేయమను...!?**







**కోదేరు వెలుతురు జనవరి 19, 2026:** కోదేరు మండలంలో గాడి తప్పుతున్న పాలన ఏకంగా కాంట్రాక్టర్ లు పాఠశాల లకు తాళం వేసే దుష్చర్యకు దిగటం దేనికి సంకేతం. బడిఈడు పిల్లలకు ఏం నేర్పుతున్నారు. దౌర్జన్యం చేయటం ఎలా అనా..? లేక మరొకటా.. టెండర్ పిలవకుండానే స్వంత పెత్తనంతో గత ప్రభుత్వం నాన్యతా ప్రమాణాలు పాటించకుండా ఇష్టం వచ్చిన రీతిలో నిర్మాణం చేసి బిల్లులు రాలేదని ఏకంగా పాఠశాలలకు తాళం వెయ్యటంలో ఎవరి పాత్ర ఉందో ప్రజలకు తెలియదా... అర్థం కాదా..! ఇటువంటి దుశ్చర్యలకు తెగించిన వారిపై చర్యలు తీసుకునే ధైర్యం మంత్రి జూపల్లి కి లేదా.. కేవలం అనామకులపై మాత్రమే కేసులు కట్టే.. కట్టించే మంత్రి నేడు ఇంతటి దౌర్జన్యం కు దిగిన కాంట్రాక్టర్ల పై ఏం చర్యలు తీసుకుంటాడని ప్రజలు బహిరంగంగా ప్రశ్నించే స్థితికి రావటం అలోచించాలి. అదేవిదంగా ఆటో డ్రైవర్లు కేవలం ధర్నాకు పిలుపునిస్తే వారిపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసిన పోలీసులు నేడు విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసిన కాంట్రాక్టర్ లపై సైలెంట్ గా ఉండటం దేనికి నిదర్శనమని ఇలాంటి చర్యలు ఎటువైపు దారి తీస్తున్నాయనేది సమాధానం లేని ప్రశ్న. అంతగా బిల్లులు రాకుంటే వేళ్ళి కలెక్టర్ కార్యాలయం తాళం వేయవలసి ఉండే అంతేగాని విద్యార్థులను విస్మయపరిచే చర్యలు ఏ పరిణామాలకు దారి తీస్తాయో తెలపండని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇట్టి అంశంపై కలెక్టర్ స్పందన ఏమిటో వేచి చూడాలని ప్రజల అకాంక్ష. అదేవిదంగా ఉపాధ్యాయులను, విద్యార్థులపై గతంలో సైతం ఇదే విధంగా ప్రవర్తించిన గత ప్రభుత్వం నాయకుల వల్ల ఉపాధ్యాయులు ట్రాన్స్ఫర్ పై కోడేరు ఉన్నత పాఠశాల కు వచ్చేందుకు వెనకడుగు వేస్తున్న పరిస్థితి లో నేడు ఇలా జరగటం మరింత చెడు ప్రభావం చూపక పోదు. ఇది ఏమైనా కాంట్రాక్టర్లు తలాలు వెయ్యాలంటే కలెక్టర్ కర్యాలయం ఉంది.. లేదా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఉందని ప్రజలు అంటున్నారు.

# పేద ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు

**• నిమ్స్‌లో స్టెమ్ సెల్ ల్యాబ్‌ను ప్రారంభించిన దామోదర**



**హైదరాబాద్,జనవరి19 వెలుతురు:** పేద ప్రజలకు అత్యాధునిక వైద్యాన్ని అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. పీపీపీ పద్ధతిలో తులసి థెరప్యూటిక్స్‌తో కలిసి స్టెమ్ సెల్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేశారు. నిమ్స్‌లో స్టెమ్ సెల్ ల్యాబ్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ మాట్లాడారు. అమెరికాకు చెందిన తులసి థెరప్యుటిక్స్ సహకారంతో ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేసుకున్నామని వెల్లడించారు. ఒక పెద్ద వృక్షానికి విత్తనం ఎంత ముఖ్యమో.. మన శరీరానికి స్టెమ్ సెల్స్ అంతే ముఖ్యమని వివరించారు. స్టెమ్ సెల్స్ నుంచి కొత్త కణాలను, అవయవాలను తయారు చేయొచ్చని మంత్రి దామోదర్ రాజనర్సింహ వివరించారు. మన శరీరంలో ఏదైనా భాగం దెబ్బతిన్నప్పుడు భాగాన్ని రిపేర్ చేసే అద్భుతమైన శక్తి.. మూల కణాలకు ఉంటుందని వెల్లడించారు. మందులతో నయం కాని మొండి వ్యాధులను కూడా నయం చేయగలిగే శక్తి ఈ స్టెమ్ సెల్స్‌కు ఉందని తెలిపారు. క్యాన్సర్, రక్త సంబంధిత వ్యాధులు, తలసేమియా వంటి జబ్బులతో బాధపడేవారికి ఈ చికిత్స సంజీవని లాంటిదని చెప్పుకొచ్చారు. ఆయా వ్యాధుల వల్ల శరీరంలో దెబ్బతిన్న కణజాలాన్ని మళ్లీ కొత్తగా సృష్టించేందుకు ఈ చికిత్స ఉపయోగపడుతుందని వెల్లడించారు. ప్రస్తుతం స్టెమ్ సెల్ చికిత్స కొన్ని కార్పొరేట్ హాస్పిటల్స్‌లోనే అందుబాటులో ఉందని... అది కూడా లక్షల రూపాయల ఖర్చుతో కూడుకున్న పని అని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సామాన్యులకు కూడా అత్యాదునిక వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో నిమ్స్‌లో స్టెమ్ సెల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. ప్రస్తుతం ఈ ల్యాబ్‌లో స్టెమ్ సెల్స్‌పై లోతైన పరిశోధనలు జరుగుతాయని చెప్పుకొచ్చారు. పరిశోధనల ఫలితంగా, భవిష్యత్తులో నిమ్స్‌లోనే పేషెంట్లకు అతి తక్కువ ఖర్చుతో స్టెమ్ సెల్ థెరపీ అందించగలుగుతామని తెలిపారు. త్వరలోనే ఈ ల్యాబ్ రీసెర్చ్ ఫలాలు ప్రజలకు అందుతాయని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు.

# సంపాదకీయం.. అవినీతి బురదలో పాలకులు !



ప్రత్యేక తెలంగాణతో దగాపడ్డది ఇరు రాష్ట్రాల ప్రజలే అని నిత్యం చెప్పుకోవాల్సిందే. ఇక్కడ తెలంగాణ ప్రజలు, అక్కడ ఆంధ్రా ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. రాజకీయ నేతలు బాగుపడ్డారు. ఇంకా బాగుడదానికి కావాల్సిన ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రత్యేకించిం తెలంగాణలో పదేళ్ల పాలనా కాలంలో బిఆర్ఎస్ చేయని అవినీతి లేదు. చివరకు అప్పులు చేసి కుప్పగా మార్చారు. ఎదురుదాడి విమర్శలతో రాజకీయాలు నెరుపుతున్నారు. ఎపిలో కూడా జగన్ అరాచకీయం తారాస్థాయికి చేరింది. ఐదేళ్లలోనే ఎపి గందరగోళంలోకి నెట్టబడింది. ఇప్పుడు చేసిన అప్పులను తీర్చే బదులు ఇరు రాష్ట్రాల్లో మళ్లీ అప్పులు చేస్తున్నారే తప్ప ఆర్థిక క్రమశిక్షణ పాటించడం లేదు. తాజాగా తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాలు రెండేళ్లలోనే బిఆర్ఎస్ ను మించి సాగుతున్నాయి. మంత్రులు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఎవరికి వారు సొంత ఖాతాలు తెరిచారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. తాజాగా డిప్యూటి సిఎం భట్టి విక్రమార్కపై వచ్చిన ఆరోపణలు కంపు లేపాయి. దీంతో సింగరేణి నైనీ బొగ్గు టెండర్ల ప్రక్రియ రద్దయ్యింది. ఇక్కడే మరిన్ని అనుమానాలు కలుగుతున్నాయి. అవినీతి లేకుంటే టెండర్లు ఎందుకు రద్దు చేశారో చెప్పాలి. తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాలు నానాటికీ తీసికట్టు అన్నట్లుగా తయారయ్యాయి. నిత్యం బిఆర్ఎస్‌ను తిట్టిపోస్తూ వారు చేస్తున్నది కూడా అదే. నేటి వరకు ఒక్క విప్లవాత్మక నిర్ణం తీసుకోలేదు. రేషన్ కార్డులు ఇవ్వడం, సన్నబియ్యం పంపిణీ చేయడం, పెన్షన్లు ఇవ్వడం, ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం ఇదే అభివృద్ధిగా చూపుతున్నారు. ఇవి చూపి తప్పించుకుందామని అనుకున్నా..దందాల బాగోతం మంత్రుల మధ్య చిచ్చు రేపుతోంది. తమ శాఖల్లో ఏం జరుగుతుందో పరివీలించి పర్యవేక్షించే బాధ్యతను మంత్రులు మరిచిపోయారు. కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భట్టి విక్రమార్కల తీరు రాజకీయంగా చిచ్చు రేపుతోంది. అవినీతి చుట్టూ వీరి పాలన సాగుతోంది. మంత్రులపై బురదచల్లడాలు, అనుకూల మీడియాతో అవినీతి ఆరోపణలు, అధికారులపై వ్యక్తిత్వ హననాలు ప్రస్తుతం చర్చగా మారాయి. ముఖ్యనేత అనే గౌరవం లేకుండా కొండా సురేఖ కూతురు దారుణంగా దూషించారు. ఆమెకు దేవాదాయ శాఖలో ఏం జరుగుతుందో తెలుసుకునే వీలు పడడం లేదు. అలవీశాఖలో ఏం జరుగుతుందో తెలియదు. ఎన్ని దేవాలయాల భేములు అన్యాక్రాంతం అయ్యాయో, వాటిని ఎలా వెనక్కి తీసుకోవాలో కూడా తెలియడం లేదు. ఆమె మంత్రిగా ఉండడం దౌర్భాగ్యం తప్ప మరోటి కాదు. ఆమె ముందూ వెనకా ఆలోచించకుండా నాగార్జునపై నోరు పారేసు కున్నారు. తరవాత నాలిక కరుచుకున్నారు. ఒకవైపు కుమ్ములాటలు, కీచులాటల తో కాంగ్రెస్ చుక్కాని లేని నావలా తయారయ్యింది. అధికారం వస్తే కాంగ్రెస్‌కు పట్టాపగ్గాలు ఉండవన్న పాత నానుడిని నిజం చేస్తున్నారు. గోతులు తవ్వకునే సంస్కృతి ఆ పార్టీలో ఎప్పటి నుంచో ఉన్నది. కాంగ్రెస్‌లో ఒకరు ఎక్కువ కాదు..ఒకరు తక్కువా కాదు. ఆధిపత్య కుమ్ములాటలో అందరూ అందరే అనే భావన ప్రజల్లో ఉన్నది. నీచ, నికృష్టపు, దిగజారుడు రాజకీయాల కోసం అల్లే కట్టుకథలు నన్నేం చేయలేవు అంటున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎందుకు సింగరేణి టెండర్లు రద్దు చేశారో చెప్పడం లేదు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మీద ఓ మీడియా సంస్థ ప్రసారం చేసిన అనైతిక కథనం వెనుక నిగ్గు లేఅల్సి ఉంది. సింగరేణి టెండరల్ వ్యవహారంలోనూ నిగ్గులేల్చాలి. పలువురు మంత్రులు అవినీతికి పాల్పడుతున్నారంటూ ఫిర్యాదులు వస్తున్నా ..ఎవరు పట్టించుకుంటారో..వారిని ఎవరు కంట్రోల్ చేస్తారనో కూడా తెలియని దుస్తితి నెలకొంది. మేడారం అభివృద్ధి పనుల టెండర్లకు సంబంధించి రూ.100 కోట్ల విలువైన కాంట్రాక్ట్ పనుల విషయంలో మంత్రులు పొంగులేటి, సురేఖ మధ్య విభేదాలు బట్టబయలయ్యాయి. మేడారం జాతర దేవాదాయ శాఖ పరిధిలోనిదని, పైగా తన జిల్లాకు చెందినదని, ఇందులో పొంగులేటి చొరబడి కాంట్రాక్టులు తన అనుచరులకు ఇప్పించుకున్నారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు, సీఎంకు సురేఖ ఫిర్యాదు చేశారు. సిమెంట్ ఫ్యాక్టరీ యజమాని కణతకు మంత్రి కొండా సురేఖ ఓఎస్డీ గన్ను గురిపెట్టిన వ్యవహారం రాష్ట్రంలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. బొగ్గుగని కోసం ఇద్దరు మంత్రులు కొట్లాడుకుం టున్నారని విమర్శలు చెలరేగాయి. కోట్ల విలువైన కాంట్రాక్టు పనులు దక్కించుకోవడానికి కోమటిరెడ్డి, భట్టి ఒకరిపై ఒకరు కత్తులు నూరుకుంటున్నారని చివరకు తేలింది. లాభదాయకమైన వ్యాపారం కోసం ఇద్దరు మంత్రులు తగువు పడుతున్నది ముమ్మాటికీ నిజం. కోమటిరెడ్డి వెంకటరెడ్డి మీద ప్రసారమైన అనైతిక కథనం ఇందులో భాగమేనని తేలింది. దీంతో ఇద్దరి మధ్యన లొల్లితో అవినీతి మరింత బట్టబయలు అయ్యింది. ఏతావాతా కాంగ్రెస్ గత పాత వాసనలను వదులుకోవడం లేదు. అవినీతికి దూరంగా ఉండలేక పోతున్నది. బిఆర్ఎస్ పదేళ్ల అవినీతిపై విరుచుకు పడుతున్నవారు తము చేస్తున్నది గుర్తించడం లేదు. కళ్లు మూసుకుని పిల్లి పాలు తాగిందన్న చందంగా కాంగ్రెస్ మంత్రుల వ్యవహారం నడుస్తోంది. పరిస్థితి ఇలాగే ఉంటే తెలంగాణ మరింత భ్రష్టు పోవడం ఖాయం. అభివృద్ధి పక్కకు పోయి, అప్పుల్లో మరింత కూరుకు పోవడం ఖాయం. పాలకుల దుర్మార్గాలకు బలవడం ఎంతో దూరం లేదు. అవినీతి బురద నుంచి బయటపడక పోతే ప్రజల చేతిలో పరాభవం తప్పదు.

# "మోసపోతే గోస తప్పదు"

## - తెలంగాణకు ముచ్చర్ల సత్యనారాయణ హెచ్చరిక..!

తెలంగాణ చరిత్రను తలుచుకున్నప్పుడు కొన్ని పేర్లు మాత్రమే పదే పదే వినిపిస్తాయి. అధికారానికి దగ్గరగా ఉన్నవారు, పదవుల్లో నిలిచినవారు, లేదా చరిత్రను తమకు అనుకూలంగా రాసుకున్నవారే ఎక్కువగా కనిపిస్తారు. కానీ ఆ చరిత్రను మోసిన వారు, ఆ చరిత్రకు ఊపిరి పోసిన వారు, ప్రజల మధ్యనే ఉండి ప్రజల కోసం తమ జీవితాన్ని అర్పించినవారు చాలామంది ఉన్నారు. వారిలో అత్యంత ముఖ్యమైన, కానీ కావాలని మరిచిపోయిన పేరు ముచ్చర్ల సత్యనారాయణ. ఆయన జీవితం ఒక రాజకీయ జీవిత చరిత్ర కాదు. అది ఒక నిరంతర ప్రతిఘటన. అది ఒక రాజీ లేని స్వరం. అది తెలంగాణ ఆత్మగౌరవానికి నిలువెత్తు రూపం.తెలంగాణ స్వప్నం ఎప్పుడో మొదలైంది. అది **1969**లో ఒక్కసారిగా పుట్టిన కోరిక కాదు. అంతకుముందే ఆ నేలలో, ఆ ప్రజల్లో, ఆ యువతలో రగిలిన ఆవేదనల సమాహారం. ఆ ఆవేదనకు ముందుగానే స్వరం ఇచ్చిన అరుదైన వ్యక్తిత్వం ముచ్చర్ల సత్యనారాయణ. హన్మకొండ పట్టణానికి ఆనుకుని ఉన్న ముచ్చర్ల గ్రామం నుంచి వచ్చిన ఈ వ్యక్తి, గ్రామీణ తెలంగాణ గుండెచప్పుడిని తన మాటల్లో, పాటల్లో, రాజకీయాల్లో ప్రతిబింబించాడు. నాగారం, హన్మకొండ, వరంగల్ పరిసర ప్రాంతాల సామాజిక పరిస్థితులు, భూస్వామ్య దోపిడీ, రాజకీయ మోసాలు ఆయనను చిన్ననాటి నుంచే ప్రశ్నించేవి. చదువు ఆయనకు ఉద్యోగం కోసం కాదు. ప్రజలను అర్థం చేసుకోవడానికి, వ్యవస్థను ప్రశ్నించడానికి ఉపయోగపడింది.విద్యార్థి దశ నుంచే ఆయనలో తిరుగుబాటు స్పష్టంగా కనిపిస్తుంది. **1952**లో నానుల్కీ గో బ్యాక్ ఉద్యమం ఒక ఉదాహరణ మాత్రమే. హన్మకొండ మల్టీపర్పస్ కాలేజీలో చదువుతున్న యువకుడు, అప్పటికే తన ప్రాంత భవిష్యత్తుపై ఆలోచించడం ప్రారంభించాడు. అరెళ్ళ బుచ్చయ్య వంటి మిత్రులతో కలిసి ఆ ఉద్యమానికి నాయకత్వం వహించడం అంటే సాధారణ విషయం కాదు. ఆ ఉద్యమం ఫలితంగా తక్షణ విజయం రాకపోయినా, తెలంగాణ యువతలో రాజకీయ స్పృహను రగిల్చింది. అప్పుడే ముచ్చర్ల గ్రహించాడు - రాజకీయ పోరాటం అంటే పదవుల కోసం కాదు, ప్రజల భవిష్యత్తు కోసం.ఆంధ్ర - తెలంగాణ విలీనంపై అప్పటికే సాగుతున్న కుట్రలను ఆయన చాలా తొందరగానే గుర్తించాడు. ఆంధ్ర నాయకులు చెప్పే మాటలకు, చూపించే హామీలకు లోపల దాగి ఉన్న మోసాన్ని ఆయన చదివాడు. అందుకే ఉమ్మడి రాష్ట్రం తెలంగాణకు శాపంగా మారుతుందని **1954**లోనే హెచ్చరించాడు. ఆ హెచ్చరిక ఒక రాజకీయ ప్రకటనగా కాకుండా ఒక పాటగా రావడం ముచ్చర్ల ప్రత్యేకత.




**మన్నారం నాగరాజు.**
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

**"తెలంగాణ సోదరా తెలుసుకోరా వీరా..**
**మోసపోతే నీవు గోసపడుతావు"**

ఈ రెండు పంక్తుల్లో ఉన్న రాజకీయ విశ్లేషణ, దూరదృష్టి అప్పటి పెద్ద పెద్ద నాయకుల ప్రసంగాల్లో కూడా కనిపించదు. ఇది కేవలం కవి ఆవేదన కాదు. ఇది ఒక చైతన్యవంతుడైన రాజకీయ కార్యకర్త చేసిన హెచ్చరిక.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ హెచ్చరిక నిజమవుతుండటం మొదలైంది. రెండవ ఎస్సార్సీ సిఫార్సులను తుంగలో తొక్కి, తెలంగాణ ప్రజల అభిప్రాయాన్ని లెక్కచేయకుండా ఏర్పడిన రాష్ట్రం మొదటి రోజే నమ్మకద్రోహానికి బీజం వేసింది. నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తెలంగాణకు ఇచ్చిన రక్షణలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఉద్యోగాలు, నీళ్లు, నిధులు అన్నింటిలోనూ వివక్ష స్పష్టంగా కనిపించింది. ఆ సమయంలో చాలామంది నాయకులు మౌనం వహించారు. కొందరు పదవుల కోసం రాజీ పడ్డారు. కానీ ముచ్చర్ల మాత్రం మౌనం వహించలేదు. ఆయన గళం మరింత గట్టిగా మారింది.

**"సంజీవరెడ్డి మామా - అయ్యయ్యో రామ రామ**
**ఛలే జావో రాయలసీమా"**

ఈ పాట ఒక వ్యక్తిని మాత్రమే కాదు, ఒక వ్యవస్థను ప్రశ్నించింది. తెలంగాణ ప్రజల ఆగ్రహాన్ని నేరుగా వ్యక్తం చేసింది. అందుకే అది సభలకే పరిమితం కాలేదు. ప్రజల నోట నినాదంగా మారింది. ఆంధ్ర పాలకుల దోపిడీకి వ్యతిరేకంగా కేవలం భావోద్వేగంతో కాదు, స్పష్టమైన రాజకీయ అవగాహనతో ముందుకు వెళ్లిన వ్యక్తి ముచ్చర్ల. తక్కళ్ళపల్లి పురుషోత్తమ రావుతో కలిసి వరంగల్లో తెలంగాణ రక్షణల ఉద్యమ సమితిని స్థాపించడం ఒక కీలక మలుపు. ఇది కేవలం ఒక సంస్థ కాదు. ఇది ఒక భావజాల కేంద్రం. సభలు, ఉపన్యాసాలు, పాటలు -- అన్నీ ఆయుధాలయ్యాయి. ప్రజలను రాజకీయంగా చైతన్యపరచడమే లక్ష్యంగా పని జరిగింది. ముచ్చర్ల మాటల్లో ఆగ్రహం ఉండేది, కానీ అది అశ్రద్ధగా ఉండేది కాదు. అది ఆలోచనతో కూడిన ఆగ్రహం.1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ముచ్చర్ల జీవితంలో అత్యంత కీలక దశ. జనవరి 8న ఖమ్మంలో రవింద్రనాథ్ ఆమరణ నిరాహారదీక్ష సందర్భంగా జరిగిన సభలో ఆయన పాల్గొన్న తీరు ఇప్పటికీ ఉద్యమ చరిత్రలో ప్రత్యేకంగా నిలుస్తుంది. ఆ రోజుల్లో ఆయనకు తీరిక లేదు. ఒకే రోజు అనేక



గ్రామాలు, పట్టణాలు. అర్ధరాత్రి అయినా ప్రజలు ఆయన కోసం ఎదురుచూశారు. ఎందుకంటే ఆయన మాటల్లో నిజం ఉండేది. ఆయన పాటల్లో వారి బాధ ప్రతిధ్వనించేది.తెలంగాణ ఉద్యమంలో నాయకత్వంపై కూడా ఆయన రాజీ పడలేదు. ఎవరు ముందుండాలి? ఎవరు వెనక్కి తగ్గుతున్నారు? ఎవరు ప్రజలను మోసం చేస్తున్నారు? అన్న ప్రశ్నలు ఆయనను వెంటాడేవి. మర్రి చెన్నారెడ్డి వంటి నాయకులపై కూడా ఆయన ప్రశ్నలు సంధించాడు.

**"రావోయ్ రావోయ్ మర్రి చెన్నారెడ్డి**
**ఇకనైనా రావేమి వెర్రి చెన్నారెడ్డి"**

ఈ పాట వ్యక్తిగత దూషణ కాదు. అది నాయకత్వ బాధ్యతను గుర్తు చేసే రాజకీయ వ్యాఖ్య. 1971లో తెలంగాణ ప్రజాసమితి లోక్?సభ స్థానాలు గెలిచినా, ఆ తర్వాత తెలంగాణ వాదం నీరుగారిపోవడం ముచ్చర్లను తీవ్రంగా బాధించింది. ప్రజల నిరాశకు ఆయన స్వరం అయ్యాడు.1969 ఉద్యమాన్ని కాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా అణిచివేసింది. 369 మంది ఉద్యమకారుల బలిదానాలు తెలంగాణ చరిత్రలో మచ్చలుగా నిలిచాయి. ఆ సమయంలో చాలామంది వెనక్కి తగ్గారు. కానీ ముచ్చర్ల తగ్గలేదు. ఉద్యమం వీధుల్లో నొక్కబడితే, భావజాల రంగంలో కొనసాగించాడు. దేవులపల్లి ప్రభాకర్ రావుతో కలిసి "జై తెలంగాణ" పత్రికను స్థాపించి, ఆలోచనల యుద్ధాన్ని కొనసాగించాడు. ఇది ఆయుధం మారిన పోరాటం. కానీ లక్ష్యం మారలేదు. గాంధీజీ గ్రామ స్వయంపాలన ఆలోచనలు ముచ్చర్లను బలంగా ప్రభావితం చేశాయి. హన్మకొండ పంచాయితీ సమితి అధ్యక్షుడిగా రెండు సార్లు ఎన్నికై, ఆయన అమలు చేసిన కార్యక్రమాలు ఇప్పటికీ ఉదాహరణలుగా చెప్పుకుంటారు. అధికారులతో పని ఎలా చేయించాలో, ప్రజలకు వ్యవస్థను ఎలా ఉపయోగించాలో ఆయనకు తెలిసినంతగా మరెవరికీ తెలియదంటే అతిశయోక్తి కాదు. పంచాయితీ రాజ్ వ్యవస్థ ద్వారా గ్రామాల్లో నిజమైన ప్రజాస్వామ్యం సాధ్యమని ఆయన నమ్మాడు.ముచ్చర్ల జీవితంలో రెండు స్వప్నాలు ఎప్పుడూ కలిసి నడిచాయి. ఒకటి తెలంగాణ రాష్ట్రం. రెండవది బహుజనుల రాజ్యం. అగ్రకుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఆయన నిరంతరం పోరాడాడు. ఎవరి పెత్తనాన్ని ఆయన సహించలేదు. అవసరమైతే ఒంటరిగా నిలబడ్డాడు. 1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించినప్పుడు ఎన్టీ రామారావు స్వయంగా పిలిచి టికెట్ ఇవ్వడం ముచ్చర్ల రాజకీయ స్థాయికి నిదర్శనం. హయగ్రీవాచారిని ఓడించి మంత్రి కావడం ఆయనకు గర్వకారణం కాదు. రవాణాశాఖ మంత్రిగా పనిచేసినప్పుడు కూడా ఆయన ప్రజల వైపే నిలిచాడు. కానీ ఎన్టీఆర్లోని అహంభావం, అప్రజాస్వామిక ధోరణిని ఆయన భరించలేకపోయాడు. నాదెండ్ల భాస్కర్రావుతో కలిసి తిరుగుబాటు చేయడం పదవి కోసం కాదు - విలువల కోసం. ఆ తిరుగుబాటు విఫలమైనా, ఆయన నిలువెత్తు నైతికత ఓడిపోలేదు. తరువాత కాలంలో బహుజనులను ఆర్గనైజ్ చేయడమే ప్రధాన లక్ష్యంగా మారింది. కొండలక్ష్మణ్ బాపూజీతో కలిసి పనిచేశాడు. దేశమంతా తిరిగి కులసంఘాలు, సమాఖ్యలు ఎలా నిర్మించాలో అధ్యయనం చేశాడు. కాన్షీరామ్?తో కలిసి పని చేసి, ఉత్తరప్రదేశ్, బీహార్?లలో బహుజనులు అధికారంలోకి రావడానికి గల కారణాలను పరిశీలించాడు. ఇది కేవలం రాజకీయ ప్రయోగం కాదు. ఇది ఒక సామాజిక అధ్యయనం.

మలిదశ తెలంగాణ ఉద్యమంలో కూడా ఆయన రాజీ పడలేదు. గద్దర్?తో, తరువాత కేసీఆర్?తో కలిసి పనిచేశాడు. తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావంలో పాత్ర వహించాడు. కానీ ఎక్కడ అప్రజాస్వామిక ధోరణి కనిపించినా ఆయన నిలబడలేదు. అందుకే కేసీఆర్?తో కూడా పొసగలేదు. మూడు దశల తెలంగాణ ఉద్యమాల్లో పాల్గొని నాయకత్వం వహించిన అరుదైన వ్యక్తిత్వం ముచ్చర్ల సత్యనారాయణ.ఇంత చేసిన వ్యక్తిని ఈ సమాజం ఎంతవరకు గుర్తించింది? ఇది మనం వేసుకోవాల్సిన ప్రశ్న. ఆయన పాటలు, రచనలు, ఆలోచనలు నేడు పాఠ్యాంశాలుగా మారాయా? తెలంగాణ విశ్వవిద్యాలయాల్లో ఆయన పేరు ఎంతమందికి తెలుసు? ట్యాంక్ బండ్?పై విగ్రహాలు ఉన్నవారిలో ఎంతమంది నిజంగా తెలంగాణ కోసం జీవితాన్ని అర్పించారు? ఈ ప్రశ్నలు అసౌకర్యంగా ఉన్నా తప్పించుకోలేం. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం ,ముచ్చర్ల సత్యనారాయణను గుర్తించడం కేవలం ఒక వ్యక్తికి గౌరవం ఇవ్వడం కాదు. అది తెలంగాణ ఉద్యమాన్ని నిజాయితీగా అర్థం చేసుకోవడం. అది భవిష్యత్తు తరాలకు విలువల రాజకీయాన్ని పరిచయం చేయడం. ట్యాంక్ బండ్?పై ఆయన విగ్రహం నిలబడాలి. విశ్వవిద్యాలయాల సిలబస్?లో ఆయన జీవితం చోటు దక్కాలి. ఇది దయ కాదు. ఇది చరిత్రకు చేయాల్సిన న్యాయం.తెలంగాణకు స్వరం ఇచ్చిన ముచ్చర్ల సత్యనారాయణ జీవితం ఒక ఉద్యమం. ఒక పాఠం. ఒక నిరంతర బాధ్యత, కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేస్తుందని ఆశిద్దాం.

(జనవరి 21న ముచ్చర్ల జయంతి సందర్భంగా..)



# దేవుని కడప శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

**- ధ్వజారోహణంతో ప్రారంభం**

**కడప,జనవరి19( వెలుతురు):**
కడప జిల్లా, దేవుని కడపలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఉదయం ధ్వజారోహణంతో శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులు, గరుడ ధ్వజపటాన్ని ఆలయ ప్రదక్షిణగా తీసుకొచ్చారు. సకలదేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 10.00 గం.ల నుండి 10.30 గం.ల మధ్య తిరుచ్చి ధ్వజారోహణ ఘట్టాన్ని నిర్వహించారు. ఇందులో గరుత్మంతుని చిత్రంతో కూడిన ధ్వజపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజస్తంభంపైకి అధిష్టింపచేశారు. కాగా, రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామి వారు విహరించనున్నారు. దేవుని కడప శ్రీ లక్ష్మివేంకటేశ్వర స్వామి ఆలయం అతి పురాతనమైనది. కృష్ణాచార్యులు ఇచ్చట శ్రీ వేంకటేశ్వరుని ప్రతిష్టించినట్లు ప్రతీతి. తిరుమల వరాహ క్షేత్రమైతే దేవుని కడప హనుమత్ క్షేత్రం. ఇక్కడ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వెనుక భాగమున ఆంజనేయ స్వామి విగ్రహం ఉంది. శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల వారు ప్రత్యక్షంగా సేవించి, స్వామివారిని కడప రాయుడని, వేంకటాద్రి కడప రాయుడని పేర్కొన్నారు. పూర్వం తిరుపతికి వెళ్లే యాత్రికులకు మార్గమిదే. దేవుని కడపలో వెలసియున్న శ్రీ స్వామివారి దర్శనాంతరమే తిరుమలేశుని దర్శించడం సాంప్రదాయంగా వస్తోంది. ఈ ఆలయంలో రాజగోపురం, తిరుపతి శ్రీ గోవిందరాజ స్వామి ఆలయ గోపురం ఒకే కాలంలో నిర్మించినట్లు శాసనం ద్వారా తెలుస్తోంది. స్వామివారి రథోత్సవం, రథసప్తమి రోజున కన్నుల పండవగా నిర్వహిస్తారు. రథసప్తమిరోజున భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శిస్తారు. కాగా, జనవరి 24వ తేదీ ఉదయం 10.30 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం జరుగనుంది. రూ.300/- చెల్లించి గృహస్తులు(ఇద్దరు) కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. జనవరి 28న సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం జరుగనుంది.వాహన సేవలలో భాగంగా శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి వారు ఉదయం 09.00 గం.ల నుండి 10.00 గం.ల వరకు రాత్రి 08.00 గం.ల నుండి 09.00 గం.ల వరకు విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు. ఉత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ప్రతిరోజు వాహనసేవల ముందు కోలాటాలు, హరికథ, భజన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమయ్య సంకీర్తనలను ఆలపించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## నా కూతురు మరణానికి కారణమైన వారిని శిక్షించాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ను వేడుకున్న కన్నతల్లి




**బషీర్ బాగ్ వెలుతురు 19 జనవరి :**

ప్రేమ పేరుతో తన కూతురి మరణానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఓ బాధిత తల్లి రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ను ఆశ్రయించింది. ఘట్కేసర్ అవుషాపూర్ లోని నీలిమ నర్సింగ్ కాలేజీలో బిఎస్సి మూడవ సంవత్సరం చదువుతున్న తన కూతురు పూజిత గత ఏడాది నవంబర్ లో అనుమానాస్పద స్థితిలో మరణించిందని మృతురాలి తల్లి పుష్మమ్మ కమిషన్ దృష్టికి తీసుకొచ్చింది. గత మూడేళ్ళుగా ప్రేమ , పెళ్లి పేరుతో ప్రవీణ్ అనే వ్యక్తి తన కూతురిని మభ్యపెట్టి ఆమె మృతికి కారణం అయ్యారని కన్నీరు పెట్టుకుంది. ఆర్మీ లో ఉద్యోగం వచ్చాక తన కూతురిని పెళ్లి చేసుకొనని చెప్పడంతో , తాను మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుందని తెలిపింది. ఈ ఘటనపై ఘట్కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వాపోయింది. తన కూతురి మృతికి కారణమైన ప్రవీణ్ , అతనికి సహకరిస్తున్న ఘట్కేసర్ పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కమిషన్ ను వేడుకుంది.

## మున్సిపల్ ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లు తగ్గించినందుకు డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ జేఏసీ నిరసన

**- 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేశాకే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలి**

**- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు జనవరి 19:**

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేసిన రాష్ట్ర ప్రభుత్వం, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో ను బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా మోసం చేసిందని మున్సిపల్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు తగ్గించినందుకు ఈరోజు హైదరాబాద్ లోని లోయర్ ట్యాంక్ బండ్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్ మాట్లాడుతూ బీసీలను రిజర్వేషన్ల విషయంలో అన్ని పార్టీలు మోసం చేస్తూనే ఉన్నాయని అన్నారు. బిఆర్ఎస్,బీజేపీ పార్టీలు కూడా బీసీ లకు రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వడం లేదని అడగకుండా కాంగ్రెస్ పార్టీ తానా అంటే ఈ రెండు పార్టీలు తందానా అంటున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కుక్కచర్ల శ్రీనివాస్ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు కనకాల శ్యాం గజ్జెల సత్యం భాస్కర్ రాంబాబు వెంకటేశ్వర్లు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పండుగ అయిపోయిన స్పెషల్ బస్ పేరుతో ప్రయాణికుల జేబులు ఖాళీ చేస్తున్న ఆర్టీసీ

**- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ఆగ్రహం**




**హైదరాబాద్ వెలుతురు జనవరి 19:**

స్పెషల్ బస్సుల పేరుతో ఆర్టీసీ ప్రయాణికుల జేబులు గుల్ల చేస్తున్నాయని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒకపక్క ఉచిత ప్రయాణం అంటూ మరో పక్క ఈ విధంగా దోచుకోవడం సరికాదన్నారు. పండుగ అయిపోయి రెండు రోజులైనా ఇంకా బస్ చార్జీలు తగ్గించకుండా అదే రీతిన వ్యవహరిస్తున్నారు. మిర్యాలగూడ నుంచి హైదరాబాద్ కు రూ. 330 ఉండగా అదనంగా రూ. 120 వసూలు చేయడం ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## టిజివో అసోసియేషన్ హైద్రాబాద్ జిల్లా క్యాలెండర్లను ఆవిష్కరించిన ఎం.బి.కృష్ణ యాదవ్






**హైదరాబాద్ వెలుతురు జనవరి 19:**

తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం. బి. కృష్ణ యాదవ్ పంజాగుట్ట శ్రీనగర్లోని శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ఈ నూతన సంవత్సరములో తెలంగాణ రాష్ట్ర సకల ఉద్యోగులు, ప్రజలు సుఖసంతోషాలతో, ఉండాలని ప్రార్థించారు. ఇట్టి కార్యక్రమంలో టెంపుల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగారెడ్డి మరియు అక్కడి సిబ్బందితో కలిసి టిజివో అసోసియేషన్ హైద్రాబాద్ జిల్లా క్యాలెండర్లను అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి డాక్టర్ క్రొత్త విద్యాసాగర్, ఆఫీసు సెక్రెటరీ గోపాలకృష్ణ, ఉపేందర్ సింగ్, వెంకటరమణ తదితరులు పాల్గొనారు.

## మంచాల సూపర్ స్టార్స్ యూత్ ఏర్పుల వినయ్ ఆధ్వర్యంలో క్రీడోత్సవాలు

**- క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేసిన మంచాల గ్రామసర్పంచ్ ఏర్పుల మానస వినయ్, ఉపసర్పంచ్ పందుల లింగంగౌడ్ గౌడ్**




**మంచాల వెలుతురు జనవరి 19:**

మంచాల మండలం సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంచాల గ్రామంలోమంచాల సూపర్ స్టార్ సీజన్ 4 స్పాన్సర్ ఏర్పుల వినయ్ ఆధ్వర్యంలో క్రీడోత్సవాలు నిర్వహించారుఈ క్రీడల్లో క్రికెట్ వాలీబాల్, ముగ్గుల పోటీలు నిర్వహించారుఆదివారం రాత్రి క్రీడల్లో గెలుపొందిన వారికి బహు మతుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ ఏర్పుల మానస వినయ్ ఉపసర్పంచ్ పందుల లింగంగౌడ్ వార్డు సభ్యులు హాజ రుఅయినారు క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకుసర్పంచ్ ఏర్పులమానస వినయ్ ముగ్గుల పోటీల బహుమతులు ఉపసర్పంచ్ లింగం మరియు వార్డుసభ్యులు గ్యార జంగయ్య,శేఖర్ దూసరి కల్పన పారిజాత సాయిలు ఎరుకొండ రచన,మహేష్, శ్రీశైలం మాధవి నాయకులు యూత్ మెంబర్స్ కలిసి బహుమతులు అందజేశారుప్రత్యేక ఆకర్షణగాచిన్నారుల నృత్యాలు అలరించాయి పదవతరగతి మరియు ఇంట ర్మీడియట్ పరీక్షలురాసే విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్ మరియు డిక్షనరీలు చెరుకూరు మహేందర్ గారు అందజేశారుఅనంతరం నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో చిన్నారులు యువత గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారుఈ కార్యక్ర మం విజయవంతం అవడం కోసం ముఖ్యంగా సూపర్ స్టార్స్ ప్రెసిడెం ట్ గడ్డం శ్రీకాంత్ సభ్యులు గ్యార గణేష్ గడ్డం భరత్ కళ్యాణ్ మంత్రి ప్రశాంత్ గడ్డం ప్రశాంత్ ఏర్పుల మధు అనంగారి శ్రీకాంత్ జంగళ్ళబా బా గుడిసె రామ్ గడ్డం అజయ్ అ నంగారి భారత్ వంగల వంశీ సీజన్ 1,2,3 కమిటీ సభ్యులు ఏర్పు ల నరేష్ మంత్రి ప్రవీణ్ గ్యార రమేష్ చేతలవినోద్ గ్యార కృష్ణ అలాగే గ్రామయువత మాజీ ప్రజా ప్రతిని ధులు గడ్డం రాజేష్, గడ్డం వెంకట రమణ గ్యార పుష్పలత వివిధ రాజకీయ పార్టీ నాయకులు ఏర్పుల నరసింహ గ్యార జగన్ గడ్డం మైసయ్య గడ్డం రాజు చెరుకూరి నరసింహ అనంగారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

## డ్వాక్రా మహిళా పొదుపు సంఘాలకు 3 కోట్ల 50 లక్షలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**- మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం**

**- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**



**ఇబ్రహీంపట్నం వెలుతురు జనవరి 19:**

ఇబ్రహీంపట్నం శాస్త్రగార్డెన్ లో జరిగిన ఇందిరా మహిళా శక్తి సంబరాల సందర్భంగా పట్టణ పేదరికనిర్మూలనసంస్థ (మెప్మా)ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సందర్భంగా డ్వాక్రా మహిళా పొదుపు సంఘాలకు 3 కోట్ల 50 లక్షల వడ్డీ లేని ఋణాలు పంపిణి చేశారు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ మహిళల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుంది అని అన్నారు ప్రతి మహిళను కోటీశ్వరులుగాచేయాలన్నది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## వనస్థలిపురంలో గ్రిల్సియస్ కిచెన్ ఘన ప్రారంభోత్సవం







**ఎల్బీనగర్, వెలుతురు జనవరి 19:**

వనస్థలిపురం డిమార్ట్ సమీపంలో ఏర్పాటు చేసిన గ్రిల్సియస్ కిచెన్ రెస్టారెంట్ ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, తన చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి రెస్టారెంట్ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, జిట్టా రాజశేఖర్ రెడ్డి, ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న గౌడ్ తదితరులు పాల్గొని ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు. రెస్టారెంట్ నిర్వాహకులు మహమ్మద్ జావేద్ను నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్య నాయకులను నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, "ఈ పరిసర ప్రాంత ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన తినుబండారాలను అందించేందుకు ముందుకు వచ్చిన గ్రిల్సియస్ కిచెన్ నిర్వాహకులను అభినందిస్తున్నాను" అని అన్నారు. రెస్టారెంట్ నిర్వాహకులు మహమ్మద్ జావేద్ మాట్లాడుతూ, "మా గ్రిల్సియస్ కిచెన్లో గ్రిల్స్, బ్రెస్ట్, వ్రాప్స్, ప్లేటర్స్, షవర్మా వంటి ప్రత్యేక వంటకాలను వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నాం" అని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బంధుమిత్రులు, అభిమానులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మాజీ గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్ రావుతో కలిసి సత్యనారాయణకు కూకట్ పల్లి బిజెపి నాయకులు ఘన సన్మానం...



**కూకట్ పల్లి జనవరి 19 వెలుతురు:**

మహారాష్ట్ర మాజీ గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్ రావు తో కలిసి కూకట్పల్లి బిజెపి నాయకులు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ మాజీ అధ్యక్షులు సత్యనారాయణ ని వారి నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలసి ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గతంలో పార్టీ అభివృద్ధి కోసం కలిసి పనిచేసిన అనుభవాలు, ఆనాటి జ్ఞాపకాలను వారు గుర్తు చేసుకుంటూ పలు రాజకీయ, సామాజిక అంశాలపై ఆత్మీయంగా చర్చించారు. పార్టీ బలోపేతానికి అప్పట్లో చేసిన సేవలను కొనియాడుతూ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాయినేని సూర్యప్రకాశ్ రావు, అర్చనపల్లి సూర్యారావు, మేడ్చల్మల్కాజ్గిరి జిల్లా ఇన్చార్జ్ ఎస్. మల్లారెడ్డి, నిజాంబాద్ జిల్లా ఇన్చార్జ్ మాధవరం కాంతారావు, జిల్లా కార్యదర్శి యాంజాల పద్మయ, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలగిరి సాగర్ మండల స్థాయి సీఎం కప్ సమావేశం



**తిరుమలగిరి (సాగర్) వెలుతురు న్యూస్ జనవరి 19:**

సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం లో సీఎం కప్ మండల సమావేశం నిర్వహించారు ఈ సమావేశం లో ఎంపీడీఓ బిక్షంరాజు ఏంఈఓ కొనమంచిలి శ్రీనివాస్ మండల ఫిసికల్ డైరెక్టర్ సత్యనారాయణ రిటైర్డ్ పిఈటి పసుపులేటి నర్సింహా రావు పాల్గొన్నారు ఈ సమావేశం ముఖ్య ఉద్యేశం గ్రామ స్థాయిలో నిర్వహించే క్రీడల్లు అంతేలేటిక్స్ కబడ్డీ వాలీబాల్ ఫుట్ బాల్ కోకో యోగ ఈ క్రీడలల్లో పాల్గొనే క్రీడాకారులు ఈ నెల 21వ తేదీలోపు ఆన్లైన్ లో నమోదు చేయించుకోగలరని అన్నారు పూర్తి వివరాలకు మండల ఫిజికల్ డైరెక్టర్ సత్యనారాయణ రిటైర్డ్ పి ఈ టీ జ్వాలా నర్సింహారావు ని సంప్రదించగలరు అని అన్నారు ఫోన్ : 9949451106, 6303232480

## హిమాయత్ నగర్ డివిజన్ లో చాలా పనులు ఆగిపోయాయి

**- ఉన్నతాధికారులను కలిసి పనులు పూర్తి చేయాలని కోరిన కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్...**

**హైదరాబాద్ వెలుతురు జనవరి 19:**

హిమాయత్ నగర్ డివిజన్ లో చాలా పనులు ఆగిపోయాయని , ఆగిపోయిన పనులను పూర్తి చేయడానికి సత్వరం చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ప్రియాంక , డి ఎం సి శ్రీనివాసులను సోమవారం కలిసి విజ్ఞప్తి చేశారు. హిమాయత్ నగర్ డివిజన్ 16 సర్కిల్ అంబర్పేట్ నుంచి 35 సర్కిల్ ఖైరతాబాద్ లో మార్చడంతో ఉన్న అధికారులు అంబర్పేట్ కి వెళ్లిపోవడంతో ఖైరతాబాద్ కి ఎంపికైన నూతన అధికారులు ఛార్జ్ తీసుకోకపోవడం వల్ల హిమాయత్ నగర్ డివిజన్లోని చాలా పనులు ఆగిపోయాయని కార్పొరేటర్ ఈ సందర్భంగా అధికారులకు వివరించారు. ఆగిపోయిన పనులకు సంబంధించిన వివరాల తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే డివిజన్ కు సంబంధించి సంబంధిత అధికారులను చార్జ్ తీసుకునేలా చూడాలని రూరల్ కమిషనర్ కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహేష్ వారి వెంబట ఉన్నారు.

## రోడ్డు భద్రతే లక్ష్యంగా విద్యార్థులకు అవగాహన

**- భాష్యం హై స్కూల్లో కూకట్ పల్లి ట్రాఫిక్ పోలీసుల సదస్సు...**






**కూకట్ పల్లి జనవరి 19 వెలుతురు :**

రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా సోమవారం కూకట్ పల్లి వివేకానంద నగర్లోని భాష్యం హై స్కూల్లో ట్రాఫిక్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ జి. తిమ్మప్ప, ఎస్ఐలు సత్యనారాయణ, ఫిలిప్ డోరాడో లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఐ తిమ్మప్ప మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. చిన్న వయస్సు నుంచే ట్రాఫిక్ నియమాలను తెలుసుకుని వాటిని పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని వివరించారు. అనంతరం రోడ్డు భద్రత అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా, ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు తమ ఆలోచనలను వ్యక్తం చేశారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, పాఠశాల సిబ్బంది, సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## రామకృష్ణ నగర్, రిక్షా పుల్లర్స్ కాలనీలో తాగునీటి సమస్యపై మెట్రో వాటర్ అధికారులకు వినతి...



**కూకట్ పల్లి జనవరి 19 వెలుతురు:**

హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా రామకృష్ణ నగర్, రిక్షా పుల్లర్స్ కాలనీలకు సంబంధించిన తాగునీటి సమస్యపై మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు స్థానిక నాయకులతో కలిసి అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీజీఎం శివ, మేనేజర్ ప్రియాంక లను కలిసి గత 25 రోజులుగా రామకృష్ణ నగర్, రిక్షా పుల్లర్స్ కాలనీ, హనుమాన్ నగర్, ప్రగతి నగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరా సరిగా లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం రంగారావు మాట్లాడుతూ, పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ సమస్యను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాథమిక అవసరమైన తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఆయా కాలనీల ప్రజలందరినీ కలుపుకొని హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల భద్రయ్య, మధు, యూసఫ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశం

**- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**





**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 19:**
నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని చిట్యాల మున్సిపాలిటీలో గల ముప్పా మల్లారెడ్డి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశానికి నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్డుల వారీగా పలువురు ఇంచార్జిలను ఆయన నియమించారు, రాబోయే ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల గెలుపుకు అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన పలు సూచనలు చేశారు...

## చెరువుగట్టు బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం**



**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 19:**
ఈ నెల 23 నుండి జరగనున్న నార్కెట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలోని శ్రీ శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వారి బ్రహోత్సవాల వాల్ పోస్టర్ ను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం నాడు అవిష్కరించారు.. శ్రీ శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వారి బ్రహోత్సవములకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను కోరారు.

## అమావాస్య సందర్బంగా మిర్యాల రామలింగయ్య జ్ఞాపకార్ధంగా అన్నదానం

**- ధైద నాగరాజు మనం స్వచ్ఛంద సంస్థ చైర్మెన్**



**నార్కెట్ పల్లి వెలుతురు జనవరి19:**
నార్కెట్ పల్లి వాస్తవ్యులు మిర్యాల రామలింగయ్య జ్ఞాపకార్థం గా వారి భార్య బిక్షాటన చేసే వారికీ,నిరుపేదలకు, బాటసారులకు, నిస్సహాయులకు 100మందికి మనం స్వచ్ఛంద సంస్థ ద్వారా 480రోజున అన్నదానం చేయడం జరిగింది,కుటుంబ సభ్యులు మాట్లాడుతూ అమావాస్య దినంనా మా నాన్న ఈ అన్నదానం రూపంలో మరోసారి నిరుపేదల ఆకలి రూపంలో కనిపిచ్చినట్లు మా కుటుంబం మొత్తానికి ఎంతో సంతోషాన్ని కలిగించిది, మనం స్వచ్ఛంద సంస్థ కి ధన్యవాదములు.మేము సమాజంలో ఇంత గొప్ప పేరుతో ఉండానికి మా అమ్మ నాన్నల కష్టం కృషి ఎంతో ఉంది. వారి మేలు ఈ జన్మలో తీర్చుకోలేము,ఈ కార్యక్రమం లో మిర్యాల రాజేశ్వరమ్మ, కొడుకులు కోడళ్ళు,మిర్యాల సత్యనారాయణ –సహజ. మిర్యాల శ్రీనివాసులు – శ్రావంతి. మిర్యాల నవీన్ కుమార్ – తేజ శ్రీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సర్పంచ్ చేతుల మీదుగా చిన్నారికి అన్నప్రాసన



**గుండాల, జనవరి 19 (వెలుతురు):**
గుండాల మండల కేంద్రంలోని వడ్డరి కాలనీలో ఉన్న అంగన్వాడి సెంటర్‌లో గ్రామ సర్పంచ్ దేవన బోయిన ఐలయ్య చేతుల మీదుగా చిన్నారికి అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అంగన్వాడి సెంటర్‌లో అందిస్తున్న పోషకాలతో కూడిన వివిధ రకాల పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా వినియోగించాలన్నారు. అంగన్వాడి కేంద్రం చిన్నారుల భవిష్యత్తుకు పునాది వంటిదని పేర్కొన్న సర్పంచ్, ఈ కేంద్రం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే నూతన భవనం నిర్మాణ పనులు ప్రారంభించామని, వాటిని త్వరలో పూర్తిచేసి అంగన్వాడి పాఠశాలను నూతన భవనం ప్రారంభిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పండుగ ఉపేందర్, చిన్నారుల తల్లులు, చిన్నారులు, అంగన్వాడి ఉపాధ్యాయురాలు సునీత, ఆశ కార్యకర్తలు కలమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ప్రైమ్ 9 న్యూస్ 2026 నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించిన బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 19:**
నల్గొండ జిల్లా నార్కట్పల్లి మండల కేంద్రంలో ప్రైమ్ 9 న్యూస్ నూతన సంవత్సరం 2026 క్యాలెండర్ ఆవిష్కరణ చేసిన బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ మారుమూలల గ్రామాలలో ప్రజల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తు నిజాన్ని నిర్భయంగా రాస్తూ ప్రజల మననలు పొందుతున్న ప్రైమ్ 9 చానల్ కు యజమాన్యానికి సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు అలాగే నకిరేకల్ నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ లో ఎంతో అత్యున్నత స్థాయిలో ఉన్న ప్రైమ్ నైన్ ఛానల్ దేశంలో కూడా ఉన్న స్థాయికి ఎదగాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో ప్రైమ్ 9న్యూస్ ఛానల్ రిపోర్టర్ బండారు చంద్రశేఖర్ బిఆర్ఎస్ పార్టీ వార్డ్ మెంబర్లు బోయపల్లి శ్రీనివాస్ గౌడ్, మెడబోయిన రాంబాబు, నడింపల్లి నరేష్, మాజీ మైనార్టీ కో ఆప్షన్ సభ్యుడు ఎం వాజిద్, మాజీ వార్డు సభ్యులు పుల్లెంల మహేష్, బొబ్బలి దేవేందర్, డీజే రాజు, బిఆర్ఎస్ పార్టీ యువజన మండల అధ్యక్షులు పుల్లెంల వెంకట్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ యువజన పట్టణ అధ్యక్షులు నడింపల్లి మహేష్, బిఆర్ఎస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు ంఎ జానీ, జిట్టా వెంకన్న, గడ్డం సత్తయ్య, రాగిరి శంకర్, ఐతరాజు రాజేష్, బొబ్బలి మహేష్, బాజ హేమంత్, తదితరులు పాల్గొన్నారు

## రైతు భరోసా అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ నిరసన



**గుండాల, జనవరి 19 (వెలుతురు):**
గుండాల మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ రైతు డిక్లరేషన్‌లో భాగంగా బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో రైతు భరోసా, కౌలు రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయకపోవడంపై బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చిన ప్రభుత్వం, అమలు విషయంలో మాత్రం మొండిచేయి చూపుతోందని విమర్శించారు. రైతులు అప్పుల భారంతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ కి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి, జిల్లా కోశాధికారి మండల ప్రభాకర్, గుజ్జ సోమ నరసయ్య, మండల ఉపాధ్యక్షులు వెంపటి సురేష్, బుక్క చంద్రశేఖర్, మండల కార్యదర్శి కుక్కల కృష్ణ పాల్గొన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు యమగాని బాలయ్య, ముత్యం సోమయ్య, ఆవుల సాయి తేజ, రొయ్యల ఉపేందర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు సింగారం సోమరాజు, ఇమ్మడి నాగరాజు, పాపయ్య తదితరులు హాజరయ్యారు.అనంతరం శక్తి కేంద్రం ఎలిమినేటి ఎల్లయ్య, అంబాల శక్తి కేంద్రం ఇంచార్జ్ కిషోర్ పాల్గొన్నారు.రైతు భరోసా సహా ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బీజేపీ నాయకులు హెచ్చరించారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కొరకు లక్ష రూపాయలు విరాళం

**- బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్. పాండురంగారెడ్డి.**



**తిరుమలగిరి సాగర్ వెలుతురు న్యూస్ జనవరి 19:**
తిరుమలగిరి సాగర్ మండల కేంద్రము, తిరుమలగిరి సాగర్ గ్రామంలో వున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కొరకు తిరుమలగిరి సాగర్ గ్రామ యూత్ కోరిక మేరకు లక్ష రూపాయలు విరాళం యువతకు అందజేసిన బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండన్న వీరితో పాటు ఈ కార్యక్రమంలో తిరుమలగిరి సాగర్ మండలం మాజీ వైస్ యంపిపి యడవెల్లి దిలీప్ కుమార్ రెడ్డి, అనుముల మండలం మాజీ వైస్ యంపిపి తిరుమలనాథ గుడి మాజీ చైర్మన్ బుర్రి రామిరెడ్డి,పిట్టల కృష్ణ, పసుపులేటి నరసింహా రావు,మహేశ్వరం రాంబాబు, షేక్ అక్రమ్,బీరల రామకృష్ణా రెడ్డి,వినయ్,చవ్వా నవీన్ రెడ్డి,చెన్నకేశవ రెడ్డి,పసుపులేటి నితిన్,మురళి,ముస్తాఫ,వల్లభ, బ్రహ్మం,మల్లయ్య, నారాయణ,చాంద్ బాషా, నరేష్,పిట్టల కృష్ణ మరియు తిరుమలగిరి సాగర్ గ్రామ యూత్ తదితరులు పాల్గొన్నారు...
తిరుమలగిరి సాగర్ మండల కేంద్రము, తిరుమలగిరి సాగర్ గ్రామంలో వున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కొరకు తిరుమలగిరి సాగర్ గ్రామ యూత్ కోరిక మేరకు లక్ష రూపాయలు విరాళం యువతకు అందజేసిన బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండన్న వీరితో పాటు ఈ కార్యక్రమంలో తిరుమలగిరి సాగర్ మండలం మాజీ వైస్ యంపిపి యడవెల్లి దిలీప్ కుమార్ రెడ్డి, అనుముల మండలం మాజీ వైస్ యంపిపి తిరుమలనాథ గుడి మాజీ చైర్మన్ బుర్రి రామిరెడ్డి,పిట్టల కృష్ణ, పసుపులేటి నరసింహా రావు, మహేశ్వరం రాంబాబు, షేక్ అక్రమ్,బీరల రామకృష్ణా రెడ్డి,వినయ్,చవ్వా నవీన్ రెడ్డి,చెన్నకేశవ రెడ్డి, పసుపులేటి నితిన్, మురళి, ముస్తాఫ,వల్లభ, బ్రహ్మం,మల్లయ్య, నారాయణ, చాంద్ బాషా, నరేష్,పిట్టల కృష్ణ మరియు తిరుమలగిరి సాగర్ గ్రామ యూత్ తదితరులు పాల్గొన్నారు...

## పారిశుధ్య కార్మికులతో కలసి చీపురు పట్టి ..శుభ్రం చేసి..

**- స్ఫూర్తినిచ్చిన గ్రామ వార్డు మెంబెర్ ముత్యాల కిషన్**



**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 19:**
పరిశుభ్రత తోనే ఆరోగ్యంగా ఉండగలమని నీర్నెముల గ్రామాన్ని ప?రిశుభ్రంగా ఉంచ?డంలో ప్రతి ఒక్కరూ త?మవంతు కృషి చేయాలని నీర్నెముల గ్రామ 6వ వార్డు మెంబెర్ ముత్యాల కిషన్ అన్నారు. సోమవారం 6వ వార్డు లో పారిశుధ్య కార్మికులతో కలసి చీపురు పట్టి పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు.ఈ సందర్భంగా వార్డు సభ్యులు ముత్యాల కిషన్ మాట్లాడుతూ మన ఇంటితో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత అని వార్డు మెంబెర్ సూచించారు.చెత్తను కాలువ?ల్లోను, రోడ్ల పక్కన వేయకుండా పారిశుధ్య కార్మికులు ఇంటివ?ద్దకు వ?చ్చిన?ప్పుడే చెత్తను అందించాలన్నారు. ప?రిస?రాలు శుభ్రంగా ఉంచడం వల్ల ప?ర్యావ?ర?ణ ప?రిర?క్షణ?, వ్యాధుల నివార?ణ?కు దోహ?దప?డుతుంద?ని అయన తెలిపారు. తడి, పొడి చెత్త వేరు వేరుగా వేసుకోవాలని వార్డు సభ్యులకు అవగాహన కల్పించాలరు. అక్కడే ఉన్నపారిశుధ్య కార్మికులతో వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించే సమయంలో ఖచ్చితంగా గ్లౌస్ లు, మాస్క్ లు ధరించాలని వారు సూచించారు. పారిశుధ్య కార్మికులకు ఖచ్చితంగా ఆరోగ్య పరీక్షలు ప్రతి నెల చెపించుకొని పారిశుధ్య కార్మికులు పోషకాహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని వారు పారిశుధ్య కార్మికులకి సూచించారు.6వ వార్డును పారిశుధ్య కార్మికులతో కలిసి శుభ్రం చేయడంతో గ్రామస్తులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ వార్డు సభ్యులు ముత్యాల కిషన్ ను అభినందించారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలలో అంబేద్కర్ చిత్రపటం తప్పనిసరి

**- మాల మహానాడు ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) భాస్కరరావుకు వినతి పత్రం అందజేత**



**వలిగొండ వెలుతురు న్యూస్ జనవరి 19:**
ఈ నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలో రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటం పెట్టాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు పెరుమాండ్ల యాదగిరి, వలిగొండ మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) భాస్కరరావు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామం నుండి జిల్లా వరకు గవర్నమెంట్ ఆఫీసులలో, ప్రైవేట్ ఆఫీసులలో, వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలలో అంబేద్కర్ చిత్రపటం ఉండేలా సూచించాలని అడిషనల్ కలెక్టర్ ను వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కాశమల్ల శేఖర్, సహాయ కార్యదర్శి కట్ట సురేష్, సంస్కృతిక కార్యదర్శి కూచిమల్ల కుమార్, వెలువర్తి గ్రామ అధ్యక్షులు కూచిమల్ల నాగేంద్ర ప్రసాద్, సీనియర్ నాయకులు వలమల్ల రత్నయ్య, జక్క స్వామి, మద్దెల వెంకటేశం, బెల్లపు కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ స్ఫూర్తితో దేశ అభివృద్ధికి కృషి - మహేష్



**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 19:**
భారత రాజ్యాంగ స్ఫూర్తితో దేశ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ వెల్లంకి గ్రామ శాఖ అధ్యక్షుడు నకేరకంటి మహేష్ అన్నారు. గ్రామ అధ్యక్షుడిగా నియమితులైన వేళ గ్రామంలో డా.బి ఆర్ .అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఆయనను కుల పెద్దలు అభినందించారు. డా.అశోక్, మాజీ సర్పంచ్ వెంకట్ రావు, శ్రీను, ఎర్రోళ్ల నరసింహ, జుంపాల మల్లేష్, తలారి నరసింహ, రాజు, కిరణ్, సురేష్, లింగయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాంగ్ రూట్‌లో వాహనాలు నడపకండి

**- రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం...**



**జహీరాబాద్ వెలుతురు జనవరి 19:**
సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం పరిధిలో జాతీయ రహదారి రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం గ్లోబల్ గ్రీన్ కంపెనీ వద్ద రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని రోడ్డు భద్రత ప్రతిజ్ఞతో ప్రారంభించారు. కోహిర్ ఎస్ఐ నరేష్, ఎన్ఏహెచ్ఏఐ పెట్రోలింగ్ సిబ్బంది, గ్లోబల్ గ్రీన్ సిబ్బంది సమావేశంలో పాల్గొని ద్విచక్ర వాహనాలకు హెల్మెట్ తప్పనిసరి, మద్యం మత్తులో వాహనాలు నడపరాదు, రాంగ్ రూట్‌లో వాహనాలు నడపరాదు వంటి రోడ్డు భద్రత నియమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్, కంపెనీ సిబ్బంది, డ్రైవర్లు పాల్గొని రోడ్డు భద్రతకు ప్రాముఖ్యత ఇవ్వడం ద్వారా అవగాహన పెంచారు.

## సైబరాబాద్ అడ్మిన్ డిసిపిగా టి. అన్నపూర్ణ

**హైదరాబాద్,జనవరి19( వెలుతురు):**



సైబరాబాద్ అడ్మిన్ డిసిపిగా టి. అన్నపూర్ణ, సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె సైబరాబాద్ సీపీ ఎం. రమేష్, ఐపీఎస్.,ను మర్యాదపూర్వకంగా కలిశారు. 2007 లో డైరెక్ట్ డీఎస్పీగా ఎంపికైన అన్నపూర్ణ, 2013లో కన్ఫర్డ్ ఐపీఎస్ అయ్యారు. ఇంతకుముందు ఆమె విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా, ఇన్‌చార్జ్ డీఐజీగా సేవలందించారు. వికారాబాద్ ఎస్పీగా, కరీంనగర్ అడిషనల్ ఎస్పీగా, పీటీసీ వరంగల్‌లో, మంగళగిరి–గుంటూరు డీఎస్పీగా, చిత్తూరు అడిషనల్ డీసీపీగా విధులు నిర్వర్తించారు.

## మంత్రి వివేక్‌ని అడ్డుకున్న భూ నిర్వాసితులు

**మంచిర్యాల,జనవరి19( వెలుతురు):**
జిల్లాలోని చెన్నూరు పట్టణంలో మంత్రి వివేక్ ను, అధికారులను భూ నిర్వాసితులు నిలదీశారు. నూతన ఏటీసీ అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ భవనానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన భూనిర్వాసితులు మాట్లాడుతూ ఏటీసీ భవన నిర్మిస్తున్న ప్రాంత భూములు తమవని తమకు కనీస సమాచారం లేకుండా భూములను ప్రభుత్వం లాక్కోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దశలో కలెక్టర్ భూనిర్వాసితులపై మండిపడ్డారు, ఈ భూములన్ని ప్రభుత్వ భూములని, ఎలా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ప్రశ్నించారు. ఎవరికి డబ్బులు ఇచ్చారు. వాళ్లని అడగాలని మండిపడ్డారు.అదేవిధంగా చెన్నూరు పట్టణంలో చెన్నూరు మున్సిపాలిటీలోని పలు వార్డులలో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికి వచ్చిన మంత్రికి మహిళలు నిలదీశారు. తమకు సంక్షేమ పథకాలు రావడం లేదంటూ మండిపడ్డారు. పట్టణంలో సరైన రోడ్లు, నాళాలు త్రాగునీటి వసతులు లేవని వివరించారు.

# బసంత్‌పూర్‌లో ఏడాది కాలంగా నిలిచిన బోరు సమస్యకు పరిష్కారం

**- బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు ఫిర్దౌస్ సర్వర్ చొరవతో కొత్త మోటారు ఏర్పాటు...**



**జహీరాబాద్ వెలుతురు జనవరి 19:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ మండలం బసంత్‌పూర్ గ్రామంలో గత ఒక సంవత్సరం కాలంగా బోరు మోటారు బావిలో చిక్కుకుపోయి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై గ్రామ ప్రజలు అప్పటి గ్రామపంచాయతీకి, అనంతరం నూతన మున్సిపల్ కార్యాలయం కోహీర్‌కు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో సమస్య అలాగే కొనసాగింది. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీ కోహీర్ మండల ఉపాధ్యక్షుడు ఫిర్దౌస్ సర్వర్ గ్రామాన్ని సందర్శించి సమస్యను పరిశీలించారు. బోరు మోటారు మరమ్మతు చేయిస్తానని, అది సాధ్యం కాకపోతే గ్రామానికి కొత్త మోటారు అందిస్తానని ఆయన గ్రామస్తులకు హామీ ఇచ్చారు.దపరిశీలన అనంతరం పాత మోటారు పూర్తిగా బావిలో ఇరుక్కుపోయి బయటకు తీయలేని పరిస్థితి ఉన్నట్లు తేలింది. దీంతో పాత పైపులను తొలగించి, మోటారు పైపును కట్ చేసి కొత్త మోటారు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు నేడు ఫిర్దౌస్ సర్వర్ స్వయంగా చొరవ తీసుకొని కొత్త బోరు మోటారు, స్టార్టర్ మరియు కేబుల్‌ను అందజేసి బోరును ప్రారంభించారు. దీంతో గ్రామంలో త్రాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఏడాది కాలంగా ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించినందుకు ఫిర్దౌస్ సర్వర్‌కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ తక్షణ చర్యలు తీసుకున్న బీఆర్ఎస్ నాయకత్వాన్ని వారు అభినందించారు.

## కాంగ్రెస్ లో చేరిన కామారెడ్డి 16 వ వార్డు బీజేపీ నాయకులు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) జనవరి 19**
కామారెడ్డి పట్టణంలోని 16వ వార్డు అశోక్ నగర్ కాలనీకి చెందిన బీజేపీ నాయకులు ఆ పార్టీకి బిగ్ షాక్ ఇచ్చారు. సోమవారం నాడు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ వార్డ్ ఇంచార్జి బట్టు అరుణ్ కుమార్ తో పాటు 20మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చంద్ర శేఖర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై బీజేపీ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారన్నారు.మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అశోక్ నగర్ కాలనీకి చెందిన బీజేపీ పార్టీ యువకులు మణికంఠ, చింటూ, ప్రీతం, పవన్, చిక్కి రాజేష్, విలాస్, సాయి, మన్ను, మింటూ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు చాట్ల వంశీ కృష్ణ, పంపరి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పిట్ల రాములు, గడ్డం హరిధర్ రెడ్డి, బల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానంతో ఆదర్శంగా నిలుస్తున్న తండ్రికొడుకులు

**- గుండె ఆపరేషన్ నిమిత్తమై సకాలంలో రక్తం అందజేత**

**- ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) జనవరి 19**
హైదరాబాద్ లోని ప్రైవేటు వైద్యశాలలో గుండె ఆపరేషన్ నిమిత్తమై బొల్లినేని రాజగోపాల్ నాయుడు విశ్రాంత ఐఏఎస్ అధికారి,ఐఐటి రాయచూర్ మరియు గోవా చైర్ పర్సన్ కు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరం అని కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేశ్ చంద్ర ఐపిఎస్ సూచనల మేరకు కామారెడ్డి రక్తదాతల సమూహ ప్రధాన కార్యదర్శి,స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ డాక్టర్ పుట్ల అనిల్ కుమార్,వారి కుమారుడు పుట్ల కృతిక్ లు ఈ రోజు రక్త దానం చేయడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ ఒక ప్రక్క పోలీస్ శాఖలో విధులను నిర్వహిస్తూనే సామాజిక బాధ్యతగా రక్తదాన శిబిరాలు,తల సేమియా చిన్నారుల కోసం అవగాహన కార్యక్రమాలు, ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తాన్ని అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న డాక్టర్ పుట్ల అనిల్ కుమార్,పుట్ల కృతిక్ లకు అభినందనలు తెలియజేశారు.

## ప్రజావాణి కి 75 దరఖాస్తులు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) జనవరి 19**
కామారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమం లో 75 అర్జీలను స్వీకరించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీలను అర్జీదారుల నుండి స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు ఇస్తూ తక్షణమే స్పందించి పరిష్కరించాలని తెలిపారు. ప్రజావాణి లో అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్ డి ఓ వీణ, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ‘అరైవ్ అలైవ్’ కార్యక్రమంలో భాగంగా జహీరాబాద్‌లో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

**- బ్లాక్ స్పాట్స్ గుర్తించి ప్రత్యేక కార్యక్రమం...**

**- ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే 90 శాతం ప్రమాదాలు నివారణ..**






**జహీరాబాద్ వెలుతురు జనవరి 19:**
‘అరైవ్ అలైవ్ (Arrive Alive)’ కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజున సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జహీరాబాద్ టౌన్ పరిధిలో గత మూడు సంవత్సరాలుగా చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలను సమగ్రంగా పరిశీలించి, ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించారు. ఈ మేరకు సోమవారం రోజున మధ్యాహ్నం 12 గంటలకు జహీరాబాద్ డీఎస్పీ ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణ సీఐ, జహీరాబాద్ టౌన్ ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది కలిసి జహీరాబాద్ మెహ్ఫిల్ హోటల్ వద్ద వాహనదారులు, స్థానిక ప్రజలు మరియు గతంలో రోడ్డు ప్రమాదాల్లో బాధితులైన కుటుంబ సభ్యులతో కలిసి అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడం, అతివేగంగా వాహనం నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, రాంగ్ రూట్‌లో వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటి అలవాట్లు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయని వివరించారు. ఈ నిర్లక్ష్యం వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతుండటమే కాకుండా, ఎన్నో కుటుంబాలు రోడ్డు మీద పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగించడం, వాహనం నడుపుతున్నప్పుడు పూర్తి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సుమారు 90 శాతం రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని అధికారులు స్పష్టం చేశారు. ప్రజలందరూ రోడ్డు భద్రతపై బాధ్యతాయుతంగా వ్యవహరించి ‘అరైవ్ అలైవ్’ లక్ష్యాన్ని సాధించాలంటూ పోలీసులు పిలుపునిచ్చారు.

# తేనెటీగల పెంపకం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుంది

**- -జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వర్ రావు...**





**జహీరాబాద్ వెలుతురు జనవరి 19:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని డిడిగి గ్రామంలో ఉన్న డిడియస్ కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ పద్ధతుల్లో తేనెటీగల పెంపకంపై వారం రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమం జనవరి 19వ తేదీ నుండి 25వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల శాఖ అధికారి పి. సోమేశ్వర్ రావు, ఎడిఎ బిక్షపతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శిక్షణ కార్యక్రమాన్ని సస్యరక్షణ శాస్త్రవేత్త డా. స్నేహలత సమన్వయం చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వర్ రావు మాట్లాడుతూ తేనెటీగలు వ్యవసాయంలో పరపరాగ సంపర్కం జరిపి పంట దిగుబడులను గణనీయంగా పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. తేనెటీగల పెంపకం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని, ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల శాఖ ద్వారా తేనెటీగల పెంపకానికి ప్రభుత్వం సబ్సిడీ కూడా అందిస్తున్నదని తెలిపారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎడిఎ బిక్షపతి మాట్లాడుతూ తేనెటీగల పెంపకం ఒక లాభదాయకమైన ఉపాధి మార్గమని, రైతులతో పాటు యువకులు కూడా దీనిని ఒక స్థిరమైన జీవనోపాధిగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందే అవకాశమున్న రంగమని అన్నారు. డిడియస్‌కేవీకే సీనియర్ శాస్త్రవేత్త మరియు హెడ్ డా. సి. వరప్రసాద్ మాట్లాడుతూ డిడియస్ కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులు, యువకులకు వివిధ వ్యవసాయ మరియు ఉపాధి సంబంధిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణలు పూర్తి చేసిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందే సబ్సిడీలు పొందే అవకాశముంటుందని అన్నారు. కావున రైతులు, యువకులు ఈ శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారులు పండరి, సునీత, అనుషా పాల్గొని ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల శాఖ ద్వారా అందిస్తున్న వివిధ సబ్సిడీ పథకాలపై వివరించారు. అలాగే డిడియస్‌కేవీకే శాస్త్రవేత్తలు డా. సాయిప్రియంకా, శైలజ, డా. కైలాష్, డా. స్నేహలతతో పాటు డిడియస్‌కేవీకే సిబ్బంది మరియు శిక్షణార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డబ్బుకు ఓటు కాదు, అభివృద్ధికి ఓటు వేయండి

**- ఓటు అమ్ముకుంటే ప్రశ్నించే హక్కు కోల్పోతాం...**

**- ప్రజల కోసం పనిచేసే నాయకులకే ఓటు వేయండి...**

**- ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే నాయకులను నమ్మవద్దు...**

**- జహీరాబాద్ ఆమ్ ఆద్మీ పార్టీ ఇంచార్జి మహమ్మద్ ఖాజా పాషా పిలుపు...**



**జహీరాబాద్ వెలుతురు జనవరి 19:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ జహీరాబాద్ పట్టణ ఇంచార్జి మహమ్మద్ ఖాజా పాషా ప్రజలకు కీలక విజ్ఞప్తి చేశారు. డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలకు లొంగకుండా పూర్తిస్థాయిలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం మధ్యాహ్నం ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్న ఎన్నికలు ఇవేనని, ఈ ఎన్నికల ద్వారా పట్టణ భవిష్యత్తు దిశ నిర్ణయమవుతుందని ఖాజా పాషా పేర్కొన్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసే నాయకులకు మాత్రమే ఓటు వేయాలని, ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే నాయకులను నమ్మవద్దని ఆయన సూచించారు. ప్రజల మధ్య ఉంటూ సమస్యలను తెలుసుకొని పరిష్కరించే వారినే ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ ఓటును ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్ముకోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఒకవేళ డబ్బు ఆశకు ఓటు వేస్తే, ఎన్నికల అనంతరం ఆ నాయకుల పనితీరుపై ప్రశ్నించే నైతిక హక్కును ప్రజలు కోల్పోతారని అన్నారు. అప్పుడు అభివృద్ధి, సమస్యల పరిష్కారం ఆశించలేమని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు విలువను తెలుసుకొని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేలా బాధ్యతాయుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఖాజా పాషా సూచించారు. ఓటే ప్రజల ఆయుధమని, దాన్ని సరిగ్గా ఉపయోగించినప్పుడే నిజమైన మార్పు సాధ్యమవుతుందని ఆయన తెలిపారు.

# కామారెడ్డి రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) జనవరి 19**
జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు2026ను పురస్కరించుకొని జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో సోమవారం నాడు బ్రిలియంట్, వాసవి స్కూల్‌లో రహదారి భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయక మోటార్ వాహనాల తనిఖీ అధికారి శ్రీమతి స్నిగ్ధ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రథమ చికిత్సపై ప్రాథమిక అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారి ప్రాణాలను కాపాడడంలో ‘గోల్డెన్ అవర్’ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. అలాగే రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేసే గుడ్ సమారిటన్‌లకు ప్రభుత్వం అందిస్తున్న చట్టపరమైన రక్షణలు మరియు ప్రోత్సాహకాలను విద్యార్థులకు వివరించారు. సహాయక మోటార్ వాహనాల తనిఖీ అధికారి శ్రవణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు ఈ అవగాహనను తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు కూడా చేరవేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సహాయక మోటార్ వాహనాల తనిఖీ అధికారులు ఉదయ్, మధు, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చిన్న వయసులోనే రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

## ఆకట్టుకునేలా మేడారం శిలాఫలకాలు

**- గిరిజన సాంస్కృతిక వైభవం చాటేలా ఏర్పాటు**

**ములుగు,జనవరి19( వెలుతురు):**
మేడారంలో సమ్మక్క-సారలమ్మ ఆలయ పునర్నిర్మాణం , అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సాధారణంగా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో కనిపించే ఫ్రేమ్డ్ ప్లేట్లు లేదా ఎ÷-లాస్టిక్ బోర్డులలా కాకుండా, ఇక్కడ ఆదివాసీల జీవన విధానం , వారి సంస్కృతి ఉట్టిపడేలా అత్యంత ప్రత్యేకంగా వీటిని రూపొందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ శిలాఫలకాలను ప్రారంభించారు. ప్రకృతితో మమేకమై జీవించే ఆదివాసీల శైలిని ప్రతిబింబించేలా, రాయిని సహజంగా ఉంచి దానిపైనే వివరాలను చెక్కడం ఈ శిలాఫలకాల ప్రధాన ప్రత్యేకత.

ఈ శిలాఫలకాల చుట్టూ గిరిజన మహిళల రూపరేఖలు కలిగిన శిల్పాలను, అలాగే వారి సంప్రదాయంలో కీలకమైన డప్పు వాయిద్య కళాకారుల ప్రతిమలను ఏర్పాటు చేశారు. ఆదివాసీల జీవన విధానంలో కొమ్ముబూరలు, డప్పు వాయిద్యాలు , గిరిజన నృత్యాలకు ఉన్న ప్రాముఖ్యతను ఈ శిల్పాలు చాటిచెబుతున్నాయి. కేవలం పనుల వివరాలకే పరిమితం కాకుండా, గుడి చరిత్రను , గిరిజన సంస్కృతిని భవిష్యత్తు తరాలకు అందించేలా వీటిని తీర్చిదిద్దారు. అటవీ శాఖ అధికారులు, ఐఏఎస్ అధికారులు , దేవాదాయ శాఖకు సంబంధించిన ముఖ్య కార్యదర్శుల నుండి కింది స్థాయి అధికారుల వరకు, ఈ అభివృద్ధి పనుల్లో భాగస్వాములైన అందరి పేర్లు చిరకాలం నిలిచిపోయేలా గ్రానైట్ రాళ్లపై చెక్కించారు. మేడారానికి వచ్చే భక్తులకు గిరిజన సంస్కృతిని పరిచయం చేస్తూ, ఈ శిలాఫలకాలు ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావుకు సిట్ నోటీసులు

**- నేటు విచారణకు హాజరు కావాలని ఆదేశం**

**హైదరాబాద్,జనవరి19( వెలుతురు):**
తెలంగాణ రాష్ట్ర ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావుకు ఫోన్ ట్యాపింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ నోటీసులు ఇచ్చింది. మంగళవారం ఉదయం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని హరీష్ రావుకు పంపిన నోటీసుల్లో పేర్కొంది. ఈ కేసులో ఇతర నిందితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా హరీష్ రావుకు సిట్ నోటీసులు పంపించింది. ఇటీవల ఫోన్ ట్యాపింగ్ కేసులో సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావు విచారణపై దర్యాప్తు సంస్థను సుప్రీం కోర్టు ప్రశ్నించింది. ఇప్పటికే రెండు వారాల కస్టడీకి అనుమతించామని, ఇంకెంత కాలం విచారణ కొనసాగిస్తారని ప్రశ్నించింది. ఈ కేసులో విచారించడానికి ఇంకా ఏమి మిగిలి ఉందని ప్రశ్నించింది. ప్రభాకర్ రావు విచారణను త్వరగా పూర్తి చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది.

# వీధి కుక్కలను చంపడం దారుణం

- వాటికి జీవించే హక్కును హరిస్తారా
- సినీనటి రేణూదేశాయ్ ఆగ్రహం



**హైదరాబాద్,జనవరి19 వెలుతురు:**
వీధి కుక్కలను చంపడంపై ప్రముఖ సినీనటి రేణూదేశాయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో వీధి కుక్కల దాడుల పేరుతో వాటిని హతమార్చడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ భూమిపై ప్రతి జీవికీ జీవించే హక్కు ఉందని స్పష్టం చేస్తూ, కుక్కలను చంపడం దారుణమని ఆమె వ్యాఖ్యానించారు. వీధి కుక్కలపై ద్వేషంతో మాట్లాడుతున్న కొందరిపై రేణూ దేశాయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కుక్కలను వ్యతిరేకిస్తున్నవారికి పిచ్చి పట్టిందంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్కల దాడులపై వస్తున్న విమర్శలపై ఆమె ప్రశ్నల వర్షం కురిపించారు. '100 కుక్కల్లో ఐదు కుక్కలు కరిస్తే మిగతా అన్నింటినీ చంపేయాలా?' అంటూ ప్రశ్నించారు. సమస్యకు పరిష్కారం హింస కాదని, సరైన నిర్వహణ, వ్యాక్సినేషన్ అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. 'కేవలం కుక్కల వల్ల మృతి చెందినవారివే ప్రాణాలా?' అంటూ ప్రశ్నించారు. రోడ్డు ప్రమాదాల్లో, దోమల వల్ల వచ్చే వ్యాధులతో చనిపోయిన వారి ప్రాణాలకు విలువ లేదా? అని ప్రశ్నిస్తూ, సమస్యలను సమగ్రంగా చూడాలని సూచించారు. వీధి కుక్కల హత్యలను ఖండిస్తూ.. 'ఈ భూమిపై ప్రతి జీవికి జీవించే హక్కు ఉంది' అని స్పష్టం చేశారు. మనుషుల నిర్లక్ష్యం వల్లే చాలా సమస్యలు తలెత్తుతున్నాయని, జంతువులపై నింద వేయడం సరికాదని ఆమె పేర్కొన్నారు. కుక్కలను చంపడం దారుణమని, ఇది మానవత్వానికి మచ్చ అంటూ వ్యాఖ్యానించారు. చట్టపరంగా కూడా జంతువులను హతమార్చడం నేరమని గుర్తు చేశారు. ఈ అంశంపై మాట్లాడుతున్న సమయంలో మీడియా ప్రతినిధులతో జరిగిన వాగ్వాదంపై కూడా రేణూదేశాయ్ స్పందించారు. 'ఓ వ్యక్తి నన్ను ఉద్దేశించి మాట్లాడారని.. అందుకే ఆ వ్యక్తి గురించి మాట్లాడాల్సి వచ్చింది' అని స్పష్టం చేశారు. తాను ఎవరినీ అనవసరంగా అవమానించలేదని క్లారిటీ ఇచ్చారు. ఈ వివాదాన్ని రాజకీయ రంగుకు ముడిపెట్టడంపై రేణూదేశాయ్ అసహనం వ్యక్తం చేశారు. 'నాకు పాలిటిక్స్ ఇష్టం లేదని... నేను ఏ రాజకీయ పార్టీలోకి వెళ్లడం లేదు. నా వ్యాఖ్యలను రాజకీయ కోణంలో చూడొద్దు. అలానే నా వ్యక్తిగత జీవితాన్ని ఈ అంశానికి ముడిపెట్టకండి. నా పిల్లలను ఇందులోకి లాగొద్దు' అంటూ మీడియాకు రేణూదేశాయ్ విజ్ఞప్తి చేశారు.

# ఏడాదిన్నరలో రూ.23.5 లక్షల కోట్ల పెట్టుబడులు

- ఏపీ ఐటీశాఖ మంత్రి లోకేశ్ వెల్లడి



**అమరావతి,జనవరి19 వెలుతురు:**
తెలుగువారు అన్ని రంగాల్లో నంబర్‌వన్‌గా ఉండాలని ఏపీ ఐటీశాఖ మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు. స్విట్జర్లాండ్‌లో పర్యటిస్తున్న ఆయన జ్యూరిక్‌లో తెలుగు డయాస్పోరాతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ..సముద్రాలు దాటి వచ్చినా మన సంప్రదాయాలు కొనసాగిస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమానికి 20 దేశాల నుంచి ప్రతినిధులు వచ్చారు. ఈ సమావేశం కూటమి ప్రభుత్వానికి అదృష్టం లాంటిది. ఏడాదిన్నరలో ఏపీకి రూ.23.5 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వీటి ద్వారా 16 లక్షల మంది యువతకు ఉద్యోగాలు వస్తాయి. అభివృద్ధి, ఐటీ, క్వాంటమ్ అంటూ ఏపీని సీఎం చంద్రబాబు ముందుకు నడిపిస్తున్నారు అని లోకేశ్ అన్నారు. అంతకుముందు మంత్రి నారా లోకేశ్ స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్ చేరుకున్నారు. విమానాశ్రయం వద్ద ఆయనకు ఎన్ఆర్ఐ తెదేపా నేతలు, ప్రవాసాంధ్రులు ఘనస్వాగతం పలికారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు లోకేశ్ అక్కడి నుంచి దావోస్‌కు వెళ్లనున్నారు. ఏపీని నమ్మకమైన గ్లోబల్ గమ్యంగా నిలపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 90వ దశకంలోనే భారత్‌కు తొలి గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్లలో సీఎం చంద్రబాబు ఒకరని పేర్కొన్నారు.

# ప్రపంచంలో మానవ వనరుల కొరత

- అందుకు భారత్ వద్ద సమాధానం ఉంది
- భారత రాయబారి మృదుల్ కుమార్‌తో భేటీలో చంద్రబాబు



**అమరావతి,జనవరి19 వెలుతురు:**
ప్రపంచంలోని అనేక దేశాల్లో మానవ వనరుల కొరత ఉందని, ఆ కొరతకు భారత్‌లో సమాధానం లభిస్తుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. స్విట్జర్లాండ్‌లో అక్కడి భారత రాయబారి మృదుల్ కుమార్‌తో సీఎం భేటీ అయ్యారు. ఏపీ పాలసీల గురించి వివరించి.. రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చేలా సహకరించాలని మృదుల్‌కుమార్‌ను కోరారు. మానవ వనరుల కొరత తీర్చేందుకు భారత్‌లో యువత సిద్ధంగా ఉందన్నారు.ఈ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ కూడా పాల్గొన్నారు. స్విట్జర్లాండ్‌లోని కంపెనీల వివరాలు, పెట్టుబడుల సాధన అవకాశాలపై చర్చించారు. స్విట్జర్లాండ్ ఫార్మా కంపెనీలు, వర్సిటీలు ఏపీకి సహకరించాలని లోకేశ్ కోరారు. వివిధ కంపెనీలతో ఏపీని కనెక్ట్ చేసేందుకు రాయబారి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కంపెనీలకు మానవ వనరులు అందించేందుకు ఏపీ సిద్ధంగా ఉందన్నారు. మరోవైపు సీఎం చంద్రబాబుతో ఈరోస్ ఇన్నోవేషన్ సంస్థ ఛైర్మన్ కిషోర్ భేటీ అయ్యారు. 'దావోస్ మ్యాన్' అంటూ చంద్రబాబును ఆయన కొనియాడారు.

# టూవీలర్‌ను ఢీకొన్న వాహనం

**- వ్యక్తి అక్కడికక్కడే మృతి**

హైదరాబాద్,జనవరి19( **వెలుతురు**):
ఆరాంఘర్ చౌరస్తాలో సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్కూటీని లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. వేగంగా దూసుకొచ్చిన రెడీమిక్స్ లారీ.. యాక్టీవాపై వెళ్తున్న వ్యక్తిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై ఉన్న వ్యక్తి లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు హుటాహుటిన పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రోడ్డు ప్రమాదంతో ఆరాంఘర్ చౌరస్తాలో కాసేపు ట్రాఫిక్ సేవలకు అంతరాయం ఏర్పడింది. దీంతో వెంటనే పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అయితే.. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

# స్వచ్ఛ మేడారానికి అందరం సహకరిద్దాం...

## ప్రపంచ పర్యావరణ సంస్థను అభినందించిన ప్రజా ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి



**హైదరాబాద్ వెలుతురు జనవరి 19:**
గత 14 సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా, స్వచ్ఛభారత్ నిర్మాణమే ఏకైక లక్ష్యంగా దేశవ్యాప్తంగా పనిచేస్తున్న 'ప్రపంచ పర్యావరణ సంస్థ' (ఔశీతీశ్రీ‌ఎ జుఅజఱతీశీఅఎవఅ్ ాతీస్త్రుఅఱఓ్ఱశీఅ) మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసీల పండుగైన మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర-2026 (జనవరి 28 నుండి 31 వరకు)ను జాతీయస్థాయిలో గుర్తించేలా, ప్రపంచవ్యాప్త గుర్తింపు కోసం 22 భారతీయ భాషలలో రూపొందించిన 'స్వచ్ఛ మేడారం' పోస్టర్లను, క్లాత్ బ్యానర్లను ప్రజా ఐఏఎస్ అధికారి శ్రీ పరికిపండ్ల నరహరి చేతుల మీదుగా ఆవిష్కరించారు.
ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సిహెచ్. భద్ర, ప్రధాన కార్యదర్శి నిఖిల్ సాయి కోనేటి, కోశాధికారి ఎండి. రెజ్వన్, స్కూల్స్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ ఏ. జోత్స్నారావు, జాతీయ కార్యదర్శి సిహెచ్. సాగర్, జాతీయ యువజన కార్యదర్శి సుమెర్ తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా శ్రీ పరికిపండ్ల నరహరి మాట్లాడుతూ...
"పర్యావరణ పరిరక్షణ కోసం ప్రపంచ పర్యావరణ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయం. దేశంలో ఏ సంస్థ, ఏ వ్యక్తి చేయలేని విధంగా గత 14 ఏళ్లుగా వీరు చేస్తున్న పర్యావరణ ఉద్యమం గొప్పది. దీనికి నా సంపూర్ణ మద్దతు ఉంటుంది. నేను ఇండోర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసినప్పుడు ప్రజా మద్దతుతోనే 'స్వచ్ఛ ఇండోర్' నగరానికి రూపకల్పన చేశాను. వరుసగా ఎనిమిది సార్లు దేశంలోనే అత్యుత్తమ స్వచ్ఛ నగరంగా ఇండోర్ నిలవడం, అనేక అంతర్జాతీయ పురస్కారాలు పొందడం మనందరికీ గర్వకారణం. ఆ స్ఫూర్తితోనే నేడు ప్రపంచ పర్యావరణ సంస్థ పనిచేస్తుండడం సంతోషకరం. దేశవ్యాప్తంగా కోట్లాదిమంది భక్తులు తరలివచ్చే మన మేడారం మహా జాతరను ప్లాస్టిక్ రహితంగా, కాలుష్య రహితంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, సామాజిక బాధ్యతతో ఈ ప్రయత్నానికి సహకరించాలి" అని పిలుపునిచ్చారు.

**కలయిక ఫౌండేషన్ చైర్మన్ చీరాల నారాయణ మాట్లాడుతూ...**

"ప్రస్తుతం ప్రపంచ మానవాళి ముందున్న అతిపెద్ద సమస్య పర్యావరణ కాలుష్యం. దీనిని నివారించేందుకు ప్రపంచ పర్యావరణ సంస్థ, స్వచ్ఛ ఇండోర్ రూపశిల్పి పరికిపండ్ల నరహరి గారి స్ఫూర్తితో పనిచేయడం అభినందనీయం. స్వచ్ఛ మేడారం లక్ష్యంగా జరుగుతున్న ఈ మంచి కార్యక్రమంలో మనందరం భాగస్వాములవుదాం" అని విజ్ఞప్తి చేశారు.

**ప్రపంచ పర్యావరణ సంస్థ అధ్యక్షులు డాక్టర్ సిహెచ్. భద్ర మాట్లాడుతూ...**

"మా సంస్థ 'ప్రకృతి ఉపాధ్యాయుడు - ప్రకృతి మా భవిష్యత్తు' అనే నినాదంతో ఇప్పటికే దేశవ్యాప్తంగా 2000కు పైగా పాఠశాలల్లో రోజుకు లక్షలాది మంది విద్యార్థులను పర్యావరణ హితంగా తీర్చిదిద్దుతోంది. గత 14 ఏళ్లుగా మేడారం జాతరలో దాతలు, పర్యావరణవేత్తల సహకారంతో 'సేవ్ మేడారం - క్లీన్ మేడారం' పేరుతో లక్షలాది జ్యూట్ బ్యాగులను పంపిణీ చేస్తున్నాం. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై భక్తులకు అవగాహన కల్పిస్తున్నాం. మా కృషిని రాష్ట్ర మంత్రివర్యులు శ్రీమతి సీతక్క గారు ప్రత్యేకంగా అభినందించడం మాకు మరింత బలాన్నిచ్చింది. ఈసారి దేశం నలుమూలల నుండి వచ్చే భక్తుల కోసం 22 భాషల్లో అవగాహన బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నాం" అని తెలిపారు.

**ప్రధాన కార్యదర్శి నిఖిల్ సాయి కోనేటి మాట్లాడుతూ...**

విద్యార్థులు, యువత, మహిళలే కేంద్రంగా బడిని-గుడిని అనుసంధానిస్తూ ప్రపంచ పర్యావరణ సంస్థ పర్యావరణ పరిరక్షణ కోసం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు.

**సంస్థ జాతీయ యువజన కార్యదర్శి సుమెర్ మాట్లాడుతూ...**

"గత నాలుగు నెలలుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వందలాది ర్యాలీలు నిర్వహించి, వేలాదిమంది విద్యార్థులతో మేడారం జాతరలో ప్లాస్టిక్ వాడబోమని ప్రతిజ్ఞ చేయించాం. జాతర సమయంలోనూ భారీ ప్రదర్శనలు నిర్వహించి, భక్తులను చైతన్యవంతులను చేస్తాం. మేడారంలోని జీవవైవిధ్యాన్ని, వనదేవతల సహజ అందాన్ని కాపాడడమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు.

# 'సీ-మిత్ర'కు భారీగా స్పందన

- న్యాయం కోసం ఫిర్యాదుల వెల్లువ
- పది రోజుల్లో వేయి ఫిర్యాదులు రాక

**హైదరాబాద్,జనవరి19 వెలుతురు:**
సైబర్ నేరాల బాధితులకు భరోసా కల్పించే దిశగా హైదరాబాద్ పోలీసులు మరో కీలక ముందడుగు వేశారు. బాధితులు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ఇంటి నుంచే ఫిర్యాదు చేసేలా రూపొందించిన వినూత్న కార్యక్రమమే 'సీ-మిత్ర' ఈ కార్యక్రమం జనవరి 9వ తేదీన సీ-మిత్ర కార్యక్రమం అధికారికంగా ప్రారంభమైంది. ఇది అమల్లోకి వచ్చిన మొదటి 10 రోజుల్లోనే దాదాపు 1000 మంది సైబర్ బాధితులకు ఫోన్ కాల్స్ చేసినట్లు హైదరాబాద్ పోలీసులు వెల్లడించారు. రోజుకు సగటున 100 మంది బాధితులతో వర్చువల్‌గా పోలీసులు సంభాషిస్తున్నారని పేర్కొన్నారు. సీ-మిత్రలో ప్రత్యేకంగా నియమించిన వర్చువల్ పోలీస్ బృందం, సైబర్ బాధితులతో నేరుగా మాట్లాడుడుతున్నారని హైదరాబాద్ పోలీసులు తెలిపారు. నేరం ఎలా జరిగిందో తెలుసుకోవడం, అవసరమైన వివరాలు సేకరించడం, ఫిర్యాదు ఎలా చేయాలో మార్గనిర్దేశర చేయడం వంటి సేవలు అందిస్తున్నామని అన్నారు. దీంతో బాధితుల్లో భయం తగ్గి, పోలీసులపై నమ్మకం పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు. సీ-మిత్ర కార్యక్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలక





పాత్ర పోషిస్తోందని చెప్పుకొచ్చారు. ఇప్పటికే 200కి పైగా ఫిర్యాదు డ్రాఫ్ట్‌లు సిద్ధం చేశామని పోలీసులు వెల్లడించారు. బాధితుల సమాచారం ఆధారంగా ఆటోమేటిక్‌గా కంప్లైంట్ ముసాయిదా తయారు చేసినట్లు తెలిపారు. ఈ డ్రాఫ్ట్‌లు బాధితులకు పంపించి, వారు సంతకం చేసిన తర్వాత తదుపరి చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు 100కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని పోలీసులు తెలిపారు. సైబర్ నేరాలపై చట్టపరమైన చర్యలు ప్రారంభించారమని, ఇది సీ-మిత్ర కార్యక్రమం విజయానికి నిదర్శనంగా అధికారులు పేర్కొంటున్నారు. సీ-మిత్రలో మరో కీలక అంశం ఏమిటంటే.. బాధితులు 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేసి జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేస్తే, వెంటనే సీ-మిత్ర బృందం స్పందిస్తోంది. ఎఫ్ఐఆర్ నమోదు అయిన తర్వాత, దాని కాపీని నేరుగా బాధితుల మొబైల్‌కు మెసేజ్ రూపంలో పంపిస్తున్నారు. దీంతో పారదర్శకత పెరిగి, బాధితులకు పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుంది. డిజిటల్ సదుపాయాలు లేని బాధితుల కోసం కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బషీర్‌బాగ్ సైబర్ క్రైమ్ స్టేషన్‌లో సంతకం చేసిన ఫిర్యాదు పత్రాలను పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపే వెసులుబాటు కల్పించారు. సీ-మిత్ర కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు 24 మంది సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. రెండు షిఫ్ట్‌ల్లోసేవలు అందిస్తున్నారు. బాధితుల కోసం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వర్చువల్ హెల్ప్‌డెస్క్ అందుబాటులో ఉంది. ఈ సమయంలో సైబర్ నేరాలకు సంబంధించిన అన్ని సందేహాలకు సీ-మిత్ర బృందం సమాధానాలు ఇస్తోంది. సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయడానికి భయపడే వారు చాలా మంది ఉంటారు. అయితే సీ-మిత్ర కార్యక్రమం ద్వారా బాధితుల్లో భరోసా, పోలీసులపై నమ్మకం, ఫిర్యాదు చేయాలనే ధైర్యం పెరిగిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మరోసారి వార్తల్లో సత్యం కంప్యూటర్స్ స్కామ్

**- జన్వాడ భూములపై నాంపల్లి ప్రత్యేక కోర్టు విచారణ**
**- సత్యం రాజుతో పాటు 213 మందికి న్యాయస్థానం నోటీసులు**

**హైదరాబాద్,జనవరి19( వెలుతురు):**
భారతదేశ ఆర్థిక చరిత్రలోనే అతిపెద్ద కార్పొరేట్ మోసాల్లో ఒకటిగా పేరుగాంచిన సత్యం కంప్యూటర్స్ స్కామ్ మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ స్కామ్‌కు సంబంధించిన జన్వాడ భూముల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న విలువైన భూములు, ముఖ్యంగా జన్వాడ ప్రాంతంలోని ల్యాండ్స్, సత్యం స్కామ్‌లో భాగంగా అక్రమంగా కొనుగోలు చేశారనే ఆరోపణలు చాలా కాలంగా ఉన్నాయి. సత్యం కంప్యూటర్స్ ద్వారా దారి మళ్లించిన నిధులను వినియోగించి ఈ భూములు కొనుగోలు చేశారని ఈడీ దర్యాప్తులో తేలింది. సీబీఐ గతంలో చేసిన విచారణలో కొన్ని అంశాలు వెలుగులోకి వచ్చినప్పటికీ, హైదరాబాద్ చుట్టుపక్కల వందల ఎకరాల భూముల వివరాలు పూర్తిగా బయటపడలేదని ఈడీ అధికారులు తెలిపారు. జన్వాడ ల్యాండ్స్ వ్యవహారం రాజకీయ, వ్యాపార వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో ఈ భూముల కొనుగోలు పెద్ద సంచలనం సృష్టించింది.సత్యం కంప్యూటర్ స్కామ్‌లో జన్వాడ భూములపై నాంపల్లి ప్రత్యేక కోర్టు సోమవారం విచారణ చేపట్టింది. జన్వాడ ల్యాండ్ కేసులో సత్యం రాజు, నందిని రాజు, తేజ రాజులతో పాటు 213 మందికి న్యాయస్థానం నోటీసులు




జారీ చేసింది. ఈ వ్యవహారంలో ఈడీ అధికారులు కౌంటర్ దాఖలు చేయాలని నాంపల్లి ప్రత్యేక కోర్టు ఆదేశించింది. ఈ కేసులో తాజాగా.. అభినవ్ అనే వ్యక్తి కీలకంగా మారాడు. జన్వాడ భూముల వ్యవహారంపై తనకు తెలిసిన విషయాలను కోర్టు ముందు వెల్లడించేందుకు సిద్ధంగా ఉన్నానంటూ అభినవ్ నాంపల్లి ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. తాను ఈ స్కామ్‌లో జరిగిన అసలు విషయాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నానని, సాక్షిగా వాంగ్మూలం ఇవ్వడానికి అవకాశం ఇవ్వాలని కోరాడు. ఈ నేపథ్యంలో ఈ కేసును మరింత సమగ్రంగా తీసుకెళ్లే అవకాశముందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అభినవ్ వాంగ్మూలం కొత్త ఆధారాలను బయటపెట్టే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటివరకు తెలియని బినామీ లావాదేవీల వివరాలు, రాజకీయ, వ్యాపార సంబంధాల వంటి కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. కోర్టు ఆయనను సాక్షిగా అనుమతిస్తే, కేసు దిశ పూర్తిగా మారే అవకాశం ఉంది. జన్వాడ భూముల కేసును ఈడీ అధికారులు సీరియస్‌గా తీసుకుని విచారణ చేస్తున్నారు. సత్యం రాజు(రామలింగ రాజు), నందిని రాజు, తేజ రాజుతో పాటు మొత్తం 213 మందికి నాంపల్లి ప్రత్యేక కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసుల ద్వారా అక్రమ ఆస్తుల వివరాలు, భూముల కొనుగోలు విధానం, నిధులు తదితర అంశాలపై వివరణ ఇవ్వాలని ఈడీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. సత్యం కంప్యూటర్స్ స్కామ్‌పై గతంలో సీబీఐ విస్తృతంగా విచారణ చేసింది. ఆ విచారణలో నిధుల దారి మళ్లింపు, తదితర అంశాలు బయటపడ్డాయి. అయితే.. అప్పట్లో భూముల కొనుగోలు అంశం పూర్తిస్థాయిలో వెలుగులోకి రాలేదని ఈడీ అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్ పరిసరాల్లో వందల ఎకరాల భూములు ఈడీ విచారణలో అత్యంత కీలకంగా మారాయి. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీగా భూములు కొనుగోలు చేసినట్లు ఆధారాలు లభించినట్లు సమాచారం. ఈ భూముల విలువ ప్రస్తుతం.. వేల కోట్ల రూపాయలకు చేరినట్లు ఈడీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ అంశంపై 2014లో ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. సత్యం స్కామ్ ద్వారా అక్రమంగా సంపాదించిన డబ్బును రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టడం, బినామీ పేర్లతో భూములు కొనుగోలు చేయడం షెల్ కంపెనీల ద్వారా లావాదేవీలు నిర్వహించడం వంటి అంశాలపై ఈడీ కేసు నమోదు చేసింది. ఇప్పుడు అదే కేసులో భాగంగా జన్వాడ భూ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది.

# పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ ఆధారంగా చర్యలొద్దు

**- తెలంగాణ హైకోర్టు విచారణ... ఫిబ్రవరి 25కు వాయిదా**

**హైదరాబాద్,జనవరి19( వెలుతురు):**
కాళేశ్వరం పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ వాయిదా పడింది.
కాళేశ్వరంలో జరిగిన అక్రమాలు, అవినీతి ఆరోపణలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌ను సవాలు చేస్తూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ చీఫ్ సెక్రటరీ ఎస్కె జోషి, సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దాఖలు చేసిన పిటిషన్లపై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. కేసీఆర్, హరీష్ రావ్ తరఫున సుప్రీం కోర్టు సీనియర్ కౌన్సిల్ సుందరం వాదనలు వినిపించారు. ఈ కేసుపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కౌంటర్ దాఖలు చేసింది. ప్రభుత్వ కౌంటర్‌కు పిటిషనర్లు రిప్లై ÷ల్ చేశారు. రిప్లైకు ప్రభుత్వం రిటన్ సబ్మిషన్ ఇచ్చేందుకు సమయం కావాలని హైకోర్టును అడ్వకేట్ జనరల్ కోరారు. ఫిబ్రవరి 20లోపు లిఖితపూర్వకమైన సబ్మిషన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు.. తదుపరి విచారణను ఫిబ్రవరి 25కు వాయిదా వేసింది. అప్పటి వరకు పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు స్పష్టం చేసింది.

# ముగిసిన సంక్రాంతి సెలవులు



**విజయవాడ, జనవరి 19( వెలుతురు):**
సంక్రాంతి సెలవులు ముగిశాయి. పండగ కోసం సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. దీంతో విజయవాడ – హైదరాబాద్ జాతీయ రహదారి వాహనాలతో రద్దీగా మారింది. వరుసగా ఆది,సోమవారాలు రద్దీ కొనసాగింది. ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నం వద్ద వాహన రద్దీ నెలకొనడంతో.. వాహనాలు క్యూ కట్టాయి. ఈ మేరకు పోలీసులు వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చేపట్టారు. భారీ వాహనాలను హనుమాన్ జంక్షన్ వద్ద నూజివీడు, మైలవరం మార్గం ద్వారా హైదరాబాద్ వైపు మళ్లిస్తున్నారు. దీని వల్ల మెయిన్ హైవేలో రద్దీ కొంత మేర తగ్గే అవకాశం ఉంది. కాగా.. సంక్రాంతి పండుగ కోసం స్వగ్రామాలకు వెళ్లే సమయంలోనూ ఈ రహదారిపై భారీ రద్దీ నెలకొన్న విషయం తెలిసిందే. హైదరాబాద్ నుంచి ఏపీ వైపు వెళ్లే వాహనాలతో పంతంగి, చౌటుప్పల్ టోల్ గేట్ల వద్ద రద్దీ కారణంగా వాహనాలు ఆలస్యంగా నడిచాయి. ఇప్పుడు సొంతూళ్ల నుంచి హైదరాబాద్‌కు తిరిగొచ్చే సందర్భంలో రద్దీ మరింత పెరిగింది. ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, కంచికచర్ల వంటి చోట్ల ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు అదనపు సిబ్బందిని, డైవర్షన్లు అమలుచేసి సాఫీగా ప్రయాణం కొనసాగేలా చర్యలు చేపట్టారు. అలాగే ప్రయాణికులు ఓపికగా ఉండాలని, రద్దీ ఎక్కువగా ఉన్న చోట్ల వేగం తగ్గించి, సురక్షితంగా ప్రయాణం చేయాలని సూచిస్తున్నారు.

# ఇక ఇండియాలనే రాఫెల్స్..



**ముంబై జనవరి 19( వెలుతురు):**
భారత్ మరోసారి ఫ్రాన్స్‌తో రక్షణ ఒప్పందం కుదుర్చుకునే దిశగా అడుగులు వేస్తోంది. రక్షణ మంత్రిత్వ శాఖ మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం కింద భారత వైమానిక దళం కోసం 114 రాఫెల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల తయారీకి ఆమోదం తెలిపింది. దాదాపు రూ. 3.24 లక్షల కోట్ల అంచనా వ్యయంతో కూడిన ఈ ఒప్పందం ప్రపంచంలోనే అతిపెద్ద ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ ఒప్పందాలలో ఒకటిగా నిలవనుంది. ఈ క్రమంలో రాఫెల్ ఫైటర్ జెట్‌లు భారతదేశంలో తయారైతే, వాటిని ఇతర దేశాలకు విక్రయించవచ్చుతాజా నివేదికల ప్రకారం, ఫ్రాన్స్‌లోని డసాల్ట్ ఏవియేషన్ తర్వాత రాఫెల్ ఫైటర్ జెట్‌ల కోసం భారత్‌ను రెండవ గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చాలని భావిస్తోంది. అంటే, భారతదేశంలో తయారు చేసే ఫైటర్ జెట్స్ భారత వైమానిక దళం అవసరాలకు మాత్రమే పరిమితం కావు. ఇక్కడ తయారు చేసిన యుద్ధ విమానాలను అంతర్జాతీయ ఎగుమతి ఆర్డర్‌లను పూర్తి చేయడానికి కూడా ఉపయోగించవచ్చు.మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లోని ఓఎఉంఒ ప్రత్యేక ఆర్థిక జోన్ (రాఇజి)లో ప్రత్యేక రాఫెల్ ఫైనల్ అసెంబ్లీ లైన్ ఏర్పాటు చేయనుంది. ఈ సౌకర్యం సంవత్సరానికి 24 ఫైటర్ జెట్‌లను తయారు చేస్తుందని ప్రస్తుతానికి భావిస్తున్నారు. పూర్తి యుద్ధ విమానాల ఎగుమతిలో నియంత్రణ లేదా దౌత్యపరమైన అడ్డంకులు ఎదురైనా భారతదేశం నిర్వహణ, మరమ్మత్తు, ఓవరాల్ ఎగుమతుల ద్వారా ప్రయోజనం పొందనుంది. రాఫెల్ ఫైటర్ జెట్స్ ఉపయోగించే దేశాలకు భారతదేశం ప్రాంతీయ ఓఖీూ హబ్‌గా అభివృద్ధి కానుంది.భారతదేశంలో రాఫెల్ ఫైటర్ జెట్‌లను తయారు చేయడంలో అతిపెద్ద ప్రయోజనం స్వదేశీ ఆయుధాలు, మన వ్యవస్థలను అనుసంధానం చేయడం. భారతదేశంలో తయారు చేసిన రాఫెల్‌లో భారత క్షిపణులు, అంటే ఎక్స్‌ట్రా బియాండ్ విజువల్ రేంజ్ ఎయిర్ టు ఎయిర్ మిసైల్స్ వంటివి అమర్చుతారు. ఇది ఒక ప్రత్యేకమైన ఇండియన్ రాఫెల్ వేరియంట్‌ను సృష్టిస్తుంది. రాఫెల్ ఫైటర్ జెట్ ప్రధాన మేధో సంపత్తి హక్కులు ఫ్రాన్స్ వద్దే ఉంటాయని మీకు తెలుసా. మేక్ ఇన్ ఇండియా ఫ్రేమ్‌వర్క్ కింద భారత రాఫెల్ ప్రోగ్రామ్‌లో దాదాపు 60% స్వదేశీకరణను ఆశిస్తున్నారు. ఈ చర్య తరువాత, రాఫెల్ తయారీ భారతదేశాన్ని ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను ఎగుమతి చేసే దేశాల ఎలైట్ క్లబ్‌లో చేర్చుతుందని కేంద్రం ప్లాన్ చేసింది. ఇది భారతదేశ రక్షణ దౌత్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది, వేలాది మందికి ఉపాధిని కూడా అందిస్తుంది.

## పొగమంచు కారణంగా బైక్, డీసీఎం ఢీ.. ఇద్దరు మృతి

**లక్నో జనవరి 19( వెలుతురు):**
ఉత్తరప్రదేశ్లోని షాజహాన్పూర్ జిల్లాలో పొగమంచు కారణంగా ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోజా పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై ఒక డిసిఎం వాహనం బైక్ను ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని వెంటనే జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## తిరుపతిలో వైసీపీ నాయకులపై కేసు నమోదు

**తిరుపతి జనవరి 19( వెలుతురు):**
తిరుపతి జిల్లా వైసీపీ నాయకులపై కేసు నమోదైంది. మాజీ సీఎం వైఎస్ జగన్ పుట్టిన రోజున మేకను బలిచ్చారని సర్పంచ్ గిరిని కేవిబి పురం పోలీసులు అరెస్ట్ చేశారు. గిరిపై అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఫిర్యాదు చేశారు. శనివారం గిరిని అరెస్టు చేసేందుకు వచ్చిన పోలీసులను గ్రామస్తులు, వైసీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. రాత్రి శ్రీకాళహస్తి కోర్టులో హాజరు పరచగా.. రిమాండ్ను శ్రీకాళహస్తి కోర్టు జడ్జి తిరస్కరించారు. దాంతో బెయిల్పై విడుదల చేశారు.

## నిద్రిస్తున్న వ్యక్తి పై కత్తితో దాడి

**వినుకొండ జనవరి 19( వెలుతురు):**
వినుకొండలో ఆదివారం దారుణ ఘటన చోటుచేసుకుంది. డిగ్రీ కళాశాల సమీపంలోని పద్మావతి నగర్లో నివసిస్తున్న ఉలవలపూడి రవికిరణ్ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో తెల్లవారుజామున గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు దిండుతో ముఖం నొక్కి, కత్తితో దాడి చేశారు. కేకలు వేయడంతో వారు పారిపోయారు. గాయపడిన రవిని భార్య సైలెజ 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 10 అంతస్థులు దాటితే అంతే




**హైదరాబాద్, జనవరి 19( వెలుతురు):**
హైదరాబాద్ నగరాభివృద్ధి దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రియల్ ఎస్టేట్ రంగాన్ని నేరుగా ప్రభావితం చేసేలా టీడీఆర్ విధానంలో కీలక మార్పులు చేస్తూ పురపాలక శాఖ జీవో నెం. 16ను విడుదల చేసింది. చెరువులు, నదుల పరిరక్షణతో పాటు భూసేకరణను వేగవంతం చేయడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ సవరించిన నిబంధనలు ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరించిన తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో అమలులోకి రానున్నాయి. ఈ పరిధిలోని 300 డివిజన్లలో ఇకపై జరిగే నిర్మాణాలు కొత్త టీడీఆర్ నిబంధనలకు లోబడి ఉండాల్సి ఉంటుంది. నగరంలో హైరిస్ భవనాల నిర్మాణాన్ని నియంత్రించేలా ప్రభుత్వం కీలక షరతును విధించింది. ఇకపై 10 అంతస్తులు దాటే ప్రతి భవనానికి టీడీఆర్ తప్పనిసరి కానుంది. 11వ అంతస్తు నుంచి పై అంతస్తుల వరకు నిర్మించే మొత్తం విస్తీర్ణంలో 10 శాతానికి సమానమైన టీడీఆర్ సర్టిఫికెట్లు బిల్డర్లు సమర్పించాల్సి ఉంటుంది. దీంతో ఇప్పటివరకు మార్కెట్‌లో వినియోగం లేక నిల్వగా ఉన్న టీడీఆర్ బాండ్లకు డిమాండ్ పెరగనుంది.భూమిని ప్రభుత్వానికి ఉచితంగా అప్పగించే బిల్డర్లకు ప్రత్యేక రాయితీలు కూడా ఈ జీవోలో పొందుపరిచారు. సెట్‌బ్యాక్ నిబంధనల్లో, భవన ఎత్తు పరిమితుల్లో సడలింపులు కల్పిస్తూ వారిని ప్రోత్సహించనున్నారు. దీని ద్వారా భూసేకరణ ప్రక్రియ సులభతరం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. చెరువులు, నదుల పరిరక్షణకు సంబంధించి భూముల స్వాధీనంపై కూడా ప్రభుత్వం ఆకర్షణీయమైన విధానాన్ని ప్రకటించింది. ఎఫ్‌టీఎల్ పూర్తిస్థాయి నీటి మట్టం పరిధిలో ఉన్న పట్టా భూములకు 200 శాతం టీడీఆర్, చెరువుల బఫర్ జోన్లలో ఉన్న భూములకు 300 శాతం టీడీఆర్, బఫర్ వెలుపల అభివృద్ధి పనుల కోసం భూములు సేకరిస్తే 400 శాతం టీడీఆర్ ఇవ్వాలని నిర్ణయించింది. ఒక ఎకరాకు మించి భూసేకరణ జరిగితే ఆ ప్రతిపాదనను ప్రభుత్వం నేరుగా పరిశీలించనుంది. మూసీ నది పరీవాహక ప్రాంతం, నగరంలోని చెరువుల సుందరీకరణ పనులకు భూ యజమానుల నుంచి ఎదురవుతున్న అడ్డంకులను తొలగించడమే ఈ విధాన మార్పుల లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది.గతంలో ప్రభుత్వం జారీ చేసిన దాదాపు 10 వేల కోట్ల రూపాయల విలువైన టీడీఆర్ సర్టిఫికెట్లు మార్కెట్‌లో పేరుకుపోయి వాటి ధర గణనీయంగా పడిపోయింది. దీంతో భూ యజమానులు టీడీఆర్‌కు బదులుగా నగదు పరిహారం కోరుతూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. ఇప్పుడు పెద్ద భవనాల నిర్మాణానికి టీడీఆర్ తప్పనిసరి చేయడంతో బిల్డర్లు వాటిని కొనుగోలు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీంతో టీడీఆర్ మార్కెట్ మళ్లీ కదలికలోకి రావడంతో పాటు, ప్రభుత్వంపై నగదు పరిహారం భారం తగ్గనుంది. ఫలితంగా నిధుల కొరతతో నిలిచిపోయిన రోడ్ల విస్తరణ పనులు, మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులు వేగం అందుకునే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేల రివర్స్ ఫిరాయింపులు



**హైదరాబాద్, జనవరి 19( వెలుతురు):**
తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇందులో మెజారిటీ ఎమ్మెల్యేలు తాము ఇప్పటికీ బీఆర్ఎస్ సభ్యులమేనని స్పీకర్‌కు నివేదించడం, చట్టపరమైన చిక్కుల నుంచి తప్పించుకోవడానికే కాకుండా, క్షేత్రస్థాయిలో మారుతున్న రాజకీయ సమీకరణాలకు కూడా అద్దం పడుతోంది. కేవలం సాంకేతికంగానే కాకుండా, రాజకీయంగా కూడా వీరు కాంగ్రెస్ వైఖరితో విసిగిపోయి మళ్లీ సొంత గూటికి చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది.పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కాంగ్రెస్‌లో చేరడం తాను చేసిన ఒక తప్పటడుగు అని ఆయన బహిరంగంగానే పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తన నియోజకవర్గానికి గానీ, వ్యక్తిగతంగా తనకు గానీ కనీసం వెంట్రుక వాసి కూడా ప్రయోజనం కలగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మూడుసార్లు తనను ఎమ్మెల్యేగా గెలిపించిన గులాబీ జెండా పట్ల కృతజ్ఞతగా ఉండాలని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులనే గెలిపించాలని ఆయన తన అనుచరులకు పిలుపునివ్వడం రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది.మరోవైపు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కూడా ఇదే తరహా ధోరణిని ప్రదర్శిస్తున్నారు. గతంలోనే ఆయన కాంగ్రెస్‌లో చేరిన కొద్ది రోజులకే తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరినట్లుగా ప్రచారం చేయించుకున్నారు. తాను ఎప్పుడూ బీఆర్ఎస్‌ను వీడలేదని, కేవలం అభివృద్ధి పనుల నిమిత్తమే ముఖ్యమంత్రిని కలిశానని ఆయన స్పష్టం చేస్తున్నారు. స్పీకర్ ముందు కూడా తాము పార్టీ మారలేదని వాదించడం ద్వారా, అనర్హత వేటు నుంచి తప్పించుకోవడమే కాకుండా, కాంగ్రెస్ పార్టీలో తమకు దక్కుతున్న ప్రాధాన్యతపై అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేలు మళ్లీ బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారనేది స్పష్టమవుతోంది.ఈ పరిణామాలు అధికార కాంగ్రెస్ పార్టీకి మింగుడుపడని అంశాలుగా మారాయి. చేర్చుకున్న ఎమ్మెల్యేలు గోడ మీద పిల్లి వాటంగా వ్యవహరిస్తుండటం, ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికల ముందు బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని పిలుపునివ్వడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. స్పీకర్ నిర్ణయం ఎలా ఉన్నా, ప్రజల్లో ఈ ఎమ్మెల్యేల విశ్వసనీయత ప్రశ్నార్థకమవుతున్నప్పటికీ, వీరు మళ్లీ బీఆర్ఎస్‌కు దగ్గరవ్వడం ఆ పార్టీ క్యాడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. కానీ వారిని మళ్లీ పార్టీలోకి తీసుకోవద్దన్న డిమాండ్ కూడా వినిపిస్తోంది.

# ప్రారంభమైన పులుల లెక్కలు...



**మహబూబ్ నగర్, జనవరి 19( వెలుతురు):**
పులుల లెక్క, మొత్తం అటవీ జీవవైవిధ్యాన్ని అంచనా వేయడానికి అటవీ శాఖ సిద్ధమైంది. ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ 2026ను నిర్వహించడానికి సన్నాహాలు పూర్తి చేసింది. రాష్ట్రంలో పులులు, వాటి ఆహారమైన శాఖాహార జంతువులను కూడా లెక్కిస్తారు.ఈ కార్యక్రమంలో భాగంగా 25 వరకు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ఉన్న 3,053 అటవీ ప్రాంతాలలో క్షేత్రస్థాయి డేటా సేకరణ జరుగుతుంది. ఈ సర్వేలో టైగర్ రిజర్వ్ ఫారెస్ట్, వన్యప్రాణుల అభయారణ్యాలు, అభయారణ్యాలు, ఇతర అటవీ ప్రాంతాలు ఉంటాయి. తెలిసిన పులుల కదలిక జోన్‌లపై మాత్రమే కాకుండా.. వాటి ఆవాసాలపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తారు. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ, వైల్డ్ లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఈ లెక్కింపు జరుగుతుంది.శిక్షణ పొందిన అటవీ శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు ట్రాన్సెక్ట్ లైన్లు వేయడం ద్వారా, టైగర్ పగ్‌మార్క్‌లు, స్కాట్ నమూనాలు, స్క్రాచ్ మార్క్‌లు వంటి సంకేతాలను నమోదు చేయడం ద్వారా క్షేత్రస్థాయి సర్వేలను నిర్వహిస్తారు. అటవీ నివాస పరిస్థితులు, మానవ కార్యకలాపాల ప్రభావంపై డేటాను కూడా మొబైల్ అప్లికేషన్‌లను ఉపయోగించి సేకరిస్తారు.ఈ కార్యక్రమంలో 1,129 మంది వాలంటీర్లు నమోదు చేసుకున్నారని అధికారులు తెలిపారు. చిచిఈ, ఊఋఎఅూా, యానిమల్ వారియర్స్, డెక్కన్ బర్డర్స్, ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ వంటి ప్రభుత్వేతర సంస్థలు దాదాపు 430 మంది శిక్షణ పొందిన సభ్యులతో ఈ కార్యక్రమానికి మద్దతు ఇస్తున్నాయి. అటవీ విభాగాల అవసరాల ఆధారంగా జిల్లా వారీగా వాలంటీర్లను నియమించారు. శాఖాపరమైన పర్యవేక్షణలో డేటా సేకరణలో సహాయం చేస్తారు. సేకరించిన డేటాను కెమెరా ట్రాపింగ్, శాస్త్రీయ విశ్లేషణతో కూడిన తదుపరి దశలలో పులుల సంఖ్య, ఇతర వన్యప్రాణుల స్థితిని సమగ్రంగా అంచనా వేయడానికి ఉపయోగిస్తారు.పులి అడుగులు, చెట్లకు గోకే గుర్తులు, మలం ఆధారంగా వాటి ఆచూకీ తెలుసుకుంటారు. ఇందుకోసం టెక్నాలజీని వాడుతారు. ఇప్పటిదాకా పులుల సంఖ్యపై కచ్చితమైన సమాచారం లేదు. దీంతో వాటి సంరక్షణ చర్యలు ఇబ్బందులు అయ్యేవి. తాజాగా పులుల గణనతో ఆ సమస్య తీరనుంది.

రాబందును పట్టించిన జీపీఎస్

మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం బహిరన్ దిబ్బ గ్రామ శివారులో ఒక రాబందు కనిపించింది. నిజానికి రాబందులు కనిపించడం అరుదు కదా. దీంతో గ్రామస్థుల్లో భయం మె?దలైంది. ఆకాశం నుంచి అకస్మాత్తుగా వచ్చిన ఈ పక్షిని చూసిన జనాలు ఆలోచనల్లో పడ్డారు. ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఇక ఆ పక్షి కాళ్లకు స్టిక్కర్లు, నంబర్లు, చిన్న పరికరాలు ఉండటంతో ఆశ్చర్యంగా చూశారు.అయితే కొందరు యువకులు పరికరాలను చూసి ఏదైనా గూఢచారి పక్షి కావొచ్చు అని అనుమానం వ్యక్తం చేశారు. మరికొందరైతే గ్రామానికి ఏదైనా కీడు జరుగుతుందని కూడా మాట్లాడుకున్నారు. ఈ రాబందుకు సంబంధించిన విషయం సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. ఈ విషయం అటవీ శాఖ అధికారులకు కూడా తెలిసింది. దీంతో వారు రంగంలోకి దిగారు. దీనిపై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వికాస్ క్లారిటీ ఇచ్చారు. దేశంలో అంతరించిపోతున్న రాబందుల జాతిని కాపాడేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సంరక్షణ ప్రాజెక్టును అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే.. రాబందుల కదలికలు, నివాస ప్రాంతాలు, ఆహార లభ్యత లాంటి అంశాలను అధ్యయనం చేసేందుకు వాటి కాళ్లకు జీపీఎస్ ట్రాకర్లు, గుర్తింపు ట్యాగులు అమర్చుతున్నారన్నారు. ఈ రాబందులు దేశవ్యాప్తంగా ఎక్కడ తిరిగినా.. వాటి లొకేషన్‌ను వైల్డ్ లైఫ్ అధికారులు పర్యవేక్షిస్తారన్నారు.ఈ టెక్నాలజీ ద్వారా రాబందుల సంఖ్యను పెంచేందుకు అవసరమైన శాస్త్రీస సమాచారం సేకరిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. రాబందుల రక్షణ అందరి బాధ్యత అని చెప్పారు. ఈ పక్షులకు హాని కలిగించినా.., పట్టుకునేందుకు ప్రయత్నించినా.. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్థులు ఎలాంటి భయం లేకుండా రాబందును పట్టించుకోకుండా వెళ్లాలని చెప్పారు.

## అటు ఎండ ఇటు చలి

**హైదరాబాద్, జనవరి 19( వెలుతురు):**
తెలంగాణలో వింత వాతావరణం నెలకొంది. పగటిపూట ఎండలు మండిపోతుంటే.. రాత్రిళ్లు చలి వణికిస్తోంది. ఆదిలాబాద్‌లో 34.3 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు.. తిర్యాణిలో 7 డిగ్రీలకు పడిపోయాయి. రానున్న మూడు రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ విభిన్న వాతావరణంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణుల సూచన.తెలంగాణ రాష్ట్రంలో వింత వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు పగటిపూట భానుడు తన ప్రతాపాన్ని చూపుతుంటే.. మరోవైపు రాత్రి సమయాల్లో చలి పులి పంజా విసురుతోంది. గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాలో సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఇక్కడ సాధారణం కంటే 4.2 డిగ్రీలు అధికంగా నమోదై.. 34.3 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది. ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో కూడా పగటి పూట ఎండ తీవ్రత సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల వరకు పెరగడం విశేషం. జనవరి మూడవ వారంలోనే ఈ స్థాయిలో ఎండలు ఉండటం చూస్తుంటే.. రాబోయే వేసవి కాలం ఎంత తీవ్రంగా ఉండబోతుందోనన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది.పగటిపూట ఎండలు మండిపోతుంటే.. రాత్రి నుంచి ఉదయం వరకు మాత్రం చలి వణికిస్తోంది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణిలో అత్యల్పంగా 7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే ఆదిలాబాద్‌లోని భీంపూర్, సంగారెడ్డి జిల్లా కోహీర్, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువగానే నమోదయ్యాయి. రాష్ట్రంలోని దాదాపు 13 జిల్లాల్లో చలి తీవ్రత పెరిగి ఉష్ణోగ్రతలు 2 నుంచి 5.4 డిగ్రీల వరకు తగ్గుముఖం పట్టాయి.వాతావరణ శాఖ సూచనల ప్రకారం.. రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు తగ్గుతాయని అంచనా వేస్తున్నారు. అయితే పగటిపూట ఆకాశం నిర్మలంగా ఉండటం వల్ల సూర్యరశ్మి నేరుగా భూమిని తాకి పగటి ఉష్ణోగ్రతలు పెరగడానికి కారణమవుతోంది. రాత్రిపూట గాలిలోని తేమ శాతం తగ్గడం వల్ల చలి తీవ్రత అధికంగా ఉంటోంది. ఈ భిన్న వాతావరణం వల్ల ప్రజలు ఆరోగ్య సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

# లిక్కర్ స్కామ్‌లో మరో కీలక పరిణామం

**- ఎంపి మిథున్ రెడ్డికి ఇడి నోటీసులు**

**- 23న వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశం**



**అమరావతి, జనవరి19( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్‌లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 23న వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలంటూ ఎంపీ మిథున్ రెడ్డికి జారీ చేసిన నోటీసుల్లో ఈడీ స్పష్టం చేసింది. ఈ లిక్కర్ స్కామ్‌లో ఆయన కీలక పాత్ర పోషించారని ఈడీ అనుమానిస్తోంది. అలాగే ఈ వ్యవహారంలో హవాలా, మనీ ల్యాండరింగ్ రూపంలో భారీఎత్తున అక్రమాలు జరిగినట్లు ఈడీ అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలో వైసీపీ ఎంపీకి నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే ఈ కేసులో మిథున్ రెడ్డి అరెస్టయ్యారు. అనంతరం ఆయన్ని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. ప్రస్తుతం ఆయన బెయిల్‌పై విడుదలైన విషయం విదితమే. మరోవైపు వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి సైతం రెండ్రోజుల క్రితం ఈడీ నోటీసులు జారీ చేసింది. జనవరి 22వ తేదీన విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. వైసీపీ పభుత్వ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్‌పై జరిగిన విచారణలో ఇప్పటికే పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ స్కామ్ లో కీలక పాత్ర పోషించిన రాజ్ కసిరెడ్డి ఆస్తులను సైతం ప్రభుత్వానికి అటాచ్ చేశారు. అలాగే ఈ కేసులో విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం వారు బెయిల్‌పై బయట ఉన్నారు. ఈ స్కామ్‌లో తవ్వే కొద్ది కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అంతేకాకుండా.. ఎంపీ మిథున్ రెడ్డి ఈ కేసులో కీలక పాత్ర పోషించారనే ప్రచారం సాగుతోంది. దాంతో విచారణకు హాజరుకావాలంటూ ఆయనకు నోటీసులు జారీ చేసింది. ఆ ముందు రోజే విచారణకు హాజరు కావాలంటూ విజయసాయిరెడ్డికి ఈడీ నోటీసులు ఇచ్చింది. అయితే వైసీపీతోపాటు రాజ్యసభ సభ్యత్వానికి విజయసాయిరెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

# దావోస్‌కు సిఎం చంద్రబాబు నాయుడు

**- జ్యూరిచ్‌లో ఎన్నారై టిడిపి నేతల ఘన స్వాగతం**



**అమరావతి, జనవరి19( వెలుతురు):**
స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా జరగనున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బయలుదేరి వెళ్లారు. జ్యూరిచ్‌లో చేరుకున్న సీఎం చంద్రబాబు నాయుడు బృందానికి యూరప్‌లోని 20కిపైగా దేశాల నుంచి ఎన్నారైలు, టీడీపీ కార్యకర్తలు భారీగా తరలి వచ్చి స్వాగతం పలికారు. అలాగే స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్ ఘనస్వాగతం పలికారు. అనంతరం సీఎం చంద్రబాబుతో ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆయనతో సమావేశం కావడం తనకు ఆనందంగా ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అందుకు సంబంధించిన ఫొటోలను సీఎం చంద్రబాబు నాయుడు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. అలాగే దావోస్ – క్లోస్టర్స్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సమావేశం కోసం జ్యూరిచ్ చేరుకున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. 'సంభాషణ స్ఫూర్తి' అనే థీమ్‌తో జరిగే ఈ సమావేశం, భవిష్యత్తును రూపొందించడానికి ఉపయోగపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యాపార, ప్రభుత్వం, అంతర్జాతీయ సంస్థలు, పౌర సమాజం, విద్యా సంస్థల నుండి నాయకులను ఒకచోట చేర్చే ప్రపంచ వేదిక ఈ ఫోరమని ఆయన అభివర్ణించారు. సింగపూర్ అధ్యక్షుడు ధర్మన్ షణ్ముగరత్నంతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. తన రాష్ట్రం, ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహించడం తనకు గర్వకారణంగా ఉందని సీఎం చంద్రబాబు నాయుడు వివరించారు. స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్ తమకు స్వాగతం పలికారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనకు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. అందుకు సంబంధించిన ఫొటోలను సీఎం చంద్రబాబు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. అలాగే అసోం సీఎం హిమంత్ బిశ్వాస్‌తో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

# వేర్వేరుచోట్ల ప్రమాదాలు

**- పలువురికి గాయాలు**

**విజయవాడ, జనవరి19( వెలుతురు):**
సంక్రాంతి సెలవులు పూర్తి కావడంతో స్వస్థలాలకు వెళ్లిన వారు తమ తమ ఇళ్లకు తిరుగు పయనమయ్యారు. దీంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారులో సోమవారం ఉదయం ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 9 మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. అదే రహదారిపై వెళ్తున్న వాహనదారులు వెంటనే స్పందించి.. 108కి సమాచారం అందించారు. దీంతో వారిని చికిత్స నిమిత్తం వెంటనే పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.శ్రీకాకుళం నుంచి భీమవరం వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 24 మంది ఉన్నారని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు స్వల్ప గాయాలు మినహా ఎవరికి తీవ్ర గాయాలు కాలేదని పోలీసులు స్పష్టం చేశారు. కాకినాడ జిల్లాలోని జగ్గంపేట జాతీయ రహదారిపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో నుంచి ఒక్కసారిగా పొగలు వచ్చాయి. దీంతో ప్రయాణికులంతా భయంతో బస్సు దిగి పరుగులు తీశారు. బస్ డ్రైవర్లు వెంటనే అప్రమత్తమై సమస్యను గుర్తించి సరిచేశారు. అనంతరం.. బస్సు హైదరాబాద్‌కు బయలుదేరింది. ఇంజిన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపం కారణంగానే.. ఈ పొగలు వ్యాపించినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో బస్సులో 35 మంది ప్రయాణికులు ఉన్నారు. ఆ బస్సు విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది.నెల్లూరు జిల్లాలోని సీతారామపురం మండలం బసినేనిపల్లి జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో బెడుసుపల్లి కాశినాయన ఆశ్రమానికి వీరంతా వెళ్లారు. స్వస్థలం ఉదయగిరి కి తిరిగొచ్చే క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

# పార్టీ వ్యవహారాలపై కవిత వేగంగా అడుగులు

**- పలువురు ప్రముఖులతో వరుస భేటీలు**

**- వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌తో సమాలోచనలు**



**హైదరాబాద్, జనవరి19( వెలుతురు):**
వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి తెలంగాణ రాజకీయాల్లో బలమైన ముద్ర వేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భావిస్తున్నారు. ఇప్పటికే ఆమె ఆ దిశగా కసరత్తు మొదలు పెట్టారు. బలమైన శక్తిగా తిరిగి వస్తానంటూ ఆమె మండలిలో భావోద్వేగ ప్రసంగం చేశారు. తెలంగాణ జాగృతినే పార్టీ మార్చి ముందుకు వెళ్లాలన్న సమాలోచనలు చేస్తున్నారు. సొంత పార్టీని స్థాపించడం ద్వారా ఎన్నికలకు వెళ్లాలని ఆమె నిర్ణయించినట్లు తెలుస్తోంది. అందుకోసం ఆమె వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్‌తో కవిత వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. దాదాపు 60 రోజుల వ్యవధిలో రెండుసార్లు ప్రశాంత్ కిశోర్ హైదరాబాద్ వచ్చి.. కవితతో భేటీ అయినట్లు సమాచారం. సంక్రాంతి పండగ వేళ.. హైదరాబాద్‌లో కవిత, పీకేలు సమావేశమయ్యారని తెలుస్తోంది. . ఈ సందర్భంగా తెలంగాణ ప్రజల కోసం పార్టీ ఏర్పాటు.. తమ పార్టీని ప్రజలు ఓన్ చేసుకోవడం.. ప్రజల కోణంలో ఎలా పనిచేయాలనే అంశంతో పాటు వివిధ అంశాలపై ప్రశాంత్ కిశోర్‌తో కవిత సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. ఇక పార్టీ విధానాల రూపకల్పన కోసం ఇప్పటికే 50 కమిటీలతో కవిత అధ్యయనం చేయిస్తున్న సంగతి తెలిసిందే. తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వ పరిరక్షణ కోసం పార్టీ ఏర్పాటు ప్రయత్నాల్లో కవిత వేగం పెంచిన విషయం విదితమే. ఇప్పటికే ప్రజల్లోకి వెళుతూ బిఆర్ఎస్‌ను దునుమాడుతున్నారు. తండ్రి కెసిఆర్ పాలనపై విమర్శలు గుప్పిస్తున్నారు. అలాగే కాంగ్రెస్ పైనా విమర్శలు చేస్తున్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో తెలంగాణ జాగృతి సంస్థ అధ్యక్షురాలు కవిత క్రియాశీలక పాత్ర పోషించారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. అదే సమయంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో నాటి టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా కవిత గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో అంటే.. 2019లో అదే స్థానం నుంచి మళ్లీ బరిలో దిగి.. బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ చేతిలో ఆమె ఓటమి పాలయ్యారు. టీఆర్ఎస్ తరపున కవితను శాసనమండలికి ఆ పార్టీ అధినేత కేసీఆర్ పంపారు. ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా చేశారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలిగా కవిత ప్రజల్లోకి వెళ్లారు. జనం బాట పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ.. ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలపై ప్రభుత్వాన్ని ఆమె నిలదీస్తున్న విషయం విదితమే. సొంత పార్టీ స్థాపించడం ద్వారా.. రానున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రముఖ రాజకీయ పార్టీలకు బలమైన పోటీగా నిలవాలని కవిత భావిస్తున్నారు. అందుకోసం ఆ దిశగా అడుగులు వేస్తున్నారామె. ఈ నేపథ్యంలో ఇలా ప్రశాంత్ కిశోర్‌తో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. గతంలో 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ తెలంగాణలో ముచ్చటగా మూడోసారి అధికారం చేపట్టాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భావించారు. అప్పట్లో ప్రశాంత్ కిశోర్‌తో కేసీఆర్ పలుమార్లు హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. కానీ ఆ ఎన్నికల్లో తెలంగాణ ఓటర్లు.. కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టిన సంగతి తెలిసిందే. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో మళ్ళీ బిఆర్ఎస్‌కు అధఃకారం కల్ల అని తెలిసిపోయింది. దీంతో పార్టీ నుంచి బయటకు వచ్చిన కవిత సొంత ఎజెండతా రాజకీయాలు సాగిస్తున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలు లక్ష్యంగా పోరాటం చేస్తున్నారు.

# మహాపూజతో నాగోబా జాతర ప్రారంభం

**- వేలాదిగా తరలివచ్చిన ఆదివాసీలు**

**- నాగోబా జాతరలో ఎంపి నగేశ్ పూజలు**







**ఆదిలాబాద్, జనవరి19( వెలుతురు):**
ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా జాతర ఆదివారం అర్ధరాత్రి మహాపూజతో అట్టహాసంగా ప్రారంభమైంది. ఆదివాసీ సంప్రదాయ రీతిలో సన్నాయి మోతలు, డోలు వాయిద్యాలు, దివిటీల కాంతుల మధ్య మెస్రం వంశీయులు.. నాగోబాను గంగా జలంతో అభిషేకిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆదిలాబాద్ ఎంపి జి. నగేశ్ నాగోబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయ గోండు పద్ధతిలో ఆయన పూజలు నిర్వంచారు. జాతర సందర్భంగా పోలీసులు ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేశారు. దర్శనానికి భారీగా భక్తులు తరలివస్తున్నారు.

నాగోబా జాతర.. ఆసియాలోనే రెండో అతిపెద్ద గిరిజన జాతరగా ఖ్యాతి గాంచింది. పుష్యమాసంలో నెలవంక కనిపించిన అనంతరం మెస్రం వంశీయులు.. ఈ నాగోబా జాతరకు శ్రీకారం చుడతారు. డిసెంబర్ 30న మెస్రం వంశీయులు కేస్లాపూర్ నుంచి పాదయాత్రగా హస్తినమడుగుకు చేరుకొని.. అక్కడ సేకరించిన పవిత్ర గంగాజలంతో కేస్లాపూర్ చేరుకున్నారు. ఆ గంగాజలంతో ఆదివారం అర్ధరాత్రి ఆదిశేషుడికి అభిషేకం చేసి మహాపూజలు నిర్వహించడం ద్వారా ఈ జాతరను ప్రారంభించారు.

నాగోబా మహాపూజతో ఆదివారం ప్రారంభమైన జాతర.. ఈనెల 23వ తేదీ వరకూ కొనసాగనుంది. ఈ జాతరలో భాగంగా 20న పెర్సపేన్, బాన్ పేన్ పూజలు, 22న నాగోబా దర్బార్ నిర్వహించనున్నారు. 23న బేతాల్ పూజ, మండగాజాలింగ్ పూజలతో నాగోబా జాతర ముగియనుంది. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా సరిహద్దు రాష్ట్రాల నుంచీ అధిక సంఖ్యలో భక్తులు భారీగా తరలి రానున్నారు. ఈ నేపథ్యంలో ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

# క్రిషాంక్‌కు కలిసిరాని కాలం




**హైదరాబాద్, జనవరి19( వెలుతురు):**
భారత రాష్ట్ర సమితి రెండు పర్యాయాలు తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని చలాయించింది. రెండు పర్యాయాలు కూడా ప్రతిపక్షాన్ని తొక్కి అవతలపడేసింది. ఇతర పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలను ఆపరేషన్ ఆకర్ష్ ద్వారా చేర్చుకుంది. 2023లో మాత్రం భారత రాష్ట్ర సమితి పార్టీకి తెలంగాణ రాష్ట్రంలో వ్యతిరేకమైన ఫలితం వచ్చింది. హ్యాట్రిక్ సాధించాలని కలలు గన్న గులాబీ పార్టీకి చుక్కెదురైంది.ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉంది గులాబీ పార్టీ. పార్టీ అధికారం లేకపోయినప్పటికీ.. సోషల్ మీడియా మాత్రం బలంగా ఉంది. గులాబీ పార్టీ సోషల్ మీడియాను ఈ స్థాయిలో బలోపేతం చేసిన వ్యక్తుల్లో క్రిషాంక్ కచ్చితంగా ఉంటారు. ఈయన కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ అల్లుడు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థిగా తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. అనేక పర్యాయాలు జైలుకు కూడా వెళ్లి వచ్చారు. గులాబీ పార్టీకి కీలకమైన సమాచారం అందించడంలో ఈయన దిట్ట అని చెబుతుంటారు.క్రిషాంక్ కంటోన్మెంట్ ప్రాంతం నుంచి ఎమ్మెల్యేగా గెలవాలని భావిస్తున్నారు. 2023లో టికెట్ లభిస్తుందని అనుకున్నప్పటికీ అవకాశం రాలేదు. అప్పుడు గులాబీ పార్టీ సాయన్న కుమార్తెకు అవకాశం ఇచ్చింది. సాయన్న కుమార్తె చనిపోవడంతో.. మళ్లీ క్రిషాంక్ కు టికెట్ ఇస్తారని ప్రచారం జరిగింది. కానీ, ఈసారి కూడా రిక్త హస్తమే మిగిలింది. దీంతో క్రిషాంక్ ఎమ్మెల్యే ఆశలు నెరవేరలేదు.ప్రస్తుతం గులాబీ పార్టీలో సోషల్ మీడియాను ముందుండి నడిపిస్తున్నారు క్రిషాంక్. అయితే ఆయన ఎంతో శ్రమ పడుతున్నప్పటికీ.. గులాబీ పార్టీలో కొంతమంది వ్యక్తులు ఆయనను నాయకుడిగా చూడడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు క్రిషాంక్ కు టికెట్ లభించలేదు. అప్పుడు ఆయన మామ సర్వే సత్యనారాయణకు టికెట్ ఇచ్చారు. దీంతో దానిని కారణంగా చూపి క్రిషాంక్ గులాబీ పార్టీలో చేరారు. అక్కడ కూడా ఆయనకు అవకాశం లభించడం లేదు. సికింద్రాబాద్ నగరానికి సంబంధించి గులాబీ పార్టీని పర్యవేక్షిస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్.. కంటోన్మెంట్ ఏరియా కు గులాబీ పార్టీకి సంబంధించి కొత్త బాధ్యులు వస్తారని ప్రకటించారు. ఆ సమావేశానికి క్రిషాంక్ ను పిలవలేదు. క్రిషాంక్ ఆశల మీద తలసాని శ్రీనివాస్ యాదవ్ నీళ్లు చల్లుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్రిషాంక్ పార్టీ కోసం తీవ్రంగా కష్టపడుతున్నారు. అనేక కేసులను ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాలలో దాడులకు కూడా గురయ్యారు. ఈ పరిణామాలు క్రిషాంక్ ను ఆవేదనకు గురి చేస్తున్నాయని అతడి అభిమానులు అంటున్నారు. ఆయన చేస్తున్న పోరాటానికి గుర్తింపు ఏ మాత్రం లభించడం లేదని అభిమానులు వాపోతున్నారు. కేటీఆర్ తో బలమైన బంధం ఉన్నప్పటికీ.. క్రిషాంక్ ను పార్టీ అధిష్టానం ఎందుకు గుర్తించడం లేదో అర్థం కావడం లేదు. కేటీఆర్ మీద సంపూర్ణ విశ్వాసంతో ఉన్నానని అనేక సందర్భాలలో క్రిషాంక్ చెప్పారు. క్రిషాంక్ కు కూడా కేటీఆర్ హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. దీనికి తోడు తలసాని శ్రీనివాస్ యాదవ్ కంటోన్మెంట్ విషయంలో వేలు పెట్టడంతో అసలు క్రిషాంక్ రాజకీయ భవిష్యత్తు ఏమిటో అర్థం కావడం లేదు.

# జూబ్లీ హిల్స్లో 'లేయర్స్ ఫైవ్' క్లినిక్ ను ప్రారంభించిన మిథాలీ రాజ్

**హైదరాబాద్ జనవరి19( వెలుతురు):**
డైటింగ్ పేరిట ఆహారానికి దూరంగా ఉండటం కంటే, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడాన్నే తాను నమ్ముతానని భారత మహిళా క్రికెట్ మాజీ సారథి మిథా లీరాజ్ అన్నారు. సుప్రసిద్ధ చర్మ, కేశ, సౌందర్య క్లినిక్ బ్రాండ్ అయిన లేయర్స్ క్లినిక్స్, జూబ్లీహిల్స్ లో లేయర్స్ ఫైవ్ను క్లినిక్ ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా తనను కలిసిన క్రీడాభిమానులతో ముచ్చటించారు. ఏ రంగంలో విజయం సాధించాలన్నా క్రమశిక్షణ చాలా ముఖ్యమన్నారు. స్ట్రెంగ్త్ ట్రైనింగ్ వంటి వ్యాయామాలు చేస్తూ ఆరోగ్యంగా ఉంటే అది అవసరమైన ఆత్మవిశ్వాసం ఇస్తుందని ఆమె యువతులకు సూచించారు. చర్మ, ఆరోగ్య సంరక్షణలో భాగంగా తాను పాటించే జాగ్రత్తలను మిథాలీరాజ్ వివరించారు.









# మన శంకర వరప్రసాద్ దూకుడు

## 292 కోట్ల గ్రాస్ కలెక్షన్లతో రికార్డు

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా, అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన సంక్రాంతి బ్లాక్‌బస్టర్ 'మన శంకర వరప్రసాద్ గారు' బాక్సాఫీస్ వద్ద దూకుడు కొనసాగిస్తోంది. ఫ్యామిలీ ఆడియన్స్‌ను ప్రధానంగా ఆకట్టుకునేలా రూపొందిన ఈ చిత్రం విడుదలైనప్పటి నుంచే హౌస్‌ఫుల్ షోలను నమోదు చేస్తూ, అద్భుతమైన వసూళ్లతో ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా మొదటి వారం పూర్తయ్యే సరికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ. 292 కోట్ల గ్రాస్ కలెక్షన్లు రాబట్టింది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం ఇదే జోరు కొనసాగితే, అతి త్వరలోనే రూ. 300 కోట్ల క్లబ్‌లోకి ఈ చిత్రం అడుగుపెట్టడం ఖాయమని అంటున్నారు. ఈ స్థాయి వసూళ్లతో 2026 సంవత్సరానికి టాలీవుడ్‌కు అదిరిపోయే ఆరంభం లభించినట్లైంది. సంక్రాంతి బరిలో విడుదలైన ఇతర చిత్రాలతో పోలిస్తే, 'మన శంకర వరప్రసాద్ గారు' స్పష్టమైన ఆధిక్యంతో ముందంజలో నిలిచింది. బలమైన కథనం, అనిల్ రావిపూడి మార్క్ కామెడీ టైమింగ్, చిరంజీవి వింటేజ్ స్టైల్ నటన సినిమాకు ప్రధాన బలంగా మారాయి. పైగా రాబోయే వారం రోజుల పాటు పెద్దగా పోటీ లేకపోవడంతో, వసూళ్లు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో చిరంజీవి పాత్ర ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకోగా, నయనతార కథానాయికగా తనదైన ఆకర్షణతో కీలక పాత్ర పోషించింది. కుటుంబ ప్రేక్షకులు థియేటర్లకు పెద్ద ఎత్తున రావడంతో పాటు, అన్ని వయసుల ప్రేక్షకులకు నచ్చే అంశాలు సినిమాలో పుష్కలంగా ఉన్నాయి. కామెడీ, ఎమోషన్, మాస్ ఎలిమెంట్స్‌ను సమతూకంగా మేళవించిన విధానం సినిమాకు ప్లస్ అయింది. సాహు గారపాటి, చిరంజీవి కుమార్తె సుస్మిత సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమా, వాణిజ్యపరంగా నిర్మాతలకు భారీ లాభాలను అందిస్తోంది. కలెక్షన్ల జోరు కొనసాగుతుండటంతో, మేకర్స్ ఇంకా బలమైన ప్రమోషన్లను ఎ÷–లాన్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, రాబోయే రోజుల్లో సినిమా మరిన్ని రికార్డులు సృష్టించే అవకాశముందని ట్రేడ్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా చూస్తే, మెగాస్టార్ చిరంజీవి ఖాతాలో మరో బ్లాక్‌బస్టర్‌గా 'మన శంకర వరప్రసాద్ గారు' నిలిచింది. బాక్సాఫీస్ వద్ద కొనసాగుతున్న ఈ ప్రభంజనం, ఈ ఏడాది టాలీవుడ్‌కు గో÷–డలెన్ స్టార్ట్‌గా మారిందని చెప్పొచ్చు.

# దుల్కర్ హీరోయిన్ సాత్విక గ్లింప్స్ విడుదల

దుల్కర్ సల్మాన్ హీరోగా పవన్ సాధినేని తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఆకాశంలో ఒక తార' . ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో హీరోయిన్‌ను పరిచయం చేశారు. సాత్విక వీరవల్లి ఇందులో కథానాయికగా నటించనున్నట్లు తెలుపుతూ గ్లింప్స్ విడుదల చేశారు. కనీస వసతులు కూడా లేని పల్లెటూరిలో పుట్టిన అమ్మాయి తన కలలను ఎలా సాధించుకుంది అనే కథాంశంతో ఈ చిత్రం రూపొందనున్నట్లు గ్లింప్స్ ఆధారంగా తెలుస్తోంది. వేసవి కానుకగా ఈ సినిమా విడుదల కానుంది.








# వరుణ్‌తేజ్ మూవీ 'కొరియన్ కనకరాజు'

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' పై అభిమానుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ హారర్ కామెడీ–ఫాంటసీ ఎంటర్‌టైనర్ నుంచి తాజాగా విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ సినిమా పై క్రేజ్‌ను మరింత పెంచింది. వరుణ్ తేజ్ పుట్టినరోజు సందర్భంగా ప్రాజెక్ట్ టైటిల్‌తో పాటు గ్లింప్స్‌ను విడుదల చేయగా, అది అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ సినిమాతో వరుణ్ తేజ్ తొలిసారిగా హారర్ ఫాంటసీ జానర్‌లో అడుగుపెడుతున్నారు. గ్లింప్స్‌లో ఆయన మాస్ లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విదేశాల్లోని ఒక పోలీస్ స్టేషన్ నేపథ్యంలో సాగే సన్నివేశంలో, కమెడియన్ సత్యను పోలీసులు కొడుతుండటం, ఆ సమయంలో కామెడీ ట్రాక్ నడుస్తూనే హీరో స్టైలిష్‌గా ఎంట్రీ ఇవ్వడం ప్రేక్షకులకు హుషారును కలిగిస్తోంది. 'వీడు మన కనకరాజు కాదమ్మో' అంటూ సత్య చెప్పే డైలాగ్‌కు, 'నేను తిరిగొచ్చేశా' అంటూ వరుణ్ తేజ్ కొరియన్ భాషలో ఇచ్చే కౌంటర్ ప్రత్యేకంగా హైలైట్ అవుతోంది. ఈ సన్నివేశం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అలాగే సీనియర్ నటి తులసి, కమెడియన్ సత్య కీలక పాత్రల్లో కనిపించనున్నారు. యువీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంట్టంల్గ÷న్మెంట్స్ బ్యానర్లపై ఈ సినిమాను భారీ స్థాయిలో సంయుక్తంగా నిర్మిస్తున్నారు. లెజెండరీ కంపోజర్ తమన్ స్వరాలు సమకూరుస్తున్నారు. వరుణ్ తేజ్ ? తమన్ కాంబోలో గతంలో వచ్చిన 'తొలిప్రేమ' సినిమా మ్యూజికల్‌గా పెద్ద హిట్ కావడంతో, ఈ సినిమాపై కూడా మ్యూజిక్ పరంగా భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతున్న ఈ సినిమాను సమ్మర్ సీజన్‌లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. గత కొంతకాలంగా వరుణ్ తేజ్‌కు సరైన కమర్షియల్ హిట్ పడకపోవడంతో, 'కొరియన్ కనకరాజు'తో ఆయన బలమైన కమ్‌బ్యాక్ ఇస్తారని అభిమానులు ఆశిస్తున్నారు. హారర్, కామెడీ, ఫాంటసీ అంశాలను మేళవిస్తూ రూపొందుతున్న ఈ సినిమా, వరుణ్ తేజ్ కెరీర్‌లో ఒక ప్రత్యేకమైన మైలురాయిగా నిలుస్తుందేమో అన్న అంచనాలు ఇండస్ట్రీలో వినిపిస్తున్నాయి.

# సెకండ్ ఇన్నింగ్స్‌లో రేణూదేశాయ్

టాలీవుడ్ ప్రేక్షకులకు రేణు దేశాయ్ పేరు ప్రత్యేక పరిచయం అవసరం లేదు. సెకండ్ ఇన్నింగ్స్‌లో భాగంగా ఆమె కీలక పాత్రలకే ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్నారు. రవితేజ హీరోగా నటించిన టైగర్ నాగేశ్వరరావు సినిమాలో కనిపించిన రేణు దేశాయ్, ఆ తర్వాత కూడా పలు అవకాశాలు తనను వెతుక్కుంటూ వచ్చినట్టు ఇటీవల వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన రేణు దేశాయ్, సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన సర్కారు వారి పాట సినిమాలో తనకు అవకాశం వచ్చిందని తొలిసారిగా వెల్లడించారు. ఆ చిత్రంలో ఒక ముఖ్యమైన పాత్ర కోసం దర్శక నిర్మాతలు తనను సంప్రదించారని, కథ, పాత్ర రెండూ తనకు బాగా నచ్చాయని ఆమె చెప్పారు. నటించాలనే ఆసక్తి కూడా ఉన్నప్పటికీ, కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల ఆ అవకాశాన్ని వదులుకోవాల్సి వచ్చిందని తెలిపారు. అయితే ఆ కారణాలేమిటన్నది మాత్రం ఆమె స్పష్టంగా చెప్పలేదు. ఆ విషయాలు బయటపెడితే అనవసరమైన వివాదాలు చెలరేగే అవకాశం ఉందని భావించి మౌనంగా ఉండటం మంచిదని నిర్ణయించుకున్నట్టు రేణు చెప్పారు. ఈ వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. నిజంగా వ్యక్తిగత సమస్యలే కారణమా? లేక ఆ అవకాశాన్ని చేజార్చిన మరో నేపథ్యం ఉందా? అనే చర్చ నడుస్తోంది. మహేష్ బాబు సినిమాలో రేణు దేశాయ్ కనిపించలేకపోవడం అభిమానులను నిరాశపరిచినా, ఆమె సెకండ్ ఇన్నింగ్స్‌పై మాత్రం అంచనాలు పెరుగుతున్నాయి. టైగర్ నాగేశ్వరరావు తర్వాత తాజాగా బ్యాడ్ గర్ల్స్ సినిమాలో కీలక పాత్రలో నటించి మరోసారి తన నటనతో ఆకట్టుకున్నారు. సెకండ్ ఇన్నింగ్స్‌లో ఆమె ప్రయాణం ఇప్పుడు కొత్త దిశగా సాగుతోందన్నది అభిమానుల అభిప్రాయం.



# అందరినీ ప్రేమించే తత్వం భారత్ సొంతం

## ఎఆర్ రహమాన్ వ్యాఖ్యలను విభేదించిన తస్లీమా నస్రీన్

తాను ముస్లిం కావడం వల్లే బాలీవుడ్‌లో అవకాశాలు తగ్గాయని, మారిన అధికార సమీకరణాలు కూడా అందుకు ఓ కారణం కావొచ్చని ఆస్కార్ అవార్డు గ్రహీత, సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్ ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. ఆ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ చేసిన వ్యాఖ్యలను బాలీవుడ్ ప్రముఖులతో సహా అందరూ ఖండిస్తున్నారు. తాజాగా సంచలన రచయిత తస్లీమా నస్రీన్ కూడా స్పందించారు. ఆమె తన ఎక్స్ అకౌంట్‌లో ఓ పోస్టు చేశారు. దఏఆర్ రెహ్మాన్ మనోవేదనను ఆమె తప్పుపట్టారు. రెహ్మాన్ ముస్లిం వ్యక్తే అని, భారత్‌లో ఆయన ఓ ఫేమస్ వ్యక్తి అని, ఇతర ఆర్టిస్టులకన్నా ఆయన సంపాదన ఎక్కువే అని, బహుశా సంపన్న సంగీత దర్శకుడు అయి ఉంటారని, కానీ ముస్లిం కావడం వల్లే బాలీవుడ్‌లో అవకాశాలు రావడం లేదని రెహ్మాన్ ఫిర్యాదు చేస్తున్నారని ఆమె చెప్పారు. బాలీవుడ్‌లో షారూక్ బాద్‌షా అని, సల్మాన్, ఆమిర్, జావిద్ అక్తర్, షబానా అజ్మీ అందరూ సూపర్ స్టార్లే అని ఆమె తెలిపారు. సంపన్నులు, ఫేమస్ వ్యక్తులకు ఎక్కడ ఇబ్బందికర పరిస్థితులు ఉండవని, ప్రాంతం ఏదైనా, కులం ఏదైనా, వర్గం ఏదైనా సమస్య ఉండదని తస్లీమా అన్నారు. కానీ నాలాంటి పేదలకు సమస్యలు ఉంటాయన్నారు. తాను హేతువాదినని, ఎక్కడకు వెళ్లినా సమస్యలు ఎదుర్కొన్నట్లు చెప్పారు. కానీ ఏఆర్ రెహ్మాన్‌ను హిందువులు, ముస్లింలు, బౌద్ధులు, క్రైస్తవులు, హేతువాదులు విశ్వసిస్తారని, ఆయన మీద జాలిపడే సందర్భం కాదు అన్నట్లు తస్లీమా నస్రీన్ అన్నారు.



# వెంకటేశ్ ఆదర్శ కుటుంబంలో నారా రోహిత్.. ఇంతకీ రోల్ ఏంటో తెలుసా..?

టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్ త్రివిక్రమ్ శ్రీనివాస్ క్రేజీ కాంబోలో వస్తున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం AK47' .'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి'వంటి చిత్రాలకు త్రివిక్రమ్ కథ, మాటలు అందించాడని తెలిసిందే. ఈ రెండు సినిమాల తర్వాత వెంకీ, త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న ఫుల్ లెంగ్త్ సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఇప్పటికే లాంచ్ చేసిన ఫస్ట్ లుక్‌లో వెంకీ ఫ్యామిలీ ఆడియెన్స్‌కు కనెక్ట్ అయ్యే పాత్రలో కనిపించబోతున్నాడని తెలిసిపోతుంది.




తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఆసక్తికర వార్త ఒకటి ఫిలిం నగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. టాలీవుడ్ యాక్టర్ నారా రోహిత్ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటించబోతున్నాడు. లేటెస్ట్ టాక్ ప్రకారం నారా రోహిత్ ఇందులో యాంటీ కాప్ రోల్‌లో కనిపించనున్నాడట. ఆదర్శ కుటుంబం షూటింగ్ జెట్ స్పీడ్‌లో కొనసాగుతుండగా.. నారా రోహిత్ ఇప్పటికే సెట్స్‌లో జాయిన్ అయ్యాడని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే తన పోర్షన్లకు సంబంధించిన చిత్రీకరణ షురూ అయిందట. ఈ మూవీలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ముందుగా ఈ చిత్రాన్ని సమ్మర్ కానుకగా విడుదల చేయాలని ప్రకటించగా.. పలు కారణాలతో వాయిదా పడ్డది. మేకర్స్ త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటించనున్నారని సమాచారం. ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్నాడు. ఈ మూవీ షూట్ పూర్తయిన తర్వాత దృశ్యం అపై ఫోకస్ పెట్టనున్నాడు వెంకీ.

# భయపెడతున్న వెండి ధరలు

**- రోజురోజుకూ గరిష్ట ధరలు నమోదు**




**ముంబై,జనవరి19( వెలుతురు):**
వెండి ధరలు దూసుకెళుతున్నాయి. పెట్టుబడిదారుల ఆసక్తిని ఆకర్షిస్తూ ఈ తెల్లని లోహం సరికొత్త రికార్డులను తాకుతోంది. ఈ జనవరి నెలలోనే ఇప్పటివరకు 22 శాతం మేర వెండి ధర పెరిగింది. ప్రధాన పెట్టుబడి సాధనాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తోంది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 3 లక్షల మైలురాయికి అత్యంత చేరువలో ఉంది. గత శుక్రవారం ఎంసీఎక్స్‌లో కిలో వెండి ధర రూ. 2,87,762 వద్ద ముగిసింది. గత ఏడాది ఏప్రిల్ లో రూ. 95,917గా ఉన్న ధర, అప్పటి నుంచి దాదాపు 200 శాతం పెరగడం గమనార్హం. సాధారణంగా మల్టీబ్యాగర్ స్టాక్స్ లో కనిపించే ఈ తరహా రాబడి, కమోడిటీలో నమోదు కావడం విశేషం. గత వారమే కిలో వెండి రూ. 2,92,960 వద్ద సరికొత్త రికార్డును సృష్టించింది. తాజాగా వెండి ధరలు కిలోకు మూడు లక్షల మార్క్ దాటి 3.18 లక్షల వద్ద కొనసాగుతోంది. రోజురోజుకూ వేలల్లో ధరలు పెరగడం చూస్తున్నాం. వెండి ధరకు ఇంతటి డిమాండ్ రావడానికి పలు అంతర్జాతీయ అంశాలు దోహదం చేస్తున్నాయి. గత మూడేళ్లుగా పెద్ద ఎత్తున బంగారాన్ని కొనుగోలు చేసిన ప్రపంచ కేంద్ర బ్యాంకులు, ఇప్పుడు తమ నిల్వల్లోకి వెండిని కూడా చేర్చుకుంటున్నట్లు వస్తున్న నివేదికలు ధరలకు మరింత ఊతమిస్తున్నాయి. దీనికి తోడు, మార్కెట్లో భౌతిక వెండి నిల్వలు తగ్గడం కూడా ధరల పెరుగుదలకు మరో కారణంగా నిలుస్తోంది. నిజానికి, 2025 ప్రారంభంలో వెండిపై పెట్టుబడిదారులు పెద్దగా ఆసక్తి చూపలేదు. గత ఏడాది చివరి నాటికి వెండి ధర రూ. 1,10,000 చేరుకుంటుందని విశ్లేషకులు అంచనా వేయగా, ఆ మార్కును చాలా ముందే దాటేసింది. ఆ తర్వాత కూడా ఆగకుండా రూ.2,54,000 స్థాయిని తాకి, అంచనాలను తలకిందులు చేసింది. ప్రస్తుత ముగింపు ధర ప్రకారం చూస్తే ? రూ. 3 లక్షల మైలురాయిని దాటడానికి వెండికి కేవలం 4.2 శాతం పెరుగుదల మాత్రమే అవసరం. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారుల దఅష్టి ఇప్పుడు పూర్తిగా వెండిపైనే కేంద్రీకృతమై ఉంది.

# 23న మాఘ శుద్ధ పంచమి

**- ఇంద్రకీలాద్రిపై ప్రత్యేక ఏర్పాట్లు**

**- సరస్వతీ రూపంలో దర్శనమివ్వనున్న అమ్మవారు**



**విజయవాడ,జనవరి19( వెలుతురు):**
మాఘమాసం సందర్భంగా ఈ నెల 23న మాఘ శుద్ధ పంచమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజు భక్తులకు శ్రీ దుర్గమ్మవారు సరస్వతీ దేవి రూపంలో దర్శనం ఇవ్వనున్నారు. దీంతో ప్రధాన ఆలయంలో అమ్మవారి మూల స్వరూపానికి ప్రత్యేక అలంకరణతో పాటు, మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఇక.. ఆరో అంతస్తులో దాదాపు 500 మంది విద్యార్థులకు ఉచిత సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించనున్నారు. అలాగే.. యాగశాలలో శ్రీ సరస్వతీ హోమం సహా పలు వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శ్రీ పంచమి రోజు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సరస్వతీ దేవి రూపంలో అమ్మవారిని విద్యార్థులు ఉచిత దర్శనం చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం విద్యార్థులకు పెన్ను, శక్తి కంకణం, అమ్మవారి ఫొటోతో పాటు 40 గ్రాముల లడ్డూ ప్రసాదాన్ని ఉచితంగా అందజేస్తామని దేవస్థానం ఉన్నతాధికారులు వెల్లడించారు. శుక్రవారం వచ్చే ఈ వసంత పంచమి రోజున.. స్కూల్ యూనిఫామ్ ధరించి, గుర్తింపు కార్డుతో వచ్చే విద్యార్థులకే ఉచిత దర్శనానికి అనుమతిస్తామని ఆలయ అధికారులు వివరించారు. దీంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీ పంచమి వేళ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రముఖ దేవాలయాల్లో అమ్మవారు సరస్వతీ రూపంలో దర్శనమివ్వనున్నారు. ఇక బాసర(నిర్మల్ జిల్లా), వర్గల్(సిద్ధిపేట జిల్లా) దేవాలయాలకు సైతం భక్తులు పోటెత్తనున్నారు. మరోవైపు.. నేటి నుంచి అంటే సోమవారం నుంచి శ్యామలా నవరాత్రులు ప్రారంభమయ్యాయి.

# సిద్దిపేట పట్టణంలో దారుణ ఘటన

**- భార్యను కిరాతకంగా హత్య చేసిన భర్త**

**సిద్దిపేట,జనవరి 19( వెలుతురు):**
సిద్దిపేట పట్టణంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. కట్టుకున్న భార్యను అతికిరాతంగా హత్య చేశాడు భర్త ఎల్లయ్య. అడ్డుకోబోయిన కూతురి పట్ల కూడా దారుణంగా ప్రవర్తించాడు. ఈ దాడి అనంతరం.. అతడూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. సిద్దిపేటలోని ఆదర్శ్ నగర్‌లో ఎల్లయ్య, శ్రీలత అనే దంపతులు నివసిస్తున్నారు. వీరికి అర్చన(16) అనే కూతురు ఉంది. అయితే.. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. ఇద్దరి మధ్య గొడవ తారాస్థాయికి చేరడంతో ఆగ్రహంతో ఊగిపోయిన భర్త.. కత్తితో భార్య గొంతు కోసేశాడు. ఆమెపై విచాక్షణారహితంగా దాడి చేసేందుకు యత్నించిన తండ్రిని కూతురు అడ్డుకోబోయింది. దీంతో మరింత రెచ్చిపోయిన అతడు.. కూతురినీ రోకలి బండతో కొట్టాడు. భార్యాబిడ్డలపై దాడి అనంతరం.. భయంతో ఎల్లయ్య తన గొంతు కోసుకున్నాడు. ల్లయ్య ఇంట్లో నుంచి కేకలు విన్న స్థానికులు అక్కడకు వచ్చి చూడగా రక్తపుమడుగులో ముగ్గురూ పడిఉండటాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. ముగ్గురినీ ఆస్పత్రికి తరలించారు. అయితే.. అప్పటికే భార్య శ్రీలత(32) మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం.. ఎల్లయ్య, అర్చనలు చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పిపిపి విధానంతో వైద్యసేవలు మరింత ఖరీదు

**- కూటమి ప్రభుత్వ తీరుపై సర్వత్రా ఆందోళన**

**- కేంద్రం ఒత్తిడితో టిడిపి అడుగులు వేస్తోందంటున్న లెఫ్ట్**




**అమరావతి,జనవరి19( వెలుతురు):**
మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పేదలకు పెద్ద దెబ్బని ఓవైపు లెఫ్ట పార్టీలు, మరోవైపు వైకాపాలు గగ్గోలు పెడుతుండగా వాటిని అధికార కూటమి తిరస్కరిస్తోంది. దీనిప ఐ పరస్పర విమర్శలతో ప్రజలను ఏమారుస్తున్నారు తప్ప అసలు విషయం బోధపడడం లేదు. పిపిపి విధానంలో ముఖ్యమైన సేవలన్నీ ప్రైవేటుపరం అయితే ప్రజల ఆరోగ్యం గాలికి వదిలేసినట్లు అవుతుందన్నది ప్రధాన ఆరోపణ. అలాంటిదేమీ లేదని కూటమి చెబుతోంది. ప్రభుత్వ అజమాయిషీలో ఆస్పత్రులు ఉన్నా,సర్కారీ సేవలు అందుబాటులో ఉన్నప్పుడే కార్పొరేట్ల దోపిడీకి రోగులు ఆస్తులు అమ్ముకుంటున్నారు. ఆరోగ్యశ్రీ వంటివి ఉన్నా లేనట్లే. కరోనాలో వైద్యం కార్పొరేటీకరణ వలన ప్రజలు ఆరోగ్య సేవలందక పడ్డ దయనీయ దృశ్యాలను చూశాం. కేంద్రం ఆదేశాల మేరకు అన్ని సేవలకు పిపిపి అంటే పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉంటుందో ఊహకందదని లెఫ్ట్ నేతలు ఆరోపిస్తున్నారు. నయా ఉదార విధానాల యుగంలో ప్రపంచంలోని పాలకులు ఉచ్ఛరిస్తున్న తారకమంత్రం పిపిపి అని అన్నారు.. ప్రభుత్వాలు సామాజిక, ప్రజారోగ్యం, సంక్షేమం, మౌలిక వసతులకు నిధులు ఖర్చు చేయలేని పరిస్తితిని తెచ్చిపెడుతున్నాయని వారి ఆప్రధాన ఆరోపణ. వాటన్నింటినీ ప్రైవేట్‌కు అప్పగిస్తాయి. భారీగా పెట్టుబడులు పెట్టిన సంస్థలు తమ లాభాల వేటలో ప్రభుత్వ అండదండలతో ప్రజలను జలగల్లా పీలుస్తాయిన ఆందోళన చెందుతున్నారు. పీలుస్తాయి. పిపిపి విషయంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఇప్పుడు ముందుకు వెళుతోంది. రాష్ట్రానికి కొత్తగా మంజూరైన వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు టిడిపి కూటమి ప్రభుత్వం దూకుడు ప్రదర్శిస్తున్న సమయంలోనే, ప్రజల అవసరాలకు తగ్గట్టు వైద్య సేవలను విస్తృతం కావించడానికి ప్రభుత్వం వద్ద తగినన్ని ఆర్థిక వనరుల్లేవు. న్యూక్లియర్ మెడిసిన్, సంచార వైద్యం, దంత వైద్యం, రేడియాలజీ సేవలు, కేన్సర్ డే కేర్ సెంటర్ల వంటి వాటికి పిపిపి పద్ధతిని వర్తింపజేయాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసిందని అంటున్నారు. న్యూక్లియర్ మెడిసిన్ సేవల కాంట్రాక్టును 5, 10 ఏళ్లకు ఇవ్వాలంది. చెల్లింపులకూ మార్గదర్శనం చేసింది. ఒక్కో స్కాన్ లెక్కన రెవెన్యూ షేరింగ్, లేదంటే నెల నెలా ప్రత్యేక గ్రాంట్ ఇవ్వాలంది. దీంతో ప్రభుత్వం ప్రజలకు కల్పించాల్సిన వైద్య సేవలు ప్రైవేట్ చేతిల్లోకి వెళతాయి. తొలుత కొంత వరకు ప్రభుత్వం చెల్లింపులు చేసి ఆపై చేతులెత్తేస్తుంది. రోగులందరికీ సేవలు అందవు. చివరికి పేదలు ప్రతి సర్వీస్‌కు ఛార్జీలు భరించాలి. ఇది కచ్చితంగా ప్రభుత్వం ప్రజారోగ్య బాధ్యత నుంచి తప్పించుకోవడమే అవుతుందని లెఫ్ట నేతలు వాదిస్తున్నారు. ప్రతి లోక్‌సభ నియోజకవర్గానికి ఒక మెడికల్ కాలేజి ఉండాలని నీతి ఆయోగ్ పేర్కొనగా, ఆ మేరకు ఎ.పి.కి 17 మెడికల్ కాలేజీలు వస్తే, వాటిలో పదింటిని పూర్తిగా సర్కారీ కాకుండా పిపిపిలో నెలకొల్పుతోంది. అందుకు వ్యతిరేకంగా వామపక్షాలు, ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, యువత, విద్యార్థి, సామాజిక కార్యకర్తల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. పిపిపి వలన వైద్య విద్య మరింత ఖరీదవుతుందని, రిజర్వేషన్లు, సామాజిక న్యాయం దెబ్బతింటాయని, పేద, గ్రామీణ ప్రాంత విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారనే భయాలు అలముకున్నాయి. కళాశాలలకు అనుబంధంగా నడిచే ఆస్పత్రుల్లో వైద్య సేవలకు అధిక మొత్తంలో రోగుల నుంచి ఫీజులు వసూలు చేస్తారన్న ఆందోళనలు నెలకొన్నాయి. ప్రభుత్వమేమో పిపిపి అంటే ప్రైవేటీకరణ కాదని బుకాయిస్తోంది. కాలేజీలలో సీట్లను వేలం వేసి అమ్ముకునేందుకు అవకాశం ఇస్తున్నప్పుడు ఇది ప్రైవేటు కాకుండా ప్రభుత్వరంగం ఎలా అవుతుందో అర్థంకాదు. కేంద్రం ప్రతిపాదించిన పిపిపి ప్రాజెక్టులలో మనవే 30 శాతమని చెప్పడం రాష్ట్రంలో పాలక, ప్రధాన ప్రతిపక్షం కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలను సంపూర్ణంగా బలపరుస్తున్నందున పిపిపి విధానాల అమలుకు రాష్ట్రం ప్రయోగశాలగా మారనుందని వామపక్ష పార్టీల ఆరోపణగా ఉంది.

# చెన్నూరు మున్సిపాలిటీలో ఓటరు జాబితాలో తప్పులు

**- చనిపోయిన వారికి చోటు కల్పించారన్న బాల్క సుమన్**

**ఆదిలాబాద్,జనవరి19( వెలుతురు):**
చెన్నూరు బల్దియా ఓటర్ల జాబితాలో అధికారుల నిర్లక్ష్యం తేటతెల్లమైంది. తొలి జాబితాలోని పొరపాట్లను సరిచేసి ఓటర్ల జాబితాను విడుదల చేయాలన్న ఎన్నికల సంఘం ఆదేశాలను తుంగల తొక్కి తప్పుల తడకలతో ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసింది. ఇందులో ఒక్కో ఓటరు పేరు రెండు నుంచి మూడు వార్డుల్లో ఉండగా.. గతేడాది మృతి చెందిన మృతుల సంఖ్య సైతం జాబితాలో ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ కూడా విమర్శలు గుప్పించారు. చెన్నూరు అధికారులు గొప్ప మనసు చాటుకున్నారని.. సచ్చినోళ్లకు ఓటు హక్కు కల్పించిన పుణ్యాత్ములు అని సెటైర్లు వేశారు. అవసరమైతే ఆత్మలకు టికెట్ ఇవ్వాలని ఈ మహాత్ములు కోరుతారేమో అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ పాలనలో ఇవన్నీ కామనే అని సామాన్యులు అంటున్నారని తెలిపారు. చెన్నూర్ మున్సిపాలిటీలో మొత్తం 19,903 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో 400లకు పైగా మృతులకు ఓట్లు ఉన్నాయి. వార్డుకు 900 నుంచి వెయ్యి మంది ఓటర్లు ఉండగా.. 25 నుంచి 30 వరకు మృతులకు ఓట్లు ఉండటం గమనార్హం. వార్డుల వారీగా ఓటరు జాబితాలను పరిశీలించిన రాజకీయ పార్టీల నాయకులు అధికారుల తీరుపట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ ద్వారానే జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తుండగా.. ఏడాదిలో ఎంతమంది మృతిచెందారనే జాబితా అధికారుల ఉంటుందని.. దాని ప్రకారం మృతుల ఓట్లను తొలగించడం లేదని మండిపడుతున్నారు. ఆత్మల పేర్లను ఓటర్ జాబితాలో పొందపరచడంపై విమర్శలు గుప్పిస్తున్నారు.






Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com